www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 95
శనివారం | 20-7-2024 | పేజీలు: 14
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి సా. 6.00 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 1.49 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: మ. 12.04-1.36; దుర్ముహూర్తం: ఉ. 5.54-7.37; అమృతఘడియలు: రా. 9.14-10.45; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డైనమిక్‌గా పనిచేయండి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడండి

వరద ప్రాంతవాసులను అప్రమత్తం చేయండి

అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

భారీ వర్షాలు, వరదల పరిస్థితిపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

11



అల్లూరి జిల్లా దేవీపట్నంలో నీట మునిగిన గండిపోశమ్మ విగ్రహం

ఎర్రర్.. టెర్రర్

విండోస్-10 కంప్యూటర్లలో 'బ్లూ స్ర్కీన్ ఆఫ్ డెత్ ఎర్రర్'

ప్రపంచవ్యాప్తంగా పలు రంగాలు అల్లకల్లోలం





ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయంలో స్ర్కీన్‌పై ఎర్రర్ మెసేజ్ చూస్తున్న ప్రయాణికులు. విండోస్‌లో బగ్ కారణంగా ఓ కంప్యూటర్ స్ర్కీన్‌పై ప్రత్యక్షమైన మెసేజ్

పలు దేశాల్లో నిలిచిన విమాన, బ్యాంకింగ్ సేవలు

విశాఖలో 4 విమానాల రద్దు.. తిరుపతిలో మరో 2

శంషాబాద్‌లో 39 రద్దు.. 44 ఆలస్యం.. గన్నవరంలో 15 జాప్యం

ఎయిర్‌పోర్టులన్నీ కిటకిట

రద్దీతో ప్రయాణికుల బెంబేలు

పలు దేశాల స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లావాదేవీలకు అంతరాయం

ఆస్పత్రుల్లో కంప్యూటర్ల మొరాయింపు.. రోగులకు ఇబ్బంది

సైబర్ భద్రత సంస్థ 'క్రౌడ్‌స్ట్రైక్' అందించిన అప్‌డేట్‌లో బగ్

సమస్యను గుర్తించి సంక్షోభాన్ని పరిష్కరించిన క్రౌడ్‌స్ట్రైక్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌లో బగ్ కారణంగా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ఆ ఓఎస్‌ను వాడుతున్న డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌ల్లో 'బ్లూ స్ర్కీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' సమస్య తలెత్తింది! కంప్యూటర్ ఆన్ చేయగానే ఒక దశ దాకా వచ్చి బ్లూ స్ర్కీన్ ఎర్రర్ రావడం.. మళ్లీ దానంతట అదే రీస్టార్ట్ కావడం.. ఒక లూప్‌లో జరిగింది. ప్రపంచవ్యాప్తంగా విండోస్ ఓఎస్ వాడే డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌ల సంఖ్య దాదాపు 73 శాతం దాకా ఉండడం.. ఆ కంప్యూటర్లన్నీ ఆన్ కాకుండా మొరాయించడంతో పెను సంక్షోభమే తలెత్తింది! చాలా దేశాల్లో విమానాలు ఎగరలేదు! బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లావాదేవీలు జరగలేదు! పలు మీడియా సంస్థల ప్రసారాలు నిలిచిపోయాయి. వ్యాపారాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఆస్పత్రుల్లో కంప్యూటర్లు పనిచేయక.. పేషెంట్లు కొన్ని గంటలపాటు

మిగతా 2వ పేజీలో...



గండి పడి ఖాళీ అయిన పెదవాగు ప్రాజెక్ట్



పెదవాగు వరదకు కొట్టుకుపోయిన వేలేరుపాడు-అశ్వారావుపేట ప్రధాన రహదారి

వాన.. వరద!

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం.. తూర్పు, పశ్చిమలో ఎర్ర కాలువ కన్నెర్ర

నీట మునిగిన పలు గ్రామాలు.. గోదావరికి భారీ వరద.. సముద్రంలోకి 4 లక్షల క్యూసెక్కులు

ఉత్తరాంధ్రలో స్తంభించిన జనజీవనం.. కోనసీమ, పశ్చిమ, విశాఖ జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు

తూర్పులో ఒకరు, కోనసీమలో ఒకరు మృతి.. 15 వేలకుపైగా ఎకరాల్లో అన్నదాతకు నష్టం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రం తడిసి ముద్దవుతోంది. వాగులూ, వంకలూ పొంగిపొర్లుతున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా ఉత్తరాంధ్రలోని విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. మరోవైపు గోదావరి నుంచి 4 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కురిసిన వర్షాలతో 15 వేల ఎకరాల్లో నాట్లు నీటమునిగి రైతులకు అపారనష్టం వాటిల్లింది. కోనసీమలో వేటకు వెళ్లిన ఒక మత్స్యకారుడు మృతి చెందగా, తూర్పులో మరో వ్యక్తి ఎర్రకాలువ ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.



కోనసీమ జిల్లా మండపేట గొల్లపుంత కాలనీలో ముంపునకు గురైన వరి చేలు

వేలేరుపాడులో.. జల విలయం

పెద్దవాగుకు గండితో పెనువిధ్వంసం

కొట్టుకుపోయిన కుమ్మరిగూడెం

గుట్టలపైకి 100 కుటుంబాలు

మేతకు వెళ్లిన సమయంలో వరద రాకతో వందలాది పశువులు మృతి

13 గ్రామాల మధ్య రాకపోకలు బంద్

11

అన్నదాతకు వాయు'గండం'

నేటి తెల్లవారుజామున పూరీ వద్ద తీరం దాటే చాన్స్

పెను గాలులతో భారీ వర్ష సూచన

• అంతర్జాతీయ స్థాయిలో రొట్టెల పండుగ: సీఎం



రొట్టెల పండుగ సందర్భంగా నెల్లూరు స్వర్ణాల చెరువు ఘాట్‌లో కిక్కిరిసిన భక్తులు

3

సాఫ్ట్‌వేర్ కొలువే కావాలి

కంప్యూటర్ సైన్స్‌లో 93% సీట్లు భర్తీ

ఈసీఈలో 87%, ఈఈఈ 71%, మెకానికల్ 61%, సివిల్ 62%

30 బ్రాంచీల్లో వంద శాతం నిండిన సీట్లు

ఒక బ్రాంచిలో ఒక్క సీటూ భర్తీ కాలేదు

మొత్తం సీఎస్ఈ మయంగా బీటెక్ విద్య

ట్రెండ్‌కు తగ్గట్టుగా పెరిగిన సీఎస్ఈ సీట్లు

అదే బాటలో కాలేజీలు.. రాష్ట్రంలో పెరిగిన 25 వేల సీట్లు

2

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్! ఇది తప్ప మరేదీ లేదన్నంతగా ట్రెండ్ మారిపోయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే లక్ష్యంగా విద్యార్థులు బీటెక్ కోర్సుల్లో చేరుతున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ.. చివరికి బ్లాక్ చైన్ కోర్సు అయినా పర్లేదు! ఈ నేపథ్యంలోనే ఏఐసీటీఈ ఈ ఏడాది కాలేజీలకు సీట్ల పరిమితిని ఎత్తేసింది. దీంతో గతేడాదితో పోలిస్తే ఇప్పుడు రాష్ట్రంలో దాదాపు 25 వేల సీఎస్ఈ సీట్లు పెరిగాయి. అయినా మొత్తం భర్తీ అయ్యే పరిస్థితి వచ్చిం ది. మిగతా కోర్సులకు ఆ పరిస్థితి లేదు!

• నమోస్తు శాకంబరీ



శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కూరగాయలు, ఆకుకూరలతో తీర్చిదిద్దిన దుర్గమ్మ రూపం

'పుంగనూరు'లో పెద్దిరెడ్డి సేవలో..

అడ్డగోలుగా రాగానిపల్లె భూముల సెటిల్‌మెంట్

అనర్హుల చేతికి 982 ఎకరాలు.. నాడు అక్రమార్కులకు జేసీ, కలెక్టర్ అండ

రఫ్ పట్టాను నిర్ధారించిన చిత్తూరు జేసీ.. ఆర్డర్ ఇవ్వకుండానే రికార్డుల మార్పిడి

అప్పీల్ చేయాల్సిన కలెక్టరే వత్తాసు.. ఎల్లుండి కమిషనర్ కోర్టులో విచారణ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన భారీ భూ అక్రమాల్లో ఇదొకటి. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగానిపల్లెలో 982 ఎకరాల భూమిని నిబంధనలకు పాతరేసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనుషుల పేరిట మార్చారు. ఎస్టేట్‌ల రద్దు చట్టం-1948 అమలులో ఇదో చీకటి అధ్యాయం. బహుశా దేశంలో మరెక్కడా జరిగి ఉండదు. మంత్రి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు కూడబలుక్కొని భూమిని అనర్హుల చేతిలో పెట్టారు. ఆ భూమిపై రైత్వారీ పట్టాలు జారీ చేస్తూ ఎలాంటి ఆదేశమూ ఇవ్వలేదు. కనీసం సెటిల్‌మెంట్ అధికారి వద్ద అప్పీల్ చేయలేదు. ప్రత్యేక విచారణ జరగలేదు. కేవలం ఓ రఫ్ పట్టాను మాత్రమే నిర్ధారించారు. అంతే.. ఆగమేఘాల మీద ఆ భూమి రికార్డులు మార్చారు. ఒకే రోజులో సర్వే చేశారు. భూమిని సబ్ డివిజన్ చేశారు. ఆ తర్వాత ఆ భూమి నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరుల చేతికి చిక్కింది. ఈ చీకటి చరిత్రలో నాటి చిత్తూరు జేసీ, నేటి తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, నాటి చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్ కీలక పాత్రధారులని తాజాగా వెలుగుచూసింది. రెవెన్యూ ఉద్యోగులు చిన్న తప్పులు చేస్తేనే ఒంటికాలి మీద లేచే అఖిల భారత సర్వీసు అధికారులు... ఎలాంటి ఉత్తర్వులూ లేకుండానే 982 ఎకరాల భూమిని పరాధీనం చేశారు. మరి వారిని ఏం చేయాలి? రాగానిపల్లెలో 982 ఎకరాల విలువైన భూమి పరాధీనంపై వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఆ భూమికి సంబంధించిన రఫ్ పట్టాను నాటి చిత్తూరు జాయింట్ కలెక్టర్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ హోదాలో నిర్ధారించారు. ఆ తర్వాత భూమి రికార్డులను ప్రైవేటు వ్యక్తుల పేరిట

మిగతా 12వ పేజీలో...



నీతి ఆయోగ్ సభ్యులతో సమావేశమైన చంద్రబాబు

పేదల జీవితాలు మార్చాలి

ప్రతి సామాన్యుడికీ ఫలాలు అందాలి

సంపద సృష్టి విధానాలకు ప్రాధాన్యం

ఏఐ హబ్‌లుగా అమరావతి, వైజాగ్

వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం విజన్-2047

నీతి ఆయోగ్‌తో భేటీలో చంద్రబాబు

12



రేసు నుంచి బైడెన్ అవుట్?

రేపటిలోగా ప్రకటనకు అవకాశం!

అయితే కమలా హ్యారిస్‌కు మద్దతివ్వబోనని స్పష్టీకరణ

ఆయన అనారోగ్యంపై డెమోక్రాట్ల ఆందోళన

అభ్యర్థిత్వంపై పునఃపరిశీలనకు ఒబామా పిలుపు

2

ఖేద్కర్.. 12సార్లు సివిల్స్

నకిలీ పత్రాలతో హాజరైనట్టు గుర్తింపు

కేసు నమోదు చేసిన యూపీఎస్సీ

ఐఏఎస్ ట్రైనీగా ఆమె అభ్యర్థిత్వం రద్దు?

రాష్ట్రపతి పాలన విధించాలి

రాష్ట్ర పరిస్థితులపై ఢిల్లీలో 24న ధర్నా: జగన్

లా అండ్ ఆర్డర్ లేదనడానికి రషీద్ హత్యే నిదర్శనం

పల్నాడు ఎస్పీ మారిన రెండ్రోజులకే చంపారు

పథకం ప్రకారమే చంపి జిలానీ ఒక్కడిపైనే కేసా?

పథకాలివ్వకుండా బాబు మోసం చేస్తున్నారు

జనం ప్రశ్నించకుండా ఉండేందుకే భయానక వాతావరణం సృష్టి: జగన్



వినుకొండలో రషీద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగన్

వినుకొండ, జూలై 19: రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆరాచకాలపై ఢిల్లీలో 24న వైసీపీ ధర్నా చేస్తుందని ప్రకటించారు. పల్నాడు

మిగతా 12వ పేజీలో...

జగన్ 'కారు' కథలు!

వినుకొండ పర్యటనలో హైడ్రామా.. ఐదు నిమిషాల్లోనే 'సఫారీ' దిగిన జగన్

కారు బ్రేక్‌డౌన్ అని వైసీపీ తప్పుడు ప్రచారం.. వినుకొండ దాకా అదే కాన్వాయ్‌లో సఫారీ

ముందురోజే విజయనగరం నుంచి రాక.. ఫార్చ్యూనర్ లేదా ప్రడో కావాలని 'తాడేపల్లి' డిమాండ్

అలాంటివి లేవంటూ సఫారీ పంపిన పోలీసులు.. విపక్షనేతగా చంద్రబాబు వాడిందీ అదే

అందుకే.. జగన్‌కు నచ్చలేదా అనే అనుమానం.. యాగీకి అదే కారణం కావొచ్చనే వాదన

12

12 సార్లు సివిల్స్ రాసిన పూజా ఖేద్కర్



నకిలీ పత్రాలతో హాజరైనట్టు గుర్తింపు

యూపీఎస్‌సీ కేసు నమోదు .. ఆమె అభ్యర్థిత్వం రద్దుకు చర్యలు

న్యూఢిల్లీ, పుణె, జూలై 19: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన ఆమె నిబంధనలకు విరుద్ధంగా 12 సార్లు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరైనట్టు గుర్తించింది. దీంతో ఆమెపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం తెలిపింది. అంతేకాకుండా సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2022 నుంచి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దుతోపాటు భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా బహిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఆ షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వడానికి రెండు వారాలు గడువు ఇచ్చింది. ఆమె తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటో, సంతకం, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసానికి పాల్పడినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని దీంతో.. పూజా ఖేద్కర్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్టు తెలిపింది. పూజ 2012 నుంచి ఇప్పటి వరకూ 12 సార్లు సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరైనట్టు గుర్తించడంతో ఆమెకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు ఇద్దరు సీనియర్ అధికారులు తెలిపారు. వాస్తవానికి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసేందుకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 32 ఏళ్ల వరకు ఆరుసార్లు మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఓబీసీ అభ్యర్థులకు 35 ఏళ్లు, ఓబీసీ దివ్యాంగ అభ్యర్థులకు 42 ఏళ్లు వచ్చేవరకు 9 సార్లు అవకాశం ఉంటుంది. కానీ, ఆమె నకిలీ పత్రాలతో యూపీఎస్‌సీని మోసంచేసి 12 సార్లు పరీక్ష రాశారని అధికారులు పేర్కొన్నారు.

కాగా, పూజా ఖేద్కర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం తన నివేదికను శుక్రవారం యూపీఎస్‌సీకి సమర్పించింది. ఆ కాపీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీకి కూడా పంపించింది. కాగా.. పూజా ఖేద్కర్ కేసుకు సంబంధించిన అంశాలు యూపీఎస్‌సీ నియామక ప్రక్రియ సమగ్రతపై సందేహాలు కలిగేలా చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. పూజా ఖేద్కర్‌పై యూపీఎస్‌సీ కేసు నమోదు చేయడంతో ఆమె శుక్రవారమే వాషిమ్ జిల్లాను వదిలి వెళ్లిపోయారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ గెస్ట్ హౌస్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చట్టం తన పని చేసుకుపోతుందని అన్నారు. తాను త్వరలోనే తిరిగొస్తానని చెబుతూ కారు ఎక్కి నాగపూర్ బయల్దేరి వెళ్లారు. 2023 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐఏఎస్‌గా ఎంపికైన పూజ ఈ నెల మొదటి వారంలో పుణె నుంచి వాషిమ్‌కు అసిస్టెంట్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, పూజా ఖేద్కర్ తల్లికి సంబంధించిన ఇంజనీరింగ్ సంస్థను పింప్రి-చించ్‌వాడ నగరపాలక సంస్థ శుక్రవారం సీజ్ చేసింది. దాదాపు రూ.2లక్షలకు పైగా ఆస్తి పన్ను బకాయిలు ఉండడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. పూజా తల్లి మనోరమ ప్రస్తుతం పుణె పోలీసుల అదుపులో ఉన్నారు.

పోర్న్ వీడియోలు చూపి అసభ్యంగా తాకారు!

- విమానంలో మహిళకు 'జిందాల్' సీఈవో వేధింపులు
- సంస్థ వ్యవస్థాపకుడు నవీన్‌కు బాధితురాలి ఫిర్యాదు..

న్యూఢిల్లీ, జూలై 19: జిందాల్ స్టీల్ సీఈవో దినేశ్ కుమార్ తనకు పోర్న్ వీడియోలు చూపి లైంగికంగా వేధించారంటూ ఓ మహిళ ఆ సంస్థ వ్యవస్థాపకుడు నవీన్ జిందాల్‌కు 'ఎక్స్' వేదికగా ఫిర్యాదు చేశారు. విమానంలో తన పట్ల జరిగిన దారుణాన్ని ఆమె ఓ పోస్టులో వివరించారు. 'కోల్‌కతా నుంచి అబుధాబి వెళ్తున్న విమానంలో నా పక్కనే దినేశ్ కూర్చొన్నారు. నాతో మాటలు కలిపిన ఆయన తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. సినిమాలు చూడటమంటే ఇష్టమేనా అని అడుగుతూ ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూపుతూ నన్ను అసభ్యంగా తాకారు. దీంతో షాక్‌కు గురైన నేను వాష్‌రూమ్ వద్దకు వెళ్లి విమాన సిబ్బందికి విషయం చెప్పాను. వారు నన్ను మరో చోట కూర్చొబెట్టి జాగ్రత్తగా చూసుకున్నారు. అప్పటికీ నేను ఎక్కడికెళ్లానంటూ నా గురించి సిబ్బందితో ఆయన ఆరా తీస్తూనే ఉన్నారు. విమానం ల్యాండ్ అవగానే అక్కడి పోలీసులకు కూడా విమాన సిబ్బంది ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై ఆయన్ను ప్రశ్నించినప్పుడు కూడా కాదని ఖండించలేదు. ఇది ఎవరికైనా జరగొచ్చు. అందుకే మీ దృష్టికి తెస్తున్నాను. ఈ వ్యక్తి సంస్థలోని మహిళా ఉద్యోగుల పట్ల ఏ విధంగా ప్రవరిస్తున్నాడో..?' అని పేర్కొంటూ నవీన్ జిందాల్ ఖాతాకు ట్యాగ్ చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

మహిళ ఫిర్యాదుపై నవీన్ జిందాల్ స్పందించారు. 'మీరు చేసిన పనికి ధన్యావాదాలు.. దీనికి చాలా ధైర్యం కావాలి. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు చేయాల్సిందిగా మా బృందాన్ని కోరతా. అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటాం' అని హామీనిచ్చారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి ఫరూక్

- ముచ్చుమర్రి ఘటనలో కుటుంబానికి మంత్రుల పరామర్శ
- రూ.10లక్షల పరిహారం అందజేత

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 19: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ముచ్చుమర్రి ఘటనపై మంత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని శుక్రవారం మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 లక్షల పరిహారం చెక్కును చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. మంత్రులతో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ 'అత్యాచారానికి గురైన బాలిక మృతదేహం లభ్యమయ్యాక వచ్చి కుటుంబాన్ని పరామర్శిద్దామనుకున్నాం.. కానీ 13 రోజులైనా మృతదేహం లభించకపోవడం దురదృష్టకరం. బలిక కుటుంబంలోని ఇద్దరు పిల్లల చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అన్నారు. అలాగే, కుటుంబ పోషణ కోసం చిన్నారి తల్లికి ఏదైనా ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ రాజకుమారిని ఆదేశించామన్నారు. ముచ్చుమర్రి ఘటన యావత్ సమాజం తలవంచుకునే విధంగా ఉందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు మరొకరు చేయాలంటే భయపడే విధంగా కఠినంగా శిక్ష పడేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారు.

ట్యాబ్‌ల వల్లే యువత చెడిపోతోంది

గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లవల్లే విద్యార్థులు చెడిపోతున్నారు. వాటి హిస్టరీ చూస్తే విద్యార్థులు చూస్తున్న కంటెంట్ ఏమిటో అర్థమవుతుంది. విద్యార్థులను ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు, గంజాయికి జగన్ ప్రభుత్వం అలవాటు చేసింది. ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన శిక్షలు పడే విధంగా సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. బాలిక మృతదేహం లభించేంత వరకు ఊరిలోనే ఉంటా. - బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

ప్రముఖ కవి అడిగోపుల కన్నుమూత

- 28 కవితాసంపుటాలు వెలువరించిన వెంకటరత్నం
- ఇంజనీరుగా పదవీ విరమణ.. తిరుపతిలో స్థిర నివాసం
- నేడు స్వస్థలం నెల్లూరుకు భౌతికకాయం తరలింపు



తిరుపతి(కల్చరల్), జూలై 19: ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం(83) శుక్రవారం ఉదయం తిరుపతిలో కన్నుమూశారు. 50 ఏళ్లుగా కవిత్వం రాస్తున్న ఆయన 28 కవితా సంపుటాలను వెలువరించారు. ఆయన స్వస్థలం నెల్లూరు. ఇంజనీరుగా నాగార్జున వర్సిటీలో ఉద్యోగ విరమణ పొందిన తరువాత తిరుపతిలో స్థిరపడ్డారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలకు స్పందించి కవిత్వం రాశారు. ఇటీవలే ఆయన కవితాసంపుటి 'నిలువెత్తు సంతకం' ఆవిష్కరణ జరిగింది. నూతలపాటి, తానా, విశాలాక్షి సహా 20కిపైగా సత్కారాలను ఆయన అందుకున్నారు. అడిగోపుల వెంకటరత్నం రచనలపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, నాగార్జున యూనివర్సిటీల్లో పరిశోధనలు జరిగాయి. కాగా, తిరుపతి ఎన్‌జీవో కాలనీలోని వెంకటరత్నం నివాసంలో వారి భౌతికకాయాన్ని పలువురు సాహితీకారులు సందర్శించి, నివాళి అర్పించారు. వెంకటరత్నం కుమారుడు విదేశాల నుంచి రావలసి ఉంది. దీంతో శనివారం మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఆయన భౌతికకాయాన్ని స్వస్థలం నెల్లూరుకు తరలించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ప్రధాన నిందితుడు పింకీరౌత్ అరెస్టు
- మరో 15 మంది కూడా.. 90 కిలోల గంజాయి స్వాధీనం
- ఏవోబీ నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తింపు

విజయవాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏవోబీ సరిహద్దుల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్న 15 మందిని విజయవాడ టాస్క్‌ఫోర్స్, యాంటీ నార్కోటిక్ సెల్ పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ, తెలంగాణలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్న కింగ్ పిన్‌గా భావిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను డీసీపీ టి.హరికృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరి శుక్రవారం వెల్లడించారు. మాచవరం, సూర్యారావుపేట, భవానీపురం, కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో కేసుల్లో ఇరుక్కుని పరారీలో ఉన్నవారిని, తాజాగా కేసులు నమోదైన వారిని పట్టుకున్నారు. ఒడిసాలోని బరంపురానికి చెందిన పింకీరౌత్, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గోగినేని మాధవరావు అలియాస్ మాధవ, తెలంగాణలోని మేడ్చల్ జిల్లా పోతయిపల్లికి చెందిన మురుగన్ మణికంఠ అలియాస్ మ్యాక్సి, సంకేలి గణేష్, పెనమలూరుకు చెందిన షేక్ మొహమ్మద్ గౌస్, అబ్దుల్ హబీబ్, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన మర్రి రఘురాం అలియాస్ రఘు, మాచవరానికి చెందిన కొమ్ము రాకేశ్, భవానీపురానికి చెందిన పాలేటి మమతరాజు, మహమ్మద్ ముజ్జమిల్ సుల్తాన్, షేక్ నజీర్, మత్తే నాని, ఇల్లూరి మధుసూదన్‌రెడ్డి, కృష్ణలంకకు చెందిన అడబాల వంశీ అలియాస్ పండు, అమన్‌సింగ్ అలియాస్ మోనోలను అరెస్టు చేశారు. వీరిలో పింకీరౌత్, మణికంఠ, గణేష్ కేసుల్లో ఇరుక్కుని పరారీలో ఉన్నారు. వారి నుంచి 90.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు నాగేంద్ర, శ్రీధర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎ్రరర్.. టె్రరర్

(మొదటి పేజీ తరువాయి)



వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. అంతర్జాతీయస్థాయిలో సేవారంగం మొత్తం అల్లకల్లోలమైందంటే అతిశయోక్తి కాదు. మన విమానాశ్రయాల్లో అయితే.. ఎన్నడూ లేని విధంగా బోర్డింగ్ పాస్‌లను సిబ్బంది తమ చేత్తో రాసిచ్చారు! కొన్ని విమానాలను దారి మళ్లించారు. కొన్ని విమానాలను రద్దు చేశారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం మనదేశంలో ఈ సమస్య కారణంగా పెద్ద సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. వాటిలో ఒక్క ఇండిగో కంపెనీకి చెందినవే 200కు పైగా ఉన్నట్టు సమాచారం. విమాన టికెట్లను మళ్లీ బుక్ చేసుకునే ఆప్షన్‌గానీ, రీఫండ్ కోరే ఆప్షన్‌గానీ తాత్కాలికంగా పనిచేయడం లేదని ఆ సంస్థ 'ఎక్స్'లో ట్వీట్ చేసింది. క్లౌడ్ సర్వర్ సాఫ్ట్‌వేర్‌లో సమస్య కారణంగా తమ సర్వీసులు ఆలస్యం అవుతున్నాయని.. పలు సర్వీసులు రద్దవుతున్నాయని.. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఇండిగో తన ట్వీట్‌లో పేర్కొంది. ఈ సంస్య వల్ల ఫ్లైట్ ఆపరేషన్స్, పాసింజర్ చెకిన్, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ ఇబ్బందిగా మారినట్టు వెల్లడించింది. రద్దయిన విమానాల ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు రావొద్దని విజ్ఞప్తి చేసింది. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని పేర్కొంది. ఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని.. ఈ సమస్య కారణంగా రష్యాకు తరలించినట్టు సమాచారం. ఇంకా.. స్పైస్‌జెట్, ఆకాశ, విస్తారా, ఇలా విమానాలు రద్దయిపోవడం, ఆలస్యం కావడంతో.. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా పలు ప్రధాన నగరాల్లోని విమానాశ్రయాలు ప్రయాణికులతో కిటకిటలాడిపోయాయి. శంషాబాద్ విమానాశ్రయంలో 39 దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. కంప్యూటర్లు పనిచేయకపోవడంతో టికెట్లపై ప్రయాణికుల పేర్లు, సీటు నంబర్లు, ఇతర వివరాలను చేత్తో రాసిచ్చారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ఇబ్బంది ఎదురుకాలేదని ఎయిర్‌లైన్స్ సిబ్బంది పేర్కొన్నారు. అలాగే.. డిజిటల డిస్‌ప్లే బోర్డులు పనిచేయకపోవడంతో సైన్ బోర్డులపై విమానాల రాకపోకల వివరాలు రాసిపెట్టారు. అటు విశాఖ విమానాశ్రయంలోనూ 4 విమానాలు రద్దు కాగా.. విజయవాడ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మనదేశంలోనే కాదు.. అమెరికా, ఆస్ట్రేలియా సహా పలుదేశాల్లో విమానయాన సంస్థలు మొత్తం సర్వీసులను రద్దు చేయడంతోగందరగోళం నెలకొంది.

బ్యాంకింగ్, వాణిజ్య సేవలు..

మైక్రోసాఫ్ట్ ఓఎస్‌లో బగ్ కారణంగా మనదేశంలో.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ తదితర బ్యాంకుల ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలిగినట్టు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. అయితే, ఎస్‌బీఐ అధికారులు మాత్రం తమ సిస్టమ్స్‌లో ఎలాంటి సమస్యా తలెత్తలేదని వివరణ ఇచ్చారు. ఇతర బ్యాంకులు కూడా తమపై దీనిపై పెద్దగా ప్రభావం లేదని స్పష్టం చేశాయి. మొత్తం మీద 10 బ్యాంకింగ్, బ్యాంకింగేతర వ్యవస్థలపై కొద్దిపాటి ప్రభావం పడిందని ఆర్బీఐ తెలిపింది. అలాగే.. ఈ సమస్య వల్ల ఏంజెల్ వన్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, 5పైసా వంటి బ్రోకరేజీ సంస్థలు, మోతీలాల్ ఓస్వాల్, ఎడెల్‌వెయిస్ వంటివాటి కార్యకలాపాలకు స్వల్ప అంతరాయం కలిగింది. పలు దేశాల స్టాక్ ఎక్స్ఛేంజీలపైనా దీని ప్రభావం పడిందిగానీ.. మన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మాత్రం ఎలాంటి ఇబ్బందీ లేకుండా పనిచేసింది. ఈ సమస్య కారణంగా కొద్దిసేపు తమ ఉత్పత్తి, డిస్పాచ్ ఆపరేషన్స్‌ను నిలిపివేసినట్టు మారుతి సుజుకి ఇండియా ప్రకటించింది. తమ కాంటాక్ట్ సెంటర్‌లో టెలిఫోన్ లైన్లేవీ పనిచేయట్లేదని టాటా మోటార్స్ తెలిపింది. ఈ సమస్యతో మైక్రోసాఫ్ట్ అప్లికేషన్స్ టీమ్, అజూరే వంటివిపనిచేయలేదు. ఇన్‌స్టాగ్రామ్, అమెజాన్, జీమెయిల్ కూడా పనిచేయలేదని కొంతమంది చెప్పారు. ఓఎస్ సమస్యతో తలెత్తిన సంక్షోభంపై కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. అధికారులు మైక్రోసాఫ్ట్‌తో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రకటించారు. దీనిపై 'కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్-ఇన్) మార్గదర్శకాలు జారీచేస్తుందని వెల్లడించారు.

అసలేమిటి సమస్య?

మైక్రోసాఫ్ట్ సహా పలు సంస్థలు.. హ్యాకర్లు, సైబర్ దాడుల నుంచి రక్షణకు క్రౌడ్‌స్ట్రైక్ అనే క్లౌడ్ ఆధారిత సైబర్ సెక్యూరిటీ సంస్థ అభివృద్ధి చేసిన 'ఫాల్కన్' సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తాయి. ఆ సంస్థ తాజాగా ఇచ్చిన అప్‌డేట్‌లోని సెన్సర్ సాఫ్ట్‌వేర్‌లో ఒక బగ్.. ఈ సమస్యకు కారణమైంది. ఈ కారణంగానే కంప్యూటర్లపై బ్లూ స్క్రీన్ ఎర్రర్ వచ్చి.. లూప్‌లో రీస్టార్ట్ అవడం మొదలుపెట్టాయి. సమస్య తమ సాఫ్ట్‌వేర్‌లోనే ఉన్నట్టు గుర్తించామని.. వెంటనే దాన్ని పరిష్కరించామని క్రౌడ్‌స్ట్రైక్ సీఈవో జార్జ్ కర్ట్ ప్రకటించారు. 2011లో జార్జ్‌కర్ట్ మరో ముగ్గురితో కలిసి ఈ సంస్థను టెక్సాస్(అమెరికా)లోని ఆస్టిన్ నగరంలో స్థాపించారు. 2013లో ఈ సంస్థ తన తొలి సాఫ్ట్‌వేర్ ఉత్పత్తి 'క్రౌడ్‌స్ట్రైక్ ఫాల్కన్'ను విడుదల చేసింది. మైక్రోసాఫ్ట్ సంస్థ తన విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌లో దీన్ని నిక్షిప్తం చేసింది. ఇది సంప్రదాయ యాంటీవైరస్‌లకన్నా అత్యంత శక్తిమంతంగా పనిచేస్తుంది. కానీ, ఇప్పుడు ఆ సాఫ్ట్‌వేర్‌లో వచ్చిన బగ్గే అల్లాడించింది.

లోకం తీరు



అరుంధతీరాయ్‌కి అంతర్జాతీయ సంఘీభావం

న్యూయార్క్, జూలై 19: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి జారీ చేయటాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా, కెనడాకు చెందిన 13 ప్రవాస భారతీయ సంఘాలు ఉమ్మడి ప్రకటన జారీ చేశాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దెబ్బతిన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'సాధారణంగానైతే ఇటువంటి ఫలితాలు వచ్చినప్పుడు ప్రభుత్వాలు తమ ఆధిపత్య పోకడలను మార్చుకుంటాయి. కానీ, మోదీ తన నియంతృత్వ ధోరణిని మార్చుకునే అవకాశాలు తక్కువని అర్థమవుతోంది' అని ఈ ప్రకటనలో విమర్శించారు. 2010లో కశ్మీర్ గురించి రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలతో ఉపా కింద అరుంధతీరాయ్, ప్రొఫెసర్ హుస్సేన్‌లపై కేసు నమోదు చేయటాన్ని ప్రస్తావిస్తూ.. 14 ఏళ్ల తర్వాత ఈ కేసును ఎలా తిరగదోడుతారని, మోదీ నిరంకుశ పోకడలకు ఇది నిదర్శనమని అన్నారు.

అమెరికాలో భారత రాయబారిగా వినయ్ క్వాత్రా



న్యూఢిల్లీ, జూలై 19: అమెరికాలో భారత రాయబారిగా విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి వినయ్ క్వాత్రా శుక్రవారం నియమితులయ్యారు. ఆయన ఆదివారమే కార్యదర్శిగా పదవీ విరమణ చేయడం గమనార్హం. త్వరలోనే ఆయన కొత్త బాధ్యతలు చేపడుతారని విదేశాల వ్యవహారాల శాఖ ప్రతినిధి తెలిపారు. క్వాత్రా 2022 మే నెల ఒకటో తేదీ నుంచి ఈ నెల 14 వరకు విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా పనిచేశారు. 1993 నుంచి 2003 వరకు న్యూఢిల్లీలోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో ఐక్యరాజ్యసమితి వ్యవహారాలను చూసేవారు. ఆయన 2015 నుంచి 2017 వరకు ప్రధాని కార్యాలయం (పీఎంఓ)లో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు.

దక్షిణ కొరియా డ్రామాలు చూసినందుకు 30 మంది టీనేజర్ల ఉరితీత


ప్యాంగ్యాంగ్, జూలై 19: దక్షిణ కొరియా డ్రామాలను(వినోద కార్యక్రమాలు) వీక్షించినందుకు 30 మంది టీనేజర్లకు ఉత్తర కొరియా ఉరిశిక్ష అమలు చేసిందని దక్షిణ కొరియా మీడియా పేర్కొంది. దక్షిణ కొరియాను తమ ప్రధాన శత్రువుగా ఉత్తర కొరియా కిమ్ జోంగ్ ఉన్ ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. దక్షిణ కొరియా టీవీ కార్యక్రమాలు సహా అన్ని వినోద ప్రసారాలను ఉత్తర కొరియా నిషేధించింది. పెన్‌డ్రైవ్‌ల ద్వారా ఆ కార్యక్రమాలు ఉత్తర కొరియాలోకి వస్తుంటాయి. అయితే నిషేధించిన ఆ కార్యక్రమాలను చూసినందుకే 30 మంది టీనేజర్లను ఉత్తర కొరియా ఉరితీసిందని దక్షిణ కొరియా మీడియా పేర్కొంది.

రష్యాలో అమెరికా జర్నలిస్టుకు 16 ఏళ్ల జైలు శిక్ష

మాస్కో, జూలై 19: గూఢచర్యానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై అమెరికాకు చెందిన జర్నలిస్టు ఎవాన్ గెర్షికోవిచ్ (32)కు ఓ రష్యా కోర్టు 16 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆయన వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. రష్యా యుద్ధ ట్యాంకుల కంపెనీకి చెందిన రహస్య సమాచారాన్ని అమెరికా గూఢచార సంస్థ సీఐఏకు అందజేసినట్టు ఆయనపై కేసు నమోదయింది. ఈ వ్యవహారంలో రహస్యంగా విచారణ జరిపిన కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన అనంతరం గూఢచర్యం నేరంపై అమెరికా జర్నలిస్టును అరెస్టు చేయడం ఇదే తొలిసారి. అయితే తాను నేరం చేయలేదని ఎవాన్ అన్నారు.

అధ్యక్ష రేసు నుంచి బైడెన్ అవుట్?

రేపటిలోగా ప్రకటనకు అవకాశం!.. అయితే కమలా హ్యారిస్‌కు మద్దతివ్వనని స్పష్టీకరణ



వాషింగ్టన్, జూలై 19: వృద్ధాప్యంతో, అనారోగ్యంతో సతమతమవుతున్నా.. ప్రసంగాలు, డిబేట్ల సమయంలో తడబడుతూ సమర్థంగా వాదనలు వినిపించలేకపోతున్నా.. రెండోసారి అధ్యక్ష పదవిలో కొనసాగి తీరతానని భీష్మించుకున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81).. ఇప్పుడు వెనక్కి తగ్గుతున్నట్లు తెలిసింది. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా తప్పుకొనేందుకు అంగీకరించిన ఆయన.. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ అభ్యర్థిత్వానికి మద్దతివ్వడానికి మాత్రం నిరాకరించారని ఆ పార్టీ వర్గాలను ఉటంకిస్తూ జర్నలిస్టు, న్యూస్‌మ్యాక్స్ చానల్ వ్యాఖ్యాత మార్క్ హాల్పెరిన్ వెల్లడించారు. ఆదివారంలోపు ఆయన తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని గురువారం తెలిపారు. అయితే దీనిపై బైడెన్ గానీ, ఆయన ప్రచార బృందం గానీ ఇంతవరకు స్పందించలేదు. అభ్యర్థిని అధికారికంగా ఖరారుచేసేందుకు డెమొక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సు వచ్చే నెలలో జరుగనుంది. బైడెన్‌కు నిన్నమొన్నటిదాకా అండగా నిలబడిన మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ.. ఇటీవలి కాలంలో ఆయన అనారోగ్యంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాజాగా ఆయనకు కొవిడ్ సోకింది. ఆయన విజయావకాశాలు బాగా తగ్గిపోయాయని ఒబామా పార్టీ సన్నిహితులతో అన్నారు. బైడెన్ అనారోగ్యం ఆందోళన కలిగిస్తోందని.. ఈ నేపథ్యంలో రెండోసారి బరిలో దిగే అంశంపై ఆయన తీవ్రంగా ఆలోచించాలని సూచించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తెలియజేసింది. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో కొన్నాళ్ల కింద జరిగిన డిబేట్‌లో బైడెన్ తేలిపోయాక.. చాలా మంది డెమొక్రాటిక్ సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు, సీనియర్ నేతలు ఆయన తప్పుకోవాలని డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. రేసు నుంచి వైదొలగకపోతే పరాజయం తప్పదని నాన్సీ పెలోసీ కూడా బైడెన్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. మరోవైపు.. కొవిడ్ కారణంగా బైడెన్ ప్రస్తుతం డెలవర్‌లో ఐసొలేషన్‌లో ఉన్నారు. తన అభ్యర్థిత్వంపై లేనిపోని ఊహాగానాలు వద్దని అన్నారు.

మహిళకు ముద్దుపెట్టబోయిన అమెరికా అధ్యక్షుడు!

- బైడెన్ పాత వీడియో వైరల్

వాషింగ్టన్, జూలై 19: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన వింత ప్రవర్తనతో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అధ్యక్ష పదవికి పోటీ నుంచి తప్పుకోవాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలోనే బైడెన్ వేదికలపై విచిత్రంగా ప్రవర్తించడం గమనార్హం. తాజాగా అలాంటి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో ఎప్పటిదనేది తెలియరాలేదు గానీ, అందులో ఓ కార్యక్రమంలో పాల్గొన్న బైడెన్.. వేదికపై ఓ మహిళతో మాట్లాడుతూ అతి దగ్గరగా వెళ్లారు. ఇంకొంచెమైతే ముద్దు పెట్టేసేవారే.. అనిపించింది! పక్కనే ఉన్న ఆయన భార్య జిల్ అప్రమత్తమై ఆయన్ను ఆపినట్లు వీడియోలో కనిపించింది. ఆ తర్వాత భద్రతా సిబ్బంది ఆ మహిళను అక్కడి నుంచి పంపారు. బైడెన్ మానసిక ఆరోగ్యంపై తలెత్తుతున్న అనుమానాలకు బలం చేకూర్చేలా తాజా వీడియో ఉండడం గమనార్హం.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే కావాలి!

- కంప్యూటర్ సైన్స్‌లో 93% సీట్లు భర్తీ
- ఈసీఈలో 87%, ఈఈఈ 71%, మెకానికల్ 61%, సివిల్ 62%

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల ఆసక్తి, మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా ఇంజనీరింగ్ కాలేజీలు సీట్లు మార్చుకుంటున్నాయి. ఒకప్పుడు అన్ని కోర్సులకూ సమ ప్రాధాన్యం, అడ్మిషన్లు ఉండేవి. కొంతకాలంగా సీఎస్ఈ ట్రెండ్ పెరగడంతో ఆ బ్రాంచ్‌లలో సీట్లు పెంచుకుని మెకానికల్, సివిల్, ఈఈఈ లాంటి కోర్సులను అప్రాధాన్య జాబితాలో పెడుతున్నాయి. గతేడాది వరకూ ఒక కాలేజీలో ఒక బ్రాంచ్‌కు 240 సీట్లు దాటి కేటాయించేవారు కాదు. ఆ పరిమితిని ఈ ఏడాది ఏఐసీటీఈ ఎత్తేయడంతో కాలేజీల్లో మిగిలిన బ్రాంచ్‌లలో సీట్లు తగ్గించుకుని సీఎస్ఈలో పెంచుకున్నాయి. అందువల్లే రాష్ట్రంలో మొత్తం 1.81లక్షల సీట్లు ఇంజనీరింగ్‌లో ఉంటే ఒక్క సీఎస్ఈలో లక్ష సీట్లు ఉన్నాయి. మిగిలిన అన్ని బ్రాంచ్‌లు కలిపినా సీఎస్ఈ స్థాయిలో లేవు.

కన్వీనర్ కోటాలో భర్తీ ఇలా

ఇంజనీరింగ్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియ ఇటీవల ముగిసింది. 17న విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ ఏడాది మొత్తం 1.81లక్షల సీట్లు రాష్ట్రానికి మంజూరయ్యాయి. ఇందులో కన్వీనర్ కోటా కింద 1,36,660 సీట్లు ఉంటే, వాటిలో 1,17,136 సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సుల్లో 71,574 సీట్లు ఉండగా 66,504 (92.91శాతం) నిండాయి. ఈసీఈలో 24,121 సీట్లు ఉంటే 21,060 (87.3శాతం), ఈఈఈలో 8,800 సీట్లకుగాను 6,239 (70.89శాతం), మెకానికల్‌లో 7,996 సీట్లకుగాను 4,862 (60.8శాతం), సివిల్‌లో 6,760 సీట్లు ఉంటే 4,166 (61.62శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. సీఎస్ఈతో పాటు సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లో దాదాపు సీట్లు నిండిపోయాయి. అక్కడక్కడా ఒకట్రెండు కాలేజీల్లో మాత్రమే ఉన్న సీఎస్ఈ సీట్లు కూడా భర్తీ అయిపోయాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 284, సీఎస్ఈ(స్పెషలైజేషన్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్)లో 95, సీఎస్ఈ డేటా ఎనలటిక్స్‌లో 62, సీఎస్ఈ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో 48, సీఎస్ఈ బిగ్ డేటా ఎనలటిక్స్‌లో 48 సీట్లు ఉంటే వంద శాతం భర్తీ అయ్యాయి. ఇంజనీరింగ్‌లో మొత్తం 72 బ్రాంచ్‌లు ఉంటే 30 బ్రాంచ్‌లలో వంద శాతం సీట్లు నిండాయి. ఫెసిలిటీస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్ కోర్సులో ఒక్కరు కూడా చేరలేదు. ఏడు బ్రాంచ్‌లలో అడ్మిషన్ల సంఖ్య రెండంకెలు చేరలేదు.

క్యాంపస్‌లో వారికే ప్రాధాన్యం

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు సీఎస్ఈ కోర్సులకే ప్రాధాన్యమిస్తున్నాయి. ఆ తర్వాత కొంతమేర ఈసీఈ కోర్సు చదివిన వారిని పరిగణలోకి తీసుకుంటున్నాయి. మెకానికల్, ఈఈఈ, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు చాలా వరకు దూరమైపోతున్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన వారికి ఆటోమొబైల్, ఇతరత్రా మెకానిక్ లాంటి పెద్ద రంగాల్లో అవకాశాలు ఉంటున్నాయి. సివిల్ ఇంజనీర్లకు నిర్మాణ రంగంలో, ఈఈఈ చదివిన వారికి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో మంచి అవకాశాలున్నా విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌కే మొగ్గు చూపుతున్నారు. సాఫ్ట్‌వేర్‌తో పోల్చి చూస్తే మిగిలిన రంగాల్లో గ్రోత్ తక్కువగా ఉండటం దీనికి కారణం. జీతాల పరంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అత్యంత వేగంగా గ్రోత్ సాధిస్తున్నారు. ఇదే దేశవ్యాప్తంగా విద్యార్థులను సీఎస్ఈ వైపు నడిపిస్తోంది. ఇక గతంలో ఏ బీటెక్ కోర్సు చేసినా హైదరాబాద్, బెంగళూరులాంటి నగరాలకు వెళ్లి కోచింగ్ సెంటర్లలో కోర్సులు నేర్చుకుంటే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వచ్చేవి. ఇప్పుడు అలా ఇంటర్వ్యూలకు వెళ్తున్న వారిలో కూడా తొలుత సీఎస్ఈ బ్రాంచ్ వారికి ప్రాధాన్యత కనిపిస్తోంది. దీంతో మేనేజ్‌మెంట్ కోటాలోనైనా సీఎస్ఈలోనే చేరాలనే లక్ష్యం కనిపిస్తోంది.

కావడి యాత్ర మార్గంలో హోటళ్లపై యజమాని పేరు ఉండాల్సిందే

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదేశం

ఇది భారత సంస్కృతిపై దాడి: కాంగ్రెస్



న్యూఢిల్లీ, జూలై 19: ఉత్తరప్రదేశ్‌లో కావడి యాత్ర సాగే మార్గంలో అన్ని తినుబండారాల దుకాణాలపై వాటి యజమానుల పేర్లు తప్పనిసరిగా ఉండాల్సిందేనని సీఎం యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర పశ్చిమ యూపీలో దాదాపు 240 కిలోమీటర్ల పరిధిలో సాగుతుంది. ఏటా శ్రావణ మాసంలో 11 రోజుల పాటు జరిగే యాత్రలో భాగంగా ఈసారి దాదాపు 3కోట్ల మంది భక్తులు హరిద్వార్‌కు కాలినడకన వెళ్లి, గంగానదీ జలాలను సేకరిస్తారని అంచనా. యాత్ర సాగే మార్గంలోని హోటళ్లపై యజమానుల పేర్లు ప్రదర్శించాలన్న ఆదేశాలు వివాదాస్పదం కావడంపై ముజఫర్‌నగర్ పోలీసులు స్పందించారు. గతంలో యాత్ర మార్గంలో అన్ని రకాలైన ఆహార పదార్థాలను విక్రయించే కొందరు దుకాణదారులు...కావడిధారుల్లో గందరగోళం రేపి, శాంతిభద్రతల సమస్యలు సృష్టించే విధంగా తమ దుకాణాలకు పేర్లు పెట్టుకున్న ఘటనలు వెలుగు చూశాయని గుర్తుచేశారు. ఉపవాస దీక్షలో కావడి యాత్రకు వెళ్తున్న హిందువులకు స్వచ్ఛమైన శాకాహారం ఎక్కడ లభిస్తుందో తెలుసుకోవడానికి ఈ ఉత్తర్వులు ఉపయోగపడతాయని బీజేపీ సమర్థించుకుంది. అయితే, మతపరమైన విభేదాలను సృష్టించే ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని జేడీయూ నేత కేసీ త్యాగి పేర్కొన్నారు. కావడిధారులు ఎవరూ పొరపాటున కూడా ముస్లింలు నడిపే దుకాణాల్లో ఆహార పదార్థాలు కొనుగోలు చేయకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనినే దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష అని, హిట్లర్ జర్మనీలో 'యూదుల బాయ్‌కాట్' అని పిలిచేవారని ధ్వజమెత్తారు. దీనిని భారత సంస్కృతిపై దాడిగా కాంగ్రెస్ అభివర్ణించింది.



కూరగాయలతో ఆలయాన్ని అలంకరించిన దృశ్యం, అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

నమోస్తు శాకంబరీ

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విఘ్నేశ్వరపూజతో ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం వరకు అమ్మవారు ఈ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలోని ప్రతి ప్రదేశాన్ని కూరగాయలతో అలంకరించారు.

– ఆంధ్రజ్యోతి, విజయవాడ

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. వేకువజామున అభిషేక సేవలో పాల్గొని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ హిమా కోహ్లీ

రేపు చాతుర్మాస దీక్షా సంకల్పం

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల పెద్దజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఆదివారం చాతుర్మాస దీక్ష సంకల్పం జరగనుంది. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా పెద్దజీయర్‌స్వామి తిరుమల బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న జీయంగారి మఠం నుంచి చిన్నజీయంగారు శిష్యబృందంతో కలిసి వరాహస్వామి ఆలయాన్ని, తర్వాత స్వామి పుష్కరిణిని సందర్శిస్తారు. అనంతరం శ్రీవారి ఆలయానికి వస్తారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో, ఆలయ అధికారులు ఈ బృందాన్ని ఆహ్వానిస్తారు. జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్నాక రంగనాయక మండపంలో పెద్దజీయర్‌స్వామికి మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్‌స్వామికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరిస్తారు.

అంతర్జాతీయ స్థాయిలో రొట్టెల పండుగ



బారాషహీద్ దర్గాలో భక్తజనం, రొట్టెల పండుగకు హాజరైన భక్తులతో వర్చువల్‌గా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



- దర్గా అభివృద్ధికి రూ.5 కోట్లు విడుదల: ముఖ్యమంత్రి
- భక్తులతో వర్చువల్‌గా మాట్లాడిన చంద్రబాబు
- రాష్ట్రానికి మంచి జరిగేలా ప్రార్థించాలని సూచన

అమరావతి/నెల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మత విశ్వాసాలకు ప్రతీకైన రొట్టెల పండుగను భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. 2014లో రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. బారాషాహీద్ దర్గా అభివృద్ధికి రూ.5 కోట్లు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా రొట్టెల పండుగకు వచ్చిన భక్తులు, స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులతో సీఎం మాట్లాడారు. బారాషహీద్ దర్గా చరిత్రను, రొట్టెల పండుగ విశిష్టతను ఆయన వివరించారు. రొట్టెల పండుగకు వందల ఏళ్ల చరిత్ర ఉందని, అన్ని మతాల వారు ఏటా 10 నుంచి 15 లక్షల మంది ఈ పండుగకు వచ్చి రొట్టెలు అందుకోవడం గొప్ప విషయమన్నారు. దేవుడిపై నమ్మకంతో ప్రపంచం నడుస్తోందని.. ఆ నమ్మకాలను, ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. రాకెట్ ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలు కూడా ముందు రోజు వెళ్లి దేవుడికి దండం పెట్టుకుని తమ ప్రయత్నం విజయవంతం అయ్యేలా చూడాలని కోరుకుంటారని అదే నమ్మకం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రార్థనా మందిరం నిర్మాణం నిలిచిపోయిందని, బారాషహీద్ దర్గా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్‌లో దర్గా అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రానికి మంచి జరిగేలా ప్రార్థించాలని రొట్టెల పండుగకు వచ్చిన భక్తులను సీఎం కోరారు. కాగా.. రొట్టెల పండుగలో మూడో రోజు స్వర్ణాల చెరువు తీరం భక్తులతో కిటకిటలాడింది. అత్యంత కీలకమైన గంధ మహోత్సవం శుక్రవారం వేకువజామున వైభవంగా జరిగింది. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేని నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



వరాల రొట్టెలు మార్చుకుని నీటిని తలపై చల్లుకుంటున్న హిందూ, ముస్లిం మహిళలు



బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బెజవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- బార్ కౌన్సిల్ చైర్మన్‌కు బీబీఏ వినతి

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బెజవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం శుక్రవారం బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించింది. న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ గడువు ముగిసిందని, వెంటనే రెన్యువల్ చేయాలని, సీపీవీ విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది.

వేలానికి 300 టన్నుల ఎర్రచందనం

మంగళం, జూలై 19: రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో 300 టన్నుల ఎర్రచందనం వేలానికి అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అటవీశాఖ గ్లోబల్ టెండర్లకు సిద్ధమవడంతో ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇందుకు సంబంధించిన చర్యలు చేపట్టింది. కాగా, పట్టుబడిన ఎర్రచందనం తిరుపతిలోని తిమ్మినాయుడుపాళెం సమీపంలోని సెంట్రల్ గోడౌన్‌లో దాదాపు 5వేల టన్నులు నిల్వ ఉంది.

జస్టిస్ రవీంద్రబాబు పదవీ విరమణ

- ఘనంగా వీడ్కోలు పలికిన హైకోర్టు
- న్యాయసేవలను కొనియాడిన సీజే జస్టిస్ ఠాకూర్



జస్టిస్ రవీంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మొదటి కోర్టు హాలులో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ రవీంద్రబాబు అందించిన న్యాయసేవలను కొనియాడారు. న్యాయాధికారిగా, హైకోర్టు న్యాయమూర్తిగా ఎన్నో క్లిష్టమైన కేసులు పరిష్కరించారని చెప్పారు. హైకోర్టులోని వివిధ కమిటీల్లో సభ్యుడిగా విశిష్ట సేవలు అందించడంతో పాటు రిజిస్ట్రార్ జనరల్‌గా పరిపాలనను మెరుగుపర్చారని గుర్తుచేశారు. పదవీ విరమణ తరువాత జస్టిస్ రవీంద్రబాబు శేషజీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. జస్టిస్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. క్రిమినల్ అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి బార్‌లోని సీనియర్ న్యాయవాదులు సహరించాలని కోరారు. వృత్తి జీవితంలో తనకు సహాయ సహకారాలు అందించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. జస్టిస్ రవీంద్రబాబు అందించిన న్యాయసేవలను అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ రవీంద్రబాబు కుటుంబ సభ్యులు, రిజిస్ట్రార్‌లు, ఏఏజీ సాంబశివ ప్రతాప్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ హెచ్చరికలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలబరినుంచి జోబైడెన్ తప్పుకోబోతున్నారని, సదరు నిష్క్రమణ ఉన్నతంగా, గౌరవంగా ఉండేందుకు ఏమిచేయాలన్న వ్యూహరచన ప్రస్తుతం సాగుతోందని వార్తలు వస్తున్నాయి. ఇటీవలి ప్రెసిడెన్షియల్ డిబేట్ తరువాత బైడెన్‌కు ఎదురుగాలి మరీ ఎక్కువైంది. ఒకపక్క సర్వేలు బైడెన్ వెనుకబడినట్టుగా చెబుతూంటే, మరోపక్క ఆయన ఇలా మాటల్లోనూ, చేతల్లోనూ తడబడుతూంటే ఈమారు విజయం అసాధ్యమని డెమొక్రాట్లకు అనిపించింది. ఇంతలో, ట్రంప్‌మీద హత్యాయత్నం జరగడంతో ఉన్న ఆశలు కూడా నీరుగారిపోయాయి. ట్రంప్ రెండడుగులు ముందున్నారని సర్వేలు తేల్చేశాయి. దీనికితోడు, ఇప్పుడు బైడెన్‌ను కరోనా చుట్టుముట్టి కదల్లేకుండా చేసింది. ఇన్ని కష్టాల మధ్య, ఇంతవయసులో పదవికోసం పాకులాడటం దేనికని బైడెన్‌కు జ్ఞానోదయం కలిగివుండవచ్చు. ఆయన తప్పుకొని ఆ స్థానంలో ఎవరు వచ్చినా ఈ ఆఖరుదశలో ఏమి అద్భుతాలు చేయగలరన్న ప్రశ్న ఉండనే ఉంది. ఎవరిని అధికారపీఠంమీద కూచోబెట్టాలన్నది అంతిమంగా అమెరికన్ల ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుంది కానీ, అది డోనాల్డ్ ట్రంప్ అయినపక్షంలో అమెరికా విదేశాంగవిధానంమీద ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందన్న మాట నిజం.

ఇటీవల రిపబ్లికన్ పార్టీ కన్వెన్షన్ సందర్భంగా తైవాన్‌కు సంబంధించి ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అలవోకగా అన్నవి కావు. చైనానుంచి దానిని రక్షించాలంటే అమెరికాకు తైవాన్ మరింత ఎక్కువ కప్పం కట్టాలన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. తైవాన్‌ను కాపాడటానికి చాలా ఖర్చవుతోందనీ, అమెరికా చిప్‌మార్కెట్‌ను తన్నుకుపోయి, ఇక్కడి ఉపాధి అవకాశాలను చావుదెబ్బతీసిన తైవాన్ భద్రతకు పూచీపడాలంటే ఆ రేటు ఎక్కువగా ఉంటుందని ఆయన నర్మగర్భమైన వ్యాఖ్యలు చేశారు. తైవాన్ అతిజాగ్రత్తగా ప్రతిస్పందించింది కానీ, ట్రంప్‌మాటలు అమెరికా విశ్లేషకులకు, మీడియాకు ఆగ్రహాన్ని కలిగించాయి. నేను అధికారంలోకి రాగానే నువ్వు తైవాన్‌తో యుద్ధం చేయి, దానిని వశం చేసుకో, నేను నోరువిప్పను, జోక్యం చేసుకోను అని ట్రంప్ ముందే చైనాకు సందేశం ఇచ్చేశారని, దానిముందు సాగిలబడ్డారని సుప్రసిద్ధ అమెరికన్ దినపత్రిక తీవ్రంగా విరుచుకుపడ్డది. తైవాన్‌ను ఆదినుంచీ అమెరికా కాపాడుకొస్తున్నది. ఈ మధ్యన చైనా సైనికకవాతులతో, యుద్ధవిమానాలతో తైవాన్‌ను బెదిరించినప్పుడు అమెరికా మరింత తీవ్రంగా రంగంలోకి దిగింది. తైవాన్‌ను తనలో విలీనం చేసుకోవాలన్న చైనా లక్ష్యం, దాని ప్రాతిపదికలు, విధానాలు అందరికీ తెలిసినవే. ఈ నేపథ్యంలో, తైవాన్‌ను ట్రంప్ తూలనాడటం, అది తన భద్రతను తానే చూసుకోవాలని అనడం, 68మైళ్ళ దూరంలో ఉన్న చైనా దానిని దురాక్రమించిన పక్షంలో 9, 500మైళ్ల దూరంలో ఉన్న అమెరికా వచ్చి రక్షించడం అసాధ్యమన్న భావన వెలిబుచ్చడం ఆశ్చర్యం కలిగిస్తాయి. ఏటా కొన్ని వందలకోట్ల ఆయుధసామగ్రిని అమెరికానుంచి అది కొంటున్నది. పెడుతున్న ఖర్చుకంటే అమెరికా పొందుతున్నదే ఎక్కువని లెక్కలు చెబుతున్నాయి. గత నలభైయేళ్ళ కాలంలో కనీసం వందసార్లు అమెరికా అమ్మిన ఆయుధాలన్నీ బేరం లేకుండా కొని తైవాన్ తన రక్షణఫీజు చెల్లించుకుంటూనే ఉంది. అయినా కూడా ట్రంప్, అనంతరం ఆయన విధాన సలహాదారు ఈ వ్యాఖ్యలు చేశారంటే, తైవాన్‌నుంచి మరింత పిండుకోవాలన్నది ఉద్దేశం కావచ్చు, లేదా చైనాకు శాంతి, సయోధ్యల సందేశమూ కావచ్చు. చైనాతో బేరసారాలకు తైవాన్‌ను ఎరవేసేప్రయత్నమూ కావచ్చు. ఈ సందర్భంగా ఆయన అమెరికాను ఓ బీమాకంపెనీతో పోల్చడం విశేషం. మరి, ప్రాణంమీదకు వస్తే, తైవాన్‌ను వచ్చి రక్షిస్తుందా? ట్రంప్ వ్యాఖ్యల్లో లేదన్న సమాధానం స్పష్టంగా ఉంది. ఆయన గతంలో జింగ్‌పింగ్‌తో మాట్లాడుతూ ఒకే చైనా విధానానికి సానుకూలత వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ యుద్ధం విషయంలోనూ ట్రంప్ ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. తాను అధికారంలో ఉండివుంటే యుద్ధమే జరిగేది కాదన్న ట్రంప్ ఆ తరువాత ఉక్రెయిన్‌కి అందించే ఆయుధ, ఆర్థిక సహాయాల విషయంలో ఇప్పటివిధానానికి పూర్తిభిన్నంగా వ్యాఖ్యలు చేస్తూ జెలెన్‌స్కీని ఇరుకునపెట్టారు. తాను గెలిస్తే సైనికసాయం ఆపేస్తానని ప్రకటించి, పుతిన్‌తో బేరాలాడుకున్న విమర్శలు ఎదుర్కొన్నాడు. తైవాన్, ఉక్రెయిన్, గాజా ఇత్యాది విషయాల్లో రేపు ఒకవేళ అధికారంలోకి వస్తే గనుక ట్రంప్ ఏవిధంగా వ్యవహరిస్తారో చూడాలి.

బడ్జెట్: సగటుజీవికి భరోసానిచ్చేనా?



■ పి. చిదంబరం

'పళని' పలుకు

దేశ ఆర్థిక వ్యవస్థ సదా అభివృద్ధిదాయకంగా ఉండాలని కోరుకోనివారు ఎవరు ఉంటారు? సామాన్యుల శ్రేయస్సును హృదయపూర్వకంగా కోరుకుంటున్న వ్యక్తిగా కేంద్ర వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే తరుణంలో సంబంధిత విషయాలను నేను శ్రద్ధగా చదువుతాను, నిశితంగా ఆలోచిస్తాను, సవివరంగా రాస్తాను... అయినా బడ్జెట్ రోజున తరచు అసంతృప్తితోనే పార్లమెంటు నుంచి ఇంటికి వెళ్లడం పరిపాటి అయిపోయింది. ఆ తరువాత ప్రజల వద్దకు వెళతాను, శాసనసభ్యులు, ఆర్థికవేత్తలు, వ్యాపారస్తులు, రైతులు, మహిళలు, యువజనులు, మరీ ముఖ్యంగా పార్టీ కార్యకర్తలతో సహా వివిధ జీవన రంగాలలోని వారితో మాటామంతీ జరుపుతాను. కొత్త బడ్జెట్ గురించి ప్రజల, ముఖ్యంగా స్థానిక మార్కెట్లలో సామాన్యుల ప్రతిస్పందనలు ఎలా ఉన్నాయో పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకుంటాను గత పదేళ్లుగా ఏటా, బడ్జెట్ 'ప్రకటనలు' కేవలం 48 గంటలలోనే జాడలేకుండా పోవడాన్ని, ప్రజల ఆసక్తి బడ్జెటేతర అంశాలపైకి మళ్లడాన్ని నేను గమనిస్తూ వస్తున్నాను.

కేంద్ర వార్షిక బడ్జెట్‌లు ఎందుకు ఆశాభంగం కలిగిస్తున్నాయి? ప్రజల జీవన వ్యయాల వాస్తవాలపై బడ్జెట్ రూపకర్తలకు అవగాహన కొరవడడంతో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై నిష్పాక్షిక అంచనాకు రావడంలో విఫలమవుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లు కలిగిస్తున్న ఆశాభంగానికి అదే ప్రధాన కారణమని నేను విశ్వసిస్తున్నాను. ఈ నెల 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2024–25 వార్షిక బడ్జెట్‌నే తీసుకోండి. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై వాస్తవిక అంచనా వెల్లడించే సత్యాలు ఏమిటి? యువజనుల, కుటుంబాల శ్రేయస్సుకు, సామాజిక శాంతికి నిరుద్యోగిత అతి పెద్ద సవాల్‌గా ఉన్నది. కొన్ని డజన్ల ఉద్యోగ ఖాళీలకు వేలాది యువజనులు దరఖాస్తు చేస్తున్నారు. కేవలం ఒకటి రెండు వేల ఉద్యోగ ఖాళీలకు లక్షలాది నిరుద్యోగులు దరఖాస్తు చేస్తున్నారు. పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారు. ప్రశ్న పత్రాలు లీక్ అవుతున్నాయి. ఉద్యోగాలకు ముడుపులు చెల్లిస్తున్నారు. కొన్ని పరీక్షలు లేదా ఇంటర్వ్యూలు ఆఖరి నిమిషంలో రద్దవుతున్నాయి. దీనివల్ల మాటల్లో చెప్పలేని అవస్థలకు లోనవుతున్నవారు ఎందరో! ఇవన్నీ, ముమ్మరమవుతోన్న నిరుద్యోగిత పర్యవసానాలే అనడంలో సందేహం లేదు. సీఎమ్ఐఈ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) తాజా నివేదిక ప్రకారం అఖిల భారత నిరుద్యోగిత రేటు 9.2 శాతం. వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు పెరిగాయని అంటున్నారు (నిజానికి ఆ పెరుగుదల ప్రచ్ఛన్న నిరుద్యోగితే). అలాగే నిర్మాణ రంగంలోనూ ఉద్యోగాలు పెరిగాయని అంటున్నారు (వాస్తవానికి ఇవి అవ్యవస్థిత ఉద్యోగాలు). ఇక గిగ్ ఎకానమీ (ప్రజల శ్రామిక శక్తి తాత్కాలిక లేదా పార్ట్–టైమ్ ఉద్యోగంలో పాల్గొనే ఆర్థిక వ్యవస్థ)లో ఉద్యోగాలు ఏ మాత్రం భద్రత లేనివి.

భద్రత, మంచి వేతన భత్యాలు లభించే ఉద్యోగాలనే యువజనులు సహజంగా ఆశిస్తున్నారు. అటువంటి ఉద్యోగాలు ప్రభుత్వంలోను, ప్రభుత్వ రంగ లేదా ప్రభుత్వ నియంత్రిత సంస్థలలో మాత్రమే లభిస్తాయి. 2024 సంవత్సరం ఆరంభంలో కేంద్ర ప్రభుత్వంలో 10 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. అయితే వాటిని భర్తీ చేసేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టడం కాదు కదా కనీసం శ్రద్ధ చూపుతున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. భద్రత, మంచి వేతన భత్యాలు లభించే ఉద్యోగాలను తయారీ రంగంలోను, సేవల రంగంలోను సృష్టించవచ్చు. ముఖ్యంగా ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, షిప్పింగ్, పౌర విమానయానం, ఆతిథ్యం, ఆరోగ్య భద్రత, విద్య, పరిశోధన... అభివృద్ధి రంగాలలో కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. తయారీ రంగంలో ఉత్పత్తి విలువ జీడీపీలో 15 శాతంగా మాత్రమే ఉన్నది. అది అంతకు మించడం లేదు. కారణమేమిటి? దేశీయ పారిశ్రామికవేత్తలు వస్తూత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనుకాడడమేనని చెప్పక తప్పదు.

దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సవాల్ ధరల పెరుగుదల లేదా ద్రవ్యోల్బణం. ప్రభుత్వ అంచనాల ప్రకారమే టోకు ధరల ద్రవ్యోల్బణం 3.4 శాతంగా ఉన్నది. వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉండగా ఆహార ద్రవ్యోల్బణం 9.4శాతంగా ఉన్నది. మన సువిశాల భారత దేశం ఒక అఖండ మార్కెట్ కాదు. సరుకులు, సేవలు దేశంలోని ప్రతి ప్రాంతానికి స్వేచ్ఛగా ప్రవహించే పరిస్థితి లేదు. వస్తు సేవల ధరలు ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి భిన్నంగా ఉంటాయి. అలాగే ఒక రాష్ట్రం పరిధిలోని బాగా అభివృద్ధి చెందిన జిల్లాలలోను, మారుమూల జిల్లాలలోను ఆ రేట్లు ఒకే విధంగా ఉండవు. పై స్థాయిలో ఉన్న 20 నుంచి 30శాతం కుటుంబాలను మినహాయిస్తే మిగతా జనాభాలో ప్రతి కుటుంబమూ ద్రవ్యోల్బణంతో సతమతమవుతోంది. ఈ దురవస్థపై కొంత మంది చిరచిరలాడుతుండగా అత్యధికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

సరే, మరో నాలుగు రోజుల్లో కొత్త బడ్జెట్ రానున్నది. గౌరవనీయ ఆర్థిక మంత్రి బడ్జెట్ ఉపన్యాసాన్ని మీరు వింటారు లేదా చదువుతారు. నిరుద్యోగిత సమస్య తీవ్రతను తగ్గించేందుకు, నింగినంటిన ధరలను భూమి మీదకు తీసుకువచ్చేందుకు బడ్జెట్‌లో ఆమె చేపట్టే చర్యలపై మీ సంతృప్తి స్థాయిని బట్టి ఆ బడ్జెట్‌కు 50 మార్కుల మేరకు ఇవ్వవచ్చు. మిగతా 50 మార్కులను విద్యా వైద్య రంగాలకు, ప్రజలు ప్రాధాన్యమిచ్చే ఇతర రంగాలకు చేసిన కేటాయింపులను బట్టి ఇవ్వవచ్చు. ఉత్కృష్ట ప్రమాణాలు లోపించిన విద్యారంగం, నాసిరకం ఆరోగ్య భద్రతా సేవలు కొనసాగుతున్నంతవరకు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం కాదు, కాబోదు. విద్యారంగం, ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగంలో ప్రమాణాలు చాలా చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. బాలలు 7 నుంచి 8 సంవత్సరాల పాటు పాఠశాల విద్యాభ్యాసం చేస్తారు. దాదాపు సగం మంది బాలలు మాతృభాషలో సైతం సరిగా చదవలేని, రాయలేని పరిస్థితి ఉన్నది. అలాగే చాలా తేలిక కూడికలు, తీసివేతలు, భాగహారాలు కూడా వారు చేయలేకపోతున్నారని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మరి ఇటువంటి బాలలు ఎటువంటి నైపుణ్యాలతో పెరిగి పెద్దవారవుతారు? ఎటువంటి ఉద్యోగాలకు వారు అర్హులవుతారు? ఏకోపాధ్యాయ పాఠశాలలు వేల సంఖ్యలో ఉన్నాయి. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. లైబ్రరీలు, లేబొరేటరీలు అలా ఉంచి కనీస బోధనా సహాయ పరికరాలు లేని పాఠశాలలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఈ మౌలిక సమస్యలను సత్వరమే పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ప్రోద్బలించాలి. అంతేగాని విలువైన వనరులు, సమయాన్ని వివాదాస్పద నూతన విద్యా విధానం, కుంభకోణాల మయమైన ఎన్‌టీఏ/ నీట్‌పై వృథా చేయకూడదు.

విద్యారంగం కంటే ఆరోగ్య భద్రతా రంగం మెరుగ్గా ఉందేమో గానీ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అదే సరిపోదు. ప్రజారోగ్య వ్యవస్థ పరిమాణాత్మకంగా పెరుగుతుందే గానీ నాణ్యతాపరంగా పెరగడం లేదు. ఆరోగ్య భద్రతకు దేశ ప్రజలు చేస్తున్న మొత్తం వ్యయంలో 47 శాతాన్ని స్వయంగా తమ ఆదాయం నుంచి భరిస్తున్నారని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రైవేట్ వైద్యరంగం పరిమాణాత్మకంగానే కాకుండా నాణ్యతతో కూడిన సేవలపరంగా కూడా విస్తృతంగా పెరుగుతోంది. అయితే ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యానికి అయ్యే ఖర్చులను భరించగల శక్తి దేశ జనాభాలో ఎంత మందికి ఉంది? అత్యధికులకు లేదనేది స్పష్టం. మొత్తం మీద డాక్టర్లు, నర్సులు, మెడికల్ టెక్నీషియన్ల లోటు, డయాగ్నోస్టిక్ పరికరాల కొరత చాలా తీవ్రంగా ఉన్నది. ఇదొక కఠోర వాస్తవం. ఆరోగ్య భద్రతపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయం జీడీపీలో 0.28 శాతానికి తగ్గి పోయింది. ఆరోగ్య భద్రతకు చేస్తున్న మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం 1.9 శాతంగా మాత్రమే ఉంది. ప్రజారోగ్య వ్యవస్థ తీరుతెన్నుల పట్ల ప్రజల సంతృప్తి చాలా చాలా స్వల్పంగా మాత్రమే ఉన్నది.

సరే, ఎదుగు బొదుగు లేని వేతనాలు, కుటుంబ రుణ భారం పెరుగుదల, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, విద్యారుణాల భారం, అగ్నిపథ్ పథకం మొదలైన సమస్యలకు ప్రాధాన్యమిస్తున్నవారు ఎందరో ఉన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే మార్గాలు ఉన్నాయి: కనీస వేతనాన్ని రూ.400గా నిర్ణయించడం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం; విద్యారుణాల మాఫీ, అగ్నిపథ్ రద్దు. మరి ప్రస్తుత పాలకులు ఈ పరిష్కార మార్గాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతే కాదు, వాటిని అవహేళన చేస్తున్నారు! తత్కారణంగానే 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ గెలుచుకున్న సీట్ల సంఖ్య ఘోరంగా తగ్గిపోయింది. అయినా బీజేపీ పశ్చాత్తాపపడటం లేదు! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాపై పునరాలోచించే యోచన ఏ మాత్రం లేదని ఆ పార్టీ నాయకుల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి బుద్ధిచెప్పిన ఓటర్లు ఆ తరువాత 13 అసెంబ్లీ ఉపఎన్నికలలో మరోసారి ఆ పార్టీకి చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు. ఆ ఉపఎన్నికలలో ఇండియా కూటమి 10 స్థానాలను గెలుచుకున్నది. ప్రతిపక్ష కూటమి ఓట్ల వాటా సైతం గణనీయంగా పెరగడం గమనార్హం. యథార్థమేమిటంటే మోదీ సర్కార్ పాలన పట్ల దేశ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కనుకనే ఎన్నికలలో ప్రతిపక్ష కూటమికి ఓటు వేయడం ద్వారా పాలనా పద్ధతులను మార్చుకోవాలని దేశ పాలకులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరి వచ్చేవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2024–25 సంవత్సర వార్షిక బడ్జెట్ ఆ హెచ్చరికలకు సరైన రీతిలో ప్రతిస్పందిస్తుందా?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)



akbar


నిరుద్యోగిత సమస్య తీవ్రతను తగ్గించేందుకు, నింగినంటిన ధరలను భూమి మీదకు తీసుకు వచ్చేందుకు ఈ నెల 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2024–25 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో పటిష్ఠ చర్యలు ఉంటాయా? ప్రజల జీవన వ్యయాల వాస్తవాలపై సరైన అవగాహన కొరవడడంతో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై నిష్పాక్షిక అంచనాకు రావడంలో బడ్జెట్ రూపకర్తలు విఫలమవుతున్నారు. కేంద్ర వార్షిక బడ్జెట్‌లు కలిగిస్తున్న ఆశాభంగానికి ఇదే ప్రధాన కారణమనడంలో సందేహం లేదు.

సమగ్రాభివృద్ధికి జీడీపీ కొలమానం కాదు

ఒక దేశ జీడీపీ పెరిగినంత మాత్రాన అక్కడి పేదరికం, నిరుద్యోగం తొలగిపోయి ఆ దేశం సమగ్రాభివృద్ధి చెందినట్టు భావించకూడదు. పెరిగిన అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలకు, సామాన్యులకు అందినప్పుడే వారి ఆదాయాలు పెరిగి, తద్వారా కొనుగోలు శక్తి పెరిగి, జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

భారతదేశంలో కానీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, జపాన్, జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, కెనడా దేశాలలో గానీ, ఆదాయ సంపదలు కొద్ది శాతం పెట్టుబడిదారులు, వ్యాపారస్థుల చేతిలో కేంద్రీకృతమైపోయాయి. అందువల్ల ఆ దేశాలలో మౌలిక సమస్యలైన పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, ఆర్థిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు.

మన భారతదేశంలో వివిధ సంస్థల అధ్యయనం ప్రకారం 5 శాతం జనాభా చేతిలో సుమారు 65శాతం దేశ సంపద కేంద్రీకృతమై ఉంది. మిగతా 95 శాతం మంది చేతిలో సుమారు 35 శాతం సంపద మాత్రమే ఉన్నది. అందువల్ల మన దేశంలో 90 శాతం ప్రజలు ప్రతి నిత్యం కనీస మౌలిక సదుపాయలైన గృహవసతి, విద్య, వైద్యం, పోషకాహారం, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ఇబ్బంది పడుతూ జీవనం సాగిస్తున్నారు.



మనకు స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో మన దేశం వ్యవసాయ, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక సేవా రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించినప్పటికీ, మన జీడీపీ గతంలో ఎన్నోసార్లు 6 నుంచి 8 శాతం చేరుకున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ సమస్య ప్రతి ఏటా పెరుగుతున్నది. మన దేశంలోని జనాభాలో 35 సంవత్సరాల లోపు యువకులు దాదాపు 50 శాతం ఉన్నప్పటికీ వారికి స్థానికంగా ఉద్యోగాలు లభించక ప్రతి ఏటా కొన్ని లక్షలమంది యువకులు ఉద్యోగాలు వెతుక్కుంటూ అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, జపాన్, జర్మన్, గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు.

మన దేశంలో పుష్కలమైన సహజ వనరులు, సారవంతమైన వ్యవసాయ భూములు, జీవనదులు, అటవీ సంపద, ఖనిజ సంపద, సమర్థవంతమైన మానవ వనరులు, శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, డాక్టర్లు, సాంకేతిక నిపుణులు, ఉన్నత విద్యావంతులు ఉన్నప్పటికీ దేశ ప్రజలు ఆర్థికంగా వెనకబడి ఉన్నారు. జీఎస్టీ, ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు 80లక్షల కోట్ల దాకా ప్రతి ఏటా రాబడి వస్తున్నది. అయినప్పటికీ చెప్పుకోతగ్గ అభివృద్ధి సాధించలేకపోతున్నాం. ప్రభుత్వాలు రెవెన్యూ రాబడికి అదనంగా కొన్ని లక్షల కోట్ల రూపాయలు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల ద్వారా అప్పుల రూపంలో సమీకరించి అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులకు ఖర్చు పెడుతున్నప్పటికీ దేశంలో ప్రజల ఆదాయాలు ప్రభుత్వ ఖర్చులకు అనుగుణంగా పెరగటం లేదు.

ప్రభుత్వానికి ప్రజల పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకున్నట్లయితే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకెళ్ళగలదు. పన్నుల ఎగవేతను, నిధుల దుర్వినియోగాన్ని అవినీతిని నిర్మూలించగలగాలి. బినామీ ఆస్తుల నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చెయ్యడంతో పాటు భూముల నిజ విలువ (మార్కెట్) ఆధారంగా స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్ ఛార్జీలు విధించటం, నల్లధనాన్ని పూర్తిగా అరికట్టి 90 శాతం డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించటం ద్వారా అదనపు ఆదాయాన్ని రాబట్టి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చును. ఇందులో భాగంగా 500 రూపాయల నోట్లు రద్దు చెయ్యాలి. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రోడ్లు, రైల్వేలు, నౌకయానం, ప్రజా రవాణ, విద్యుత్‌శక్తి మొదలైన మౌలిక వసతుల రంగాలలో మూలధన పెట్టుబడి పెంచాలి. ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలు సమాజంలో పేదలు, అర్హులు, సామాన్యులకు మాత్రమే ఇవ్వడం ద్వారా వృథా ఖర్చులు అరికట్టి బడ్జెట్‌లో మిగులు సాధించి పేదల సంక్షేమానికి అదనంగా ఖర్చు పెట్టవచ్చు.

అంతే కాకుండా ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో 60 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి వయోవృద్ధునికి ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుంది. మన దేశంలో కూడా ఎలాంటి పెన్షన్ పొందని 60 ఏళ్ళు నిండిన వృద్ధులందరికీ ప్రతి నెలా కనీసం రూ.5000 పెన్షన్ అందజేయాలి. ప్రఖ్యాత నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్య సేన్ అభిప్రాయం ప్రకారం పేద ప్రజలు, రైతులు, కూలీలు, సామాన్యులు, అన్ని వర్గాల ప్రజల ఆదాయాలు రెట్టింపు అయినట్లయితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వస్తువు సేవలకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా పారిశ్రామిక, సేవా రంగాలు అభివృద్ధి చెంది మొత్తం ఆర్థిక వ్యవస్థలలోని అన్ని రంగాలు సమతుల్యంగా అభివృద్ధి చెందుతాయి. ఆ విధంగా పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తొలగిపోగలవు. దేశంలోని ప్రతి పౌరునికి ఆర్థిక, సామాజిక భద్రత లభించినప్పుడే దేశం నిజంగా అభివృద్ధి చెందినట్లుగా భావించాలి.

○ కోట విద్యాసాగర్ రెడ్డి
న్యాయవాది

కవన శిఖరం

అతను ఓ కవిత
తనలో తాను మునిగి
కవిత్వమై ప్రవహించాడు.

కాగితాల్లో
వేల రాత్రుళ్ల మేల్కొని
పుస్తకమై ప్రకాశించాడు.

అక్షరాన్ని ధ్యానించి
తెలుగు నాట
కవన శిఖరమై నిలిచాడు.

చరిత్ర సృష్టించిన
తెలుగు కవిత నక్షత్రమై
నాలుకపై మెరుస్తూనే ఉంటుంది.


– చందలూరి నారాయణరావు

(అడిగోపుల వెంకటరత్నం స్మృతిలో)

నీట్.. మన రాష్ట్రానికి చేటు!

నీట్ ఆల్ ఇండియా కోటాలో ప్రవేశించడానికి ప్రతి రాష్ట్రం తమ ప్రభుత్వం మెడికల్ కాలేజీలలోని 15శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాకి కేటాయించాలి. 2018లో మన రాష్ట్రం నీట్ ఆల్ ఇండియా కోటాలో ప్రవేశించేటప్పుడు అది మనకు లాభదాయకం అవుతుందని ఇక్కడ ఉన్న విద్యావేత్తలు అందరూ భావించారు. అన్ని పోటీ పరీక్షల్లో తెలుగు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తుంటారు కనుక, మన విద్యార్థులకు ఇక్కడ సీటు రాకపోయినా వేరే రాష్ట్రాలలో అధిక సంఖ్యలో ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది అనుకున్నారు. కానీ వాస్తవ గణాంకాలు అందుకు భిన్నంగా ఉన్నాయి.

గత సంవత్సరం జరిగిన ఆల్ ఇండియా కోటా మెడికల్ అడ్మిషన్లను విశ్లేషించగా ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. గత ఏడాది మన రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న మొత్తం సీట్ల (2935)లో 15శాతం అనగా 440 సీట్లు ఆల్ ఇండియా కోటాకి కేటాయించారు. అయితే ఆల్ ఇండియా కోటాలో మన విద్యార్థులు పొందిన సీట్లు కేవలం 165. వారిలో 85 మంది మన రాష్ట్రంలోని వివిధ మెడికల్ కాలేజీల్లో చేరారు. ఇతర రాష్ట్రాల్లో చేరిన మన విద్యార్థుల సంఖ్య కేవలం 80. మన రాష్ట్రం నుంచి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్, జిప్మర్, బిహెచ్‌యు లాంటి జాతీయ వైద్యకళాశాలల్లో చేరుతున్నారు. మనం 15శాతం ఆల్ ఇండియా కోటా పూల్‌లో లేకపోయినా జాతీయ వైద్య కళాశాలల్లో ప్రవేశించే అర్హత మనకు ఉంటుంది. జాతీయ వైద్య కళాశాలల్లో సీట్లు భర్తీ అయిన తర్వాత మన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కొద్దిమంది మాత్రం హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, ఢిల్లీలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చేరుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలు మన రాష్ట్రం కన్నా మెరుగుగా లేకపోవడం వల్ల మిగిలిన విద్యార్థులందరూ మన రాష్ట్రంలో ఉన్న ఆంధ్ర మెడికల్ కాలేజ్, రంగరాయ మెడికల్ కాలేజ్, గుంటూరు మెడికల్ కాలేజ్, కర్నూల్ మెడికల్ కాలేజ్, తిరుపతిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారు.



ఆల్ ఇండియా కోటాలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కేవలం 15శాతం సీట్లు మాత్రమే ఉంటాయి కనుక, పోటీ చాలా తీవ్రంగా ఉంటుంది. 20 నుంచి 25వేల ర్యాంకులకే జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ సీట్లన్నీ భర్తీ అయిపోతున్నాయి. అదే మన రాష్ట్రంలో 60 నుంచి 70 వేల ర్యాంక్ వరకు జనరల్ సీటు వచ్చే అవకాశం ఉంది. కనుక ఇక్కడ సీటు రాని వారికి ఆల్ ఇండియా కోటాలో దేశంలో మరెక్కడా సీటు వచ్చే అవకాశం లేదు. ఉత్తరాది రాష్ట్రాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు చాలా తక్కువగా ఉండడం, విద్యార్థుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ పోటీ తీవ్రత మన కన్నా చాలా ఎక్కువగా ఉంది. కనుక ఆయా రాష్ట్రాల్లో మెడికల్ సీట్లు రాని విద్యార్థులు అందరూ మన రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 15శాతం ఆల్ ఇండియా కోటా సీట్లలో జాయిన్ అవుతున్నారు. దీనివల్ల మనం నికరంగా 250 మెడికల్ సీట్లను కోల్పోతున్నాం. గతంలో ఆల్ ఇండియా కోటాలో రెండవ రౌండ్ తర్వాత మిగిలిన సీట్లను ఆయా రాష్ట్రాలకే తిరిగి ఇచ్చేవారు. అప్పుడు మనకు దాదాపు 100 సీట్ల వరకు తిరిగి వచ్చేవి, కానీ ప్రస్తుతం ఆఖరి సీటు వరకు కేంద్ర ప్రభుత్వమే భర్తీ చేస్తుంది.

ఈ నష్టం పీజీ మెడికల్ సీట్లలో చాలా ఎక్కువగా ఉంటోంది. పీజీ స్థాయిలో మనం ఆలిండియా కోటాకి మన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న 50 శాతం సీట్లను కేటాయిస్తున్నాం. అక్కడ కూడా ఇవే కారణాల వల్ల ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న మన విద్యార్థుల సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. ఇకనైనా మన రాష్ట్ర ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని నియమించి, నీట్ ఆల్ ఇండియా కోటా వల్ల కలుగుతున్న లాభనష్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మన రాష్ట్ర విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సముచిత నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది.

– డా. ఆలా వెంకటేశ్వర్లు
రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్

దార్శనికతకు నిలువెత్తు నిదర్శనం

ఎల్లలూ యవనికలూ లేని వేదికల మీద కొందరు ముందు తరాలకు గుర్తుండిపోయే జుగల్బందీలు ఆలపిస్తారు; ప్రగతికి నిలువెత్తు బుజువులై నిలిచిపోతారు. జీవన ఉద్గ్రంథంలో సరికొత్త అధ్యాయాలకు తెరతీసే పవిత్ర యాగం చేస్తారు. పృథ్వి మీద తాము వేసే ప్రతీ పాదముద్రా ఒక చిత్రకల్పన చేసుకుంటారు. కొందరే కోట్లాది జనులకు నడక నేర్పుతారు. కొందరే ప్రవాహానికి ఐెత్తెదు పైన నిలిచి పరిప్లవిస్తారు. ఈ కోవకు చెందిన మహిళ ముత్తు లక్ష్మీ రెడ్డి.

స్త్రీల దాస్య విమోచనాన్ని జీర్ణించుకోలేని పితృస్వామ్య భావజాలాన్ని ఆమె శతాబ్దం కిందటే ప్రశ్నించారు. పురోగమనం వాంఛించే చాలామందిలా ఆమె సామాజిక రుగ్మతలను ప్రశ్నించడంతో ఆగిపోలేదు; ఆగ్రహం వ్యక్తం చేసి ఊరుకోలేదు. క్రియాత్మక పరిష్కారాలు ఆవిష్కరించి అమలు చేసిన అరుదైన ధీరోదాత్త ముత్తు లక్ష్మీ రెడ్డి.

ముత్తు లక్ష్మీ పుదుక్కోటైలో 1886 జూలై 30న జన్మించింది. నారాయణస్వామి, చంద్రమ్మాళ్ ఆమె తల్లిదండ్రులు. చంద్రమ్మాళ్ దేవదాసి వనిత. ఆ కారణంగానే తండ్రివైపు జనం ఈ కుటుంబాన్ని దూరం నెట్టారు. మిగిలిందిక తల్లివైపు దేవదాసి కుటుంబాల సాన్నిహిత్యమే. ఈ సామీప్యమే లింగ వివక్ష, స్త్రీల కనీస హక్కుల గురించి ముత్తు లక్ష్మీ జీవితంలో సాగించిన పోరాటానికి పునాది.

మహిళల్ని చుట్టుకున్న న్యూనత సర్వం సమాజం అల్లిన సాలెగూడేనని ముత్తు లక్ష్మీ ఎదుగుతున్న ఆడపిల్లగా తొలి నాళ్ళలోనే తెలుసుకున్నారు. నొక్కేసిన గొంతులకు ఆవిడ వక్త, వ్యవహర్త అయ్యారు. దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలూ, పురుషాధిపత్య సమాజంలో ఒంటరి మహిళల అగచాట్లూ ముత్తు లక్ష్మీని తొలి నుంచీ కలవరపెట్టాయి. ఆడపిల్లల చదువుకు ఆంక్షలు ఉన్న ఆ కాలంలోనే ముత్తు లక్ష్మీ రెడ్డి 1912లో మద్రాసు వైద్య కళాశాల నుంచి పట్టా అందుకున్నారు.

పుదుక్కొటై మహారాజా హైస్కూల్‌లో చదువు ముగించుకుని ముత్తు లక్ష్మీ 1907లో మద్రాసు వైద్య విద్యా కళాశాలలో చేరారు. సర్జరీ విభాగానికి ప్రవేశం పొందిన తొలి భారతీయ మహిళ ముత్తు లక్ష్మీ అని వినికిడి. వైద్య విద్యార్థినిగా ఉన్నప్పుడే సరోజినీనాయుడు, అనీబిసెంట్‌లతో ఆమెకు పరిచయమైంది. కారణాలేమైనప్పటికీ ఆ రోజుల్లో సంపన్న వర్గాల స్త్రీలు చాలా వరకు తమ సంతానానికి తామే స్తన్యం ఇచ్చేవారు కాదు. నిమ్న జాతి మహిళలెవరో ఆ పసి బిడ్డలకి పాలిచ్చేవారు. డాక్టర్ అయ్యాక ముత్తు లక్ష్మీ ఈ అవివేక, అశాస్త్రీయ దురాచారాన్ని రూపుమాపేందుకు కృషి చేశారు.

1914లో ఆమెకు 28 ఏళ్ళ వయసులో ఆమె డాక్టర్ సుందర రెడ్డిని పరిణయమాడారు. వ్యక్తిగా, ఒక మహిళగా తన సంపూర్ణ స్వాతంత్ర్యానికి వివాహం ఏ రకంగానూ అడ్డంకి కాకూడదని భర్తతో అంగీకారం కుదిరాకే వాళ్ళ వివాహం అయిందని అంటారు. సంస్కరణాపేక్ష ఉన్నవాళ్ళు జీవితాన్ని క్షేమంగా, నిమ్మళంగా ఏదో తూగుటూయల ఊగినట్టు తీసుకోరు. కీర్తి, యశస్సు వాళ్ళ ప్రాధాన్యాలెప్పటికీ కావు. ఒక చిన్నపాటి ముందడుగు కోసం వాళ్ళు పెద్ద సాహసాలే నెత్తికెత్తుకుంటారు.

1927లో ముత్తు లక్ష్మీ భారతదేశపు మొట్టమొదటి మహిళా శాసనసభ్యురాలు అయ్యారు. నాటి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యురాలిగా దేవదాసీ విధానం రద్దు, కనీస వివాహ వయసు పెంపు, నిర్బంధ వ్యభిచారం రద్దు, బాలల హక్కుల రక్షణ తదితర విషయాలపై పోరాడారు.

దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలూ, పురుషాధిపత్య సమాజంలో ఒంటరి మహిళల అగచాట్లూ ముత్తు లక్ష్మీని తొలి నుంచీ కలవరపెట్టాయి. విరిసీ విరియని, ఊహ తెలియని స్నిగ్ధ ముగ్ధ మందారాల్లాంటి ఆడపిల్లలని దైవ కైంకర్యం పేరు మీద గుడిలో నాట్యగత్తెను చేసి అందినవాళ్ళు తమ కామార్తికి వాడుకునే అనాచారం దేవదాసీల జీవితం. దేవదాసీలు చేసే నృత్యగానాల్ని గుడిలో విగ్రహమై నెలకొన్న పరమాత్మకు చేసే షోడశోపచారాల్లో భాగంగా చూడాలే తప్ప అందులో అనైతికం ఏముందని అప్పట్లో సంప్రదాయవాదులు వెనకేసుకొచ్చినప్పటికీ 1947లో దేవదాసీ సంప్రదాయాన్ని నిషేధిస్తూ మద్రాసు ప్రభుత్వం ఒక శాసనాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టానికై ఏళ్ళ తరబడి ముత్తు లక్ష్మీ రెడ్డి సాగించిన ఉద్యమం విస్మరించలేనిది.

ఒంటరి ప్రయాణాలు ఒకింత భయపెడతాయి; నిజమే. కానీ ఆ నిర్భీతి విముక్తికి తొలి అడుగు అవుతుంది. దేవదాసీ వ్యవస్థ నిర్మూలనం కావచ్చు, మానవాళికి మృత్యుగహ్వరమైన క్యాన్సర్ మీద వైద్యశాల పెట్టి ఆమె ప్రకటించిన సమరం కావొచ్చు ఆమె ఒకానొక తాత్త్విక ఒంటరితనంతోనే చేసింది. ఒక గమ్యం, ఒక పయనం, ఒక నిమగ్నత. ఇవే ఆమె కడదాకా అక్కున చేర్చుకున్న విలువలు. కడలిలో కల్లోలాల గురించి ఆమె ఎన్నడూ ఆలోచించలేదు; నావ సాగించడమే ఆమె ఎన్నుకుంది. లేకపోతే ఆరు దశాబ్దాల క్రితం అడయార్ ఆస్పత్రి అంకురించేదే కాదు. 1952 అక్టోబరులో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పునాదిరాయి వేసిన అడయార్ ఆస్పత్రి 1954లో 12 పడకల వైద్యశాలగా ఆరంభం అయ్యింది. ఈ వైద్యశాల ఇప్పటికీ ఏటా 80,000 మంది రోగ పీడితులకు ఆపన్న హస్తం అందిస్తోంది. ఇప్పటి కార్పొరేట్ వైద్యశాలలకు పూర్వరంగంలో, అంటే దాదాపు 20 ఏళ్ళ క్రితం వరకు యావద్భారతావనిలో క్యాన్సర్ పీడితులకు ఉపశమనం, చికిత్స నెరపిన గమ్యస్థానం అడయార్ హాస్పిటలే.

చెన్నై అడయార్‌లో ఉన్న 'అవ్వై హోం' ఆమె 1931లో నిర్భాగ్య మహిళల నిమిత్తం నెలకొల్పిన శరణాలయం. విద్య, ఆత్మ గౌరవంతో మహిళలు స్వతంత్రంగా బతికేందుకు అవ్వై హోం తోడ్పడుతోంది. ఈ ప్రయాణం అంతా ఆమె అవినాభావంగా, అనురాగపూరితంగా సాగినట్టు సుస్పష్టంగా తెలుస్తుంది. జాతి మనుగడకు జవం, జీవం నింపాలని తనవంతు సంపూర్ణ కృషి నిరంతరాయంగా నిర్వహించి నిష్క్రమించిన పురోగమనాభిలాషి శ్రీమతి ముత్తు లక్ష్మీ.

లెక్కకు మనం ప్రప్రథమంగా ఇన్ని ఘనతలు సంతరించుకుంది అని చెప్పుకున్నా, ఆవిడను ప్రేరేపించింది మాత్రం సమాజానికి ఒకింత సేవ చెయ్యాలన్న ఏకైక దృక్పథమే. సాగించిన ప్రయాణంలో ఎన్నేసి అడ్డంకులు, అవరోధాలు, కంటకాలూ చవి చూసి ఉంటారో కేవలం ఆవిడే చెప్పగలరు. ప్రగతి కేసి నడక తేలిక కానేరదు. దార్శనికతకు నిలువెత్తు నిదర్శనం ఆమె. దాశరథి మాటల్లో 'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానల మెంతో' బహుశా ఆమెకే తెలిసి ఉంటుంది. శుష్క వచనాల వరదలో కొట్టుకుపోకుండా ధీర గంభీర కార్యాచరణ ఆమె యెంచుకున్న రీతి, నిర్భీతి. సానుకూలతా, అవకాశమూ ఉంటే ప్రతి మహిళా తళుకులీనే ఒక తారక కాగలదని ఆమె నమ్మారు.




జాతి మనుగడకు జవం, జీవం నింపాలని తనవంతు సంపూర్ణ కృషి నిరంతరాయంగా నిర్వహించి నిష్క్రమించిన పురోగమనాభిలాషి ముత్తులక్ష్మి రెడ్డి. 'గుంపుకి పరిమితమైతే మహిళ అక్కడే నిలబడిపోతుంది; ఒంటిగానైనా సరే ముందుకెళ్ళే స్త్రీ ఇతరులకు దుస్సాధ్యమైన మజిలీలు చూస్తుంది' అని ఐన్‌స్టీన్ అన్నారు. దేవదాసీ విధానం రద్దు, కనీస వివాహ వయసు పెంపు, నిర్బంధ వ్యభిచారం రద్దు, బాలల హక్కుల రక్షణ తదితర లక్ష్యాలకోసం పాటుపడిన మహనీయురాలు ముత్తులక్ష్మి.

1930లో లండన్‌లో, 1932లో చికాగోలోనూ జరిగిన ప్రపంచ స్థాయి మహిళా సాధికార వేదికల నుంచి ఆవిడ భారతీయ మహిళల కడగళ్ళ గురించి ప్రపంచానికి చాటారు. 1931లో అఖిల భారత మహిళల సదస్సు (ఆల్ ఇండియా విమెన్స్ కాన్ఫరెన్స్)కు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సదస్సు తరఫున మహిళల ఓటు హక్కుకై పోరాడారు. ఉప్పు సత్యాగ్రహ పిలుపుతో శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. మహిళాభ్యుదయం కొరకు 'స్త్రీధర్మ' అనే పత్రికను నడిపారు. 1956లో 'పద్మ భూషణ్' పురస్కారంతో భారత ప్రభుత్వం ఆమెను సత్కరించింది. ఈ వరుస స్త్రీ జనహిత ప్రయాసల మాటున అసలు సిసలు మానవ హక్కుల నినాదం ఒకటి తొంగిచూసిన ప్రక్షాళన ఆమెది.

స్వీయ జీవిత చరిత్రతో పాటు, ముత్తు లక్ష్మీ 'శాసనసభలో నా అనుభవాలు' అనే రచనలు చేశారు. 82 ఏళ్ళ పరిపూర్ణ జీవితం గడిపిన త్యాగశీలి ముత్తు లక్ష్మీ రెడ్డి 1968 జూలై 22న కీర్తి శేషురాలు అయ్యారు. 'గుంపుకి పరిమితమైతే మహిళ అక్కడే నిలబడిపోతుంది; ఒంటిగానైనా సరే ముందుకెళ్ళే స్త్రీ ఇతరులకు దుస్సాధ్యమైన మజిలీలు చూస్తుంది' అని ఐన్‌స్టీన్ అన్నారు. ఆయనకు సమకాలీన ప్రపంచంలో ఎక్కడో మరోచోట, మరో వ్యాపకం, మరో తపనతో ఈ వాక్కును రూఢి చేసిన మహిళగా ముత్తు లక్ష్మీ రెడ్డి జీవితం, కృషిని మనం ఇవాళ పునస్సమీక్షించుకోవచ్చు. నీడలూ జాడలూ ఉపేక్షించి నిత్యం వెలుతురుకేసి సాగిన గమనం ముత్తు లక్ష్మీది.

■ తిరువాయపాటి రాజగోపాల్
(జూలై 22: ముత్తులక్ష్మీ రెడ్డి వర్ధంతి)







శాకంబరీ శరణు..

ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

- భారీగా తరలివచ్చిన భక్తజనం.. కిటకిటలాడిన క్యూలైన్లు
- ఆషాఢ సారెలు, శాకంబరీ ఉత్సవాలతో శోభాయమానం



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వన్‌టౌన్, జూలై 19 : శుభాలను చేకూర్చే శాకంబరీదేవిగా దుర్గమ్మ కటాక్షించింది. పచ్చని రూపంలో కొలువైన అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి తరించేందుకు భక్తకోటి బారులు తీరింది. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక కమిటీ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల్లో ఈవో రామారావు పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, మంత్రాల మధ్య దుర్గమ్మను శాకంబరిగా ఆహ్వానిస్తూ కలశస్థాపన చేశారు. పచ్చటి రూపంలో చూడచక్కగా కనిపించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే, ఆషాఢ సారె సమర్పించేందుకు వచ్చిన వారితో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణాన్ని ఆకుకూరలు, కూరగాయలతో అందంగా అలంకరించారు. శుక్రవారం సాయంత్రం జరిగిన పంచహారతుల కార్యక్రమంలో గవర్నర్ సతీమణి సమీరా నజీర్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు పాల్గొన్నారు. ఈవో రామారావు, ఏఈవో రమేశ్‌బాబు, అర్చక బృందం వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.



ఫ్రైడే.. డ్రైడే

విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన 'ఫ్రైడే.. డ్రైడే' కార్యక్రమంలో భాగంగా నగరంలోని రామకృష్ణాపురంలో కలెక్టర్ సృజన పర్యటించారు. స్థానికంగా వస్తున్న మంచినీటిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

6లో..



బందరురోడ్డులో జోరువాన

వీడని వాన

వర్షం.. జోరున కురుస్తూనే ఉంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా పడుతూనే ఉంది. ఓవైపు ఎగువన కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగుతుంటే, మరోవైపు భారీగా చేరుతున్న వరద నీటితో ప్రకాశం బ్యారేజీ నిండుకుండను తలపిస్తోంది. ఇక జోరువానతో నగరంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. కొండచరియలు విరిగిపడుతున్నాయి. మరో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- వాగులు, వంకల్లో పెరుగుతున్న వరద
- కట్లేరు వద్ద కొనసాగుతున్న ఉధృతి
- ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుతున్న నీరు
- ఎడతెరిపిలేని వర్షాలతో నగరవాసుల కష్టాలు
- రహదారులపై భయంగా ప్రయాణం
- వన్‌టౌన్ కొండ ప్రాంతంలో విరిగిపడిన కొండచరియలు

502.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు




వన్‌టౌన్ కొండ ప్రాంతంలో విరిగిపడిన కొండచరియలు

విజయవాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ముసురు వీడలేదు. శుక్రవారం కూడా భారీ వర్షాలు జిల్లాను కుదిపేశాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా పడుతూనే ఉన్నాయి. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలో మొత్తం 502.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా తిరువూరు మండలంలో 34.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా జగ్గయ్యపేట మండలంలో 14.8 మిల్లీమీటర్లు నమోదైంది. విజయవాడలో 103.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కట్లేరు, వైరాకు వరద

తెలంగాణాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కట్లేరు, వైరా వాగులు పొంగుతున్నాయి. ఈ వాగుల నుంచి 1400 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. వర్షాలకు విజయవాడ నగరం నీటమునిగింది. బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, వారధి, లోబ్రిడ్జి, పీఎన్‌బీఎస్, కబేళా, విద్యాధరపురం, వించిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. జాతీయ రహదారిపై పలుచోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వర్షాలకు రహదారులపై గుంతలు ఏర్పడుతున్నాయి. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియకపోవడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. ఈ ప్రభావం అన్ని కూడళ్లపై పడింది.



కొండ ప్రాంతంలో బిక్కుబిక్కు

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. వన్‌టౌన్‌లోని కొత్తపేట, చిట్టినగర్, పాలఫ్యాక్టరీ, మొగల్రాజపురం, గిరిపురం, గుణదల, కార్మెల్‌నగర్, కుమ్మరిపాలెం, చెరువు సెంటర్ ప్రాంతాల్లోని కొండవాసులు భయాందోళనతో జీవిస్తున్నారు. ఎప్పుడు కొండరాళ్లు వచ్చి ఇళ్లపై పడతాయోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. శుక్రవారం కురిసిన వర్షాలకు కొత్తపేటలోని 51వ డివిజన్ రాజగిరి వారి వీధిలో కొండపై ఇంటి సపోర్టింగ్ గోడ కూలిపోయింది. గురువారం అర్ధరాత్రి నుంచి వర్షపు నీరు కిందకు జారుతుండటంతో ఈ గోడ కూలింది. అలాగే, విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని కొండ ప్రాంతంలో ఓ ఇంటిపై పెద్ద కొండరాయి జారిపడింది. ఇంట్లో ఉన్న మహిళకు తీవ్ర గాయమైంది. ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి.

పింకీ చిక్కాడు



గంజాయి విక్రయాల కింగ్‌పిన్ అరెస్టు | మరో 14 మంది కూడా..

రోడ్డు విస్తరణలో సర్వం కోల్పోయాడు.. ఉపాధి కోసం ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో టీ స్టాల్ పెట్టుకున్నాడు.. కానీ, ఆ స్టాల్‌ను గంజాయి లావాదేవీలకు కేంద్రంగా మార్చాడు.. ఇలా తన వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు ఒడిశాలోని బరంపురానికి చెందిన పింకీరౌత్. తెలంగాణలోని మేడ్చల్ సహా విజయవాడలోని యువతకు గంజాయిని సరఫరా చేస్తున్న ఈ కింగ్‌పిన్ సహా 15 మందిని విజయవాడ టాస్క్‌ఫోర్స్, యాంటీ నార్కోటిక్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు.

- నిందితుల్లో విజయవాడ, మేడ్చల్ బ్యాచ్
- 90 కేజీల గంజాయి స్వాధీనం
- బరంపురం నుంచి బెజవాడ, మేడ్చల్‌కు లింక్‌లు
- ల్యాప్‌టాప్ పార్శిల్ మాదిరిగా సరఫరా



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉన్న పింకీరౌత్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో ఉండే గిరిజనులను చేరదీసి, వారితో గంజాయి సాగు చేయించి, ఆ పంటను కొనుగోలు చేసి, కిలో లెక్కన ప్యాక్ చేసి, తన టీ స్టాల్ వెనుక ఉన్న గదిలో భద్రపరుస్తాడు. గిరిజనుల నుంచి కిలో గంజాయిని రూ.1,000కు కొని రూ.4 వేల నుంచి రూ.5 వేలకు విక్రయిస్తాడు. ఇలా విక్రయాలు జరిపేందుకు నలుగురైదుగురిని సహాయకులుగా నియమించుకుని కమీషన్లు ఇస్తుంటాడు. ఆ గంజాయిని విజయవాడ, తెలంగాణలోని యువతకు సరఫరా చేస్తాడు. పింకీపై క్రైం నెంబరు 279/2024తో ఇప్పటికే కేసు నమోదైంది.

ల్యాప్‌టాప్ పార్శిల్

చూడటానికి ఆ పార్శిల్ ల్యాప్‌టాప్ మాదిరిగా ఉంటుంది. దాన్ని చింపి చూస్తే మాత్రం గంజాయి కనిపిస్తుంది. విజయవాడ, తెలంగాణ నుంచి వెళ్లిన వారికి ఈ పార్శిల్‌ను ఇస్తుంటాడు పింకీరౌత్. దాన్ని వారు ల్యాప్‌టాప్‌లో పెట్టుకుని తీసుకొస్తారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిలో ల్యాప్‌టాప్‌ను పోలిన పార్శిళ్లు ఉన్నాయి. విజయవాడ, తెలంగాణ నుంచి సుమారు 45-50 మంది వరకు వ్యసనపరులు పింకీతో టచ్‌లో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ముందుగా గంజాయిని తాగినవారు.. తర్వాత డబ్బు కోసం పెడ్లర్లుగా మారుతున్నట్టు పోలీసులు నిర్ధారించుకున్నారు.

15 మంది.. 90 కిలోలు

పింకీరౌత్‌తో పాటు 15 మందిని విజయవాడ టాస్క్‌ఫోర్స్, యాంటీ నార్కోటిక్ సెల్ పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను డీసీపీ టి.హరికృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరి, ఇన్‌స్పెక్టర్లు నాగేంద్ర, శ్రీధర్‌కుమార్, ఎస్.రమేశ్ శుక్రవారం వెల్లడించారు. మాచవరం, సూర్యారావుపేట, భవానీపురం, కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో ఇరుక్కుని పరారీలో ఉన్నవారిని, తాజాగా కేసులు నమోదైన వారిని పట్టుకున్నారు. ఒడిశాలోని బరంపురానికి చెందిన పింకీరౌత్, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గోగినేని మాధవరావు అలియాస్ మాధవ, తెలంగాణలోని మేడ్చల్ జిల్లా పోతయిపల్లికి చెందిన మురుగన్ మణికంఠ అలియాస్ మ్యాక్సీ, సంకేలి గణేశ్, పెనమలూరుకు చెందిన షేక్ మొహమ్మద్ గౌస్, అబ్దుల్ హబీబ్, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన మర్రి రఘురాం అలియాస్ రఘు, మాచవరానికి చెందిన కొమ్ము రాకేశ్, భవానీపురానికి చెందిన పాలేటి మమతరాజు, మహమ్మద్ ముజ్జమిల్ సుల్తాన్, షేక్ నజీర్, మత్తే నాని, ఇల్లూరి మధుసూదన్‌రెడ్డి, కృష్ణలంకకు చెందిన అడబాల వంశీ అలియాస్ పండు, అమన్‌సింగ్ అలియాస్ మోనోలను అరెస్టు చేశారు. వీరిలో పింకీరౌత్, మణికంఠ, గణేశ్ కేసుల్లో ఇరుక్కుని పరారీలో ఉన్నవారే. వారి నుంచి 90.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక వాట్సాప్ నెంబర్, మెయిల్

విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయికి సంబంధించిన సమాచారం కోసం ప్రత్యేకంగా వాట్సాప్ నెంబర్, ఈ-మెయిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 9121162475 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చని డీసీపీ టి.హరికృష్ణ తెలిపారు. వాట్సాప్‌లో మెసేజ్, వాట్సాప్ కాల్ చేసి వివరాలు ఇవ్వొచ్చన్నారు. దీంతోపాటు antinarcoticcell@vza.appolice.gov.in మెయిల్ చేయవచ్చన్నారు. గంజాయి అమ్మకాలు సాగించేవారు, గంజాయిని తాగేవారు, తాగుతున్న ప్రదేశాలు.. ఇలా ఏ సమాచారాన్నైనా తమకు ఇవ్వవచ్చన్నారు. వివరాలు గోప్యంగా

నరసాపురం ఎంపీడీవో కోసం

గాలింపు ముమ్మరం

కుటుంబానికి మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శ



అజ్జంపూడి వద్ద ఎంపీడీవో రమణారావు ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

మచిలీపట్నం టౌన్, జూలై 19 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణ అదృశ్యం మిస్టరీ ఇంకా వీడలేదు. శుక్రవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ చిక్కలేదు. ఐదు రోజుల క్రితం కనిపించకుండాపోయిన వెంకటరమణ ఆచూకీ కోసం ఇంకా గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటరమణ తన ఫోన్ ద్వారా పంపిన మెసేజ్‌ల ఆధారంగా అదృశ్యం వెనుక గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామన్నారు. మూడు రోజులుగా ఏలూరు కాల్వ పొడవునా ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సీసీఎస్ డీఎస్పీ ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్, గన్నవరం, పెనమలూరు, కంకిపాడు, గుణదల సీఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గాలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏదైనా సమాచారం తెలిస్తే 94407 97400 నెంబరుకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. 94910 63910తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

ఎంపీడీవో కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఫోన్

ఎంపీడీవో వెంకటరమణ కుటుంబసభ్యులతో సీఎం చంద్రబాబు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. వెంకటరమణ కుటుంబ సభ్యులను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. కానూరు మహదేవపురం కాలనీలోని వారి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా, ఏలూరు కాలువలో గాలింపు చర్యలు శనివారం కూడా కొనసాగాయి.

● నరసాపురంలో విచారణ

ఎంపీడీవో అదృశ్యం కేసులో విచారణ నిమిత్తం పోలీసులు నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. ఊయ్యూరు సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో విచారణ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. వివరాలను ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు, ఎంపీపీ సోని, సిబ్బంది నుంచి ఆరా తీశారు. ఆయనకు ఫోన్లు ఎక్కడ నుంచి వచ్చేవి? ఆర్థిక పరిస్థితి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాకీ ఎప్పటి నుంచి కట్టాలి? దీనికి సంబంధించి పాటదారుడికి ఎంపీడీవో వెంకటరమణ ఇచ్చిన నోటీసులను పరిశీలించారు. విచారణలో స్థానిక సీఐ స్వామి పాల్గొన్నారు.

డీసీపీగా గౌతమిశాలి బాధ్యతల స్వీకరణ



విజయవాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డీసీపీగా గౌతమిశాలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం విజయవాడకు బదిలీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీ రాజశేఖర్‌బాబును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె గతంలో విశాఖపట్నం డీసీపీగా, అనకాపల్లి ఎస్పీగా పనిచేశారు.

తహసీల్దార్ల బదిలీలకు పచ్చజెండా

సోమవారం నాటికి కొలిక్కి వచ్చే అవకాశం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో సొంత డివిజన్‌కు వేయకుండా చర్యలకు ఆదేశాలు
- సీసీఎల్ఏ నుంచి వచ్చే ప్రొసీడింగ్స్ ప్రకారం కలెక్టర్ల చర్యలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారు తిరిగి సొంత జిల్లాలకు వచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా సీసీఎల్ఏకు నిర్దేశించింది. దీంతో సోమవారం నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లాలో తహసీల్దార్ల బదిలీల అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. సీసీఎల్ఏ నుంచి ప్రొసీడింగ్స్ వచ్చాక.. ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాలకు వచ్చేస్తారు. సొంత జిల్లాలకు వచ్చిన తహసీల్దార్లను సొంత రెవెన్యూ డివిజన్ల పరిధిలో నియమించకూడదని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతోపాటు గతంలో పనిచేసిన చోట కాకుండా.. వేరే స్థానాల్లోకి బదిలీ చేయాల్సి ఉంటుంది. సీసీఎల్ఏ కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన తర్వాత.. తహసీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు ఇస్తారు. తహసీల్దార్ల బదిలీలు జరగకపోవటం వల్ల పాలన కుంటుపడుతున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో పలు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా తీసుకుని బదిలీలు కల్పించటం వల్ల తహసీల్దార్లు ప్రశాంతంగా ఉన్నారు.



భూసార పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు

భూసార పరీక్షలతో లాభసాటి సాగు

- మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించాలి
- అత్యాధునిక భూసార పరీక్షా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు

విజయవాడ లీగల్, జూలై 19 : రైతులు పంట వేయడానికి ముందు భూమి స్థితిగతులు తెలుసుకోవడం ముఖ్యమని, సాగును లాభసాటిగా మార్చుకోవాలంటే భూసార పరీక్షలు చేయించుకొని నిపుణుల సలహాలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం ఆయన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, మట్టి పరీక్షల్లో సేంద్రీయ కర్బనం మోతాదు, నత్రజని, భాస్వరం, పొటాషియం స్థితిగతులు, ఏ మట్టి ఏ రకం పంటలకు అనుకూలం వంటివన్నీ తెలుసుకొనేందుకు వీలుంటుందని, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన భూసార పరీక్షా కేంద్రాలను సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాధికార సిఫార్సులను అనుసరించి సమతుల ఎరువుల యాజమాన్యం చేపట్టవచ్చని, తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. రైతులకు అధిక దిగుబడులు ఆదాయాలు లభించేలా చేయడం రాష్ట్ర ప్రభుత్వ పాధాన్యంగా వుందని ఈ దిశగా రైతులకు వ్యవసాయ అధికారులు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇనుగంటి రాంబాబు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న దేవినేని, కొలికపూడి

జగన్‌వి శవ రాజకీయాలు : దేవినేని ఉమా

గంపలగూడెం, జూలై 19 : బెంగళూరు ప్యాలెస్‌లో 40 రోజులు డ్రామాలాడి శవ రాజకీయాలు చేసేందుకు జగన్మోహన్ రెడ్డి బయలుదేరాడని మాజీమంత్రి ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకొమెరలో ఇనుగంటి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, శాసనసభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేక ఢిల్లీలో డ్రామాలాడటానికి వెళ్లిన జగన్‌కు సిగ్గుందా అని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రాష్ట్రం ముందుకు వెళ్లాలని కోరుకుంటుంటే రాష్ట్రపతి పాలనకావాలని అడుగుతున్న జగన్ మానసిక స్థితి ఎలా ఉందో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన దాడికి రాజకీయ రంగు పులిమి విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటంలో, పరిశ్రమలు తీసుకురావడంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బ్రహ్మాండంగా ముందుకెళ్తుందన్నారు.

ఇనుగంటి కుటుంబానికి దేవినేని పరమర్శ

ఇటీవల మృతిచెందిన టీడీపీ సీనియర్ నేత ఇనుగంటి రాంబాబు కుటుంబసభ్యులను మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులు శుక్రవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రహదారిపై ధర్నా చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు

రోడ్డెక్కిన టిడ్కో లబ్ధిదారులు!

- వసతులు కల్పించాలంటూ రాస్తారోకో

గుడివాడ, జూలై 19 : కనీస వసతులు కల్పించకుండా ఇళ్లను యిచ్చారని, గత వారం రోజులుగా తాగునీరు కూడా సరఫరా చేయడం లేదని టిడ్కో లబ్ధిదారులు వాపోయారు. శుక్రవారం టిడ్కో కాలనీ నుంచి లబ్ధిదారులు ర్యాలీగా బయలుదేరి స్థానిక మార్కెట్ యార్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వారంరోజులుగా తాగునీరు కూడా సరఫరా కావడం లేదని, బ్యాంకర్లు వాయిదాలు కట్టాలంటూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పైపులైను పగిలి 10రోజులైనా మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ దారుణంగా ఉందని వాపోయారు. అనంతరం మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి టిడ్కో లబ్ధిదారులకు నచ్చజెప్పారు. పైపులైన్‌లను బాగుచేస్తున్నామని, నీళ్లు సరఫరా చేస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకో విరమించారు.



ధ్వంసమైన రేకుల ఇల్లు

త్రుటిలో తప్పిన ప్రమాదం..!

- కొండరాయి జారిపడి ఇల్లు ధ్వంసం
- మహిళకు స్వల్పగాయాలు



కాలికి గాయం

విద్యాధరపురం, జూలై 19 : ఎడతెరపి లేని వానలకు కొండరాళ్లు జారి పడుతున్నాయి. విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని కొండప్రాంతంలో శుక్రవారం ఉదయం ఓ ఇంటిపై పెద్ద కొండరాయి జారిపడటంతో ఇల్లు ధ్వంసమైంది. మహిళ కాలిపై రాయి పడటంతో స్వల్ప గాయమైంది. పిళ్లా తులసి, ఆమె భర్త గోపాలరావు, కుమార్తె కలిసి ఆ ఇంట్లో ఉంటున్నారు. గోపాలరావు వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఉదయం 6 గంటలకు పాలపాకెట్టు తీసుకురావడానికి వెళుతూ భార్య తులసిని నిద్రలేపి వెళ్లాడు. ఆమె వంటపాత్రలు శుభ్రం చేస్తున్న సమయంలో ఆకస్మికంగా రాయి జారి పడటంతో ఆమె అప్రమత్తమయ్యేలోగానే కాలికి గాయమైంది. కుమార్తె వేరే గదిలో పడుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. 38వ డివిజన్ కార్పొరేటర్ రహంతున్నీసా, కార్పొరేషన్ అధికారులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు.

అవగాహన.. అప్రమత్తత

- సమర్థవంతంగా నగరంలో ఫ్రైడే-డ్రైడే
- ప్రజల భాగస్వామ్యంతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట
- జన జాగృతి ర్యాలీలో కలెక్టర్ సృజన



జన జాగృతి ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

సత్యనారాయణపురం, జూలై 19 : సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో శుక్రవారం నగరపాలక సంస్థ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన 'డ్రైడే-ఫ్రైడే' కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులకు కారణం దోమ.. దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అవగాహన ర్యాలిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందిని, వీటి భారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అవగాహన కల్పించేందుకు రెండు, మూడు నెలల పాటు జనజాగృతి ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. బుడమేరులో నీటి ప్రవాహం సరిగా ఉండేలా ప్రత్యేక యంత్రాలసాయంతో గుర్రపు డెక్క, తూటికాడలను తొలిగించడం జరుగుతుందన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండ కుండా చూసి వ్యాధులకు కారణమయ్యే దోమల బ్రీడింగ్ సోర్స్‌లను నాశనం చేయడం పైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, విభాగాలు సీజనల్ వ్యాధుల కట్టడికి తమ వంతు బాధ్యతగా చర్యలు చేపడుతున్నామని, ప్రజలు భాగస్వాములై అవగాహన పెంపొందించు కొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జానా రెడ్డి, నగరపాలక సంస్థ ఇన్‌చార్జికమిషనర్ ఎ.మహేష్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్టులు) కేవీ సత్యవతి, డీఎంహెచ్‌ఓ ఎం.సుహాసిని, నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పి.రత్నావళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, ఆర్డీవో

మౌలిక వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్ సృజన

తిరువూరు : పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లో ఆమె పర్యటించారు. జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కొందరు ఇంటినుంచి భోజనం తెచ్చుకోవడాన్ని గమనించిన కలెక్టర్ వారిని ప్రశ్నించగా.. పాఠశాలలో భోజనం తినలేక ఇంటివద్దనుంచి తెచ్చుకుంటున్నట్టు తెలిపారు. ఇకపై మంచి బియ్యం అందించేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల పరిసరాల అపరిశుభ్రత, పలు తరగతి గదులు నిరుపయోగంగా ఉండటాన్ని గుర్తించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం గంపలగూడెం మండలం వినగడపవద్ద కట్టలేరుపై ధ్వంసమైన వంతెనను పరిశీలించి నూతన వంతెనకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో మాధవి, ఎంఈవోలు శ్యామ్‌సుందర్, రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

- ఎంపీడీవో కుటుంబానికి మంత్రి నిమ్మల హామీ.. రక్షణ చర్యలపై ఆరా

పెనమలూరు, జూలై 19 : గత కొద్ది రోజులుగా అదృశ్యమైన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు కుటుంబసభ్యులను రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు పరామర్శించారు. కానూరు మహదేవపురం కాలనీలో వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. రమణారావు అదృశ్యం బాధాకరమని, అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఎంపీడీవో కుమారులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు.



ఎంపీడీవో కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

దర్యాప్తులో భాగంగా గాలింపు చర్యల గురించి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకొన్నారు. కేసు దర్యాప్తు, గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, ఎంపీడీవో అదృశ్యం బాధాకరమన్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు గాలింపు చర్యలు, కేసు దర్యాప్తులో పురోగతి సాధించేలా అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీచేశారన్నారు. ఏలూరు కాల్వలో నీటి ఉధృతి, అధిక వర్షాలతో గాలింపు చర్యల్లో కొంత ఇబ్బంది కలుగుతోందని, దీన్ని అధిగమించడానికి డ్రోన్ల సహాయం తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. ఏలూరు కాల్వతో పాటు మెయిన్‌కెనాల్, సబ్‌కెనాల్‌లో గుర్రపుడెక్క అధికంగా ఉన్నచోట్ల అనుభవజ్ఞులైన లస్కర్లను వినియోగించాలని జలవనరుల శాఖకు ఆదేశాలిచ్చినట్టు మంత్రి తెలిపారు. ఎంపీడీవో కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా, మండల అధికారులు, స్థానిక నేతలు ఉన్నారు.

ముమ్మర గాలింపు

గన్నవరం : అదృశ్యమైన ఎంపీడీవో రమణారావు ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది కేసరపల్లి నుంచి ఏలూరు కాలువలో అజ్జంపూడి, దావాజీగూడెం వైపు గాలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ, విజయవాడ మధురానగర్ ఏలూరు కాలువ దగ్గర చివరిసారిగా ఎంపీడీవో ఫోన్ సిగ్నల్ ఆగిపోవడంతో దాని ఆధారంగా విచారణ చేపడుతున్నట్టు తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, స్పెషల్ పోలీస్, లోకల్ పోలీస్ సిబ్బందితో నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేస్తున్నామన్నారు. మధురానగర్ నుంచి రామవరప్పాడు, కేసరపల్లి వరకూ ఏలూరు కాలువలో గాలించామన్నారు. ఏలూరు రేంజ్ ఐజీ పర్యవేక్షణలో అన్ని బృందాలతో కలిసి కేసరపల్లి నుంచి హనుమాన్‌జంక్షన్ పెరికీడు వరకూ ఏలూరు కాలువ దిగువనకు రెండు వైపుల గాలిస్తున్నట్టు తెలిపారు. పది బృందాలుగా పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు.



నష్టపరిహారం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

రామ్‌కో ప్రమాద ఘటనలో.. పరిహారం అందజేత

జగ్గయ్యపేట రూరల్, జూలై 19: రామ్‌కో సిమెంట్స్ ప్రమాద ఘటనలో మృతి చెందిన జయంతిపురం గ్రామానికి చెందిన నాగులు కుటుంబసభ్యులకు శుక్రవారం రూ. 12 లక్షల చెక్కును సంస్థ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్, తహసీల్దార్ శేషగిరి అందజేశారు. మృతుడి కుటుంబసభ్యులతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందంలో కుమారుడు డిగ్రీ చదువుకు అయ్యే ఖర్చు, మూడేళ్ల అనంతరం కంపెనీలో ఉద్యోగం ఇస్తామని, భార్య జ్యోతికి పింఛన్‌తో పాటు కంపెనీ నిబంధనల ప్రకారం ఈఎస్‌ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్‌ల ద్వారా కొంత నగదు వచ్చేలా ప్రయత్నిస్తామని తక్షణం మట్టి ఖర్చుల కింద రూ.30 వేలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాం చిన్నబాబు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రామ్‌కో సిమెంట్స్ ప్రమాద ఘటనలో మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

నష్టపరిహారంపై గ్రామస్థుల ఆగ్రహం..

రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో 2000ల మందికి పైగా కూలీలు పనిచేస్తుంటారని, పనులపై వారికి సరైన శిక్షణ లేకపోవటంతో తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల బూదవాడ అల్ట్రాటెక్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 50లక్షలు చెల్లించగా రామ్‌కో కంపెనీ మాత్రం రూ. 12 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌లు, యాజమాన్యాలు కుమ్మక్కై కార్మికుల శ్రమ దోపిడీ చేస్తూ వారికి ఎటువంటి భద్రత కల్పించటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.



పరిమితికి మించి ఇసుకతో పట్టుబడిన లారీ

ఇసుక స్టాక్‌యార్డులో అధికారుల తనిఖీలు

- పరిమితికి మించిన లారీలకు జరిమానా

జగ్గయ్యపేట రూరల్, జూలై 19 : అనుమంచిపల్లి ఇసుక స్టాకు యార్డు నుంచి అదనంగా ఇసుక తరలిస్తున్న లారీకి అపరాధ రుసుము విధించినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ మణికంఠరెడ్డి తెలిపారు. శుక్రవారం సాధారణ తనిఖీలలో భాగంగా ఏపీ 39 ఎక్స్ 5697 నంబరు లారీని పరిశీలించగా 20 టన్నులు ఉండాల్సి ఉండగా 17.04 టన్నులు అధికంగా ఉన్నట్టు గుర్తించి టన్నుకు రూ.రెండు వేల చొప్పున రూ. 34,800లు జరిమానా విధించినట్టు తెలిపారు. అధికంగా రవాణా చేసినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా, అనధికారికంగా నిల్వ చేసినా చర్యలు తప్పవన్నారు. అనుమంచిపల్లి గ్రామం తెలంగాణా సరిహద్దున ఉండటంతో స్టాకు యార్డులో అధికారులు అక్రమ సంపాదనకు తెరతీసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. పట్టుబడిన లారీకి అనుమంచిపల్లి నుంచి తొర్రకుంటపాలెంకు వే బిల్లులో సూచించారు. ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకే ఇసుక ఎత్తినట్టు అధికారులు చెబుతున్నారు. యార్డులో సిబ్బందిపై ఏడీ మైన్స్‌కు సమాచారం ఇచ్చినట్టు సీఐ తెలిపారు.

పోలవరం కాలువలో యువకుడి మృతదేహం

హనుమాన్‌జంక్షన్, జూలై 19 : నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ పవన్‌కుమార్ (24) మృతదేహం శుక్రవారం పోలవరం కాలువలో లభ్యమైంది. గురువారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన పవన్‌కుమార్ వేలేరు గ్రామ సమీపంలో కాలవలో పడిపోయాడు. కాలువ గట్టు పక్కన మోటార్ బైక్, చెప్పులు ఉండడాన్ని గుర్తించిన స్థానికులు యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు తొలుత భావించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కాలువపై గాలింపుచర్యలు చేపట్టారు. శుక్రవారం రంగన్నగూడెం గ్రామ సమీపంలో పవన్‌కుమార్ శవమై తేలాడు. మృతదేహానికి గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై జనార్దన్ తెలిపారు.

ఫోర్‌వీలర్ టెక్నీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జూలై 19 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు వివిధ రకాల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా సంస్థ అధ్వర్యంలో విజయవాడ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో స్కిల్ హబ్‌లో ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సు నాల్గవ బ్యాచ్, డిజిటల్ మార్కెటింగ్ మూడవ బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. ఈ కోర్సుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఆఖరి తేదీ జూలై 26 అన్నారు. మూడు నెలల పాటు నైపుణ్య శిక్షణ కల్పించి వారికి స్థానికంగా, ఇతర రాష్ట్రాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి వున్న యువత వారి విద్యార్హతను బట్టి రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు.

అర్హతలు : ఫోర్ వీలర్ టెక్నీషియన్‌కు 8-10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, డిజిటల్ మార్కెటింగ్‌కు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలి. అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://ఎఫ్‌ఓఆర్‌ఎంఎస్.జీఎల్‌ఇ/ఆర్‌ఎఫ్‌యుఓ.ఇన్‌9వై బీటీకేఎల్‌టీఎఫ్‌టిసిపి లింక్‌పై క్లిక్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 9985759304, 8008742842, 9347779032 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

డ్రైన్‌లలో పేరుకున్న డెక్క!


- నీటి ప్రవాహానికి అడ్డుకట్ట
- ముందస్తు చర్యలు శూన్యం
- గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు, రైతు నాయకులు వినతి



ఘంటసాల - చిరుదుగడ్డ రోడ్డులోని గుండేరు వంతెన వద్ద గుర్రపు డెక్క

ఘంటసాల : మండలంలో ప్రవహిస్తున్న గుండేరు, చిల్లలవాగు, భీమనది ఛానల్, గంజి కాలువలో తూటుకాడ విస్తారంగా పేరుకుపోయింది. వర్షాలు కురుస్తుండటంతో గుర్రపు డెక్క, తూటుకాడ డ్రైన్ అంతా దట్టంగా వ్యాపించి అడ్డంకిగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైన్‌లలో నీటిపారుదలను గుర్రపు డెక్క అడ్డుకుంటోంది. గుండేరు డ్రైన్ పరిధిలోని ఘంటసాలెం, చాట్రగడ్డవానిగూడెం సమీపంలో ఉన్న పాత వంతెన వద్ద, ఘంటసాల - చల్లపల్లి ప్రధాన రహదారి అయిన దేవరకోట వంతెన వద్ద, చిరుదుగడ్డ వంతెన వద్ద, గుర్రపు డెక్క నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. వర్షం ఇలాగే కురిస్తే పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గుండేరు, చిల్లలవాగు, భీమనది ఛానల్, గంజి కాలువ డ్రైన్ల పరిధిలో కొంతమంది రైతులు నాట్లు పూర్తి చేసుకోగా, కొందరు వెద పద్ధతిపై వ్యవసాయం సాగు చేస్తున్నారు. నారుమడులు కూడా మునిగిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

చాట్రగడ్డగూడెం - జోడుగూడెం పాత వంతెన వద్ద..



ముందస్తు చర్యలేవీ..

వేసవికాలంలో డ్రైన్‌ల మరమ్మతులు చేయాల్సిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవటంతో తూటుకాడ, గుర్రపు డెక్క కలుపుజాతి మొక్కలతో పేరుకుపోయాయి. వవేసవికాలంలో ఉపాధి పనులతో గానీ, స్ప్రేయింగ్ పద్ధతుల్లో గానీ డ్రైన్‌లో చెత్తాచెదారాలను తొలగించే చర్యలు చేయక అధికారులు మిన్నకుండిపోవటంతో డ్రైన్‌లలో నేడు ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొలగింపు చర్యలు చేపట్టాలి

గుండేరు డ్రైన్‌లో దట్టంగా అల్లుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు వేమూరి రత్నగిరిరావు, శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు దోనేపూడి గోపికృష్ణ, రైతు నాయకులు మిక్కిలినేని మధు డిమాండ్ చేస్తున్నారు. ఘంటసాల మండల పరిధిలోని ఉన్న గుండేరు డ్రైన్ పరివాహ ప్రాంతాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటి వరకు అయితే రైతులకు ఎలాంటి నష్టం లేనప్పటికీ డ్రైన్‌లలో ఉన్న గుర్రపు డెక్క తొలగించకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

బిల్లులు చెల్లించండి సారూ..!

- జేసీ ఆదేశాలూ బేఖాతరు..
- ఎన్నికల పనుల్లో కాంట్రాక్టర్‌కు చుక్కలు
- రూ.3.50 లక్షలు ఇవ్వకుండా తిప్పలు
- జగ్గయ్యపేట తహసీల్దార్ తీరుపై కలకలం



తహసీల్దార్‌ను బిల్లుల కోసం ప్రశ్నిస్తున్న కాంట్రాక్టర్ ఆంజనేయులు

జగ్గయ్యపేట, జూలై 19 : జాయింట్ కలెక్టర్ ఆదేశించినా మాకేంటి.. అంటూ ఎన్నికల బిల్లులు ఇచ్చేందుకు జగ్గయ్యపేట తహసీల్దార్ ససేమిరా.. అనటంతో శుక్రవారం జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ల వైఖరితో విసుగు చెందిన గుంటూరు కాంట్రాక్టర్ బిల్లులు ఇవ్వకపోతే ఇక్కడే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి, కొత్త ప్రభుత్వం కొలువు దీరినా.. ఎన్నికల వ్యయానికి సంబంధించి బిల్లులు చెల్లించేందుకు జగ్గయ్యపేట రెవెన్యూ అధికారులకు తీరిక రావడంలేదు. కాంట్రాక్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. డీటీలు, ఏపీవోలు, ఓపీవోలుగా పనిచేసిన వారికీ సరైన మొత్తంలో పారితోషికాలు ఇవ్వలేదు. ఎన్నికల కమిషన్ ఇవ్వమన్న పారితోషికానికి, అధికారులు ఇస్తున్నదానికి పొంతనలేదని ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ ఆంజనేయులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇబ్రహీంపట్నం నిమ్రా కాలేజి కౌంటింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ పనులు, జనరేటర్లు, ఆయిల్, ఎలక్ట్రీషియన్లను ఏర్పాటు చేశాడు. ఇందుకు గాను జగ్గయ్యపేట అసెంబ్లీ కౌంటింగ్ ఖర్చు కింద రూ.3.50లక్షలు చెల్లించాల్సి ఉంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసి రెండు నెలలు దాటుతున్నా ఇంత వరకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఎన్నికల అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదని కాంట్రాక్టర్ ఆరోపిస్తున్నాడు.

జేసీ సంపత్‌కుమార్ మైలవరం ఆర్వోగా ఉండటం, తూర్పు నియోజకవర్గం నుంచి బిల్లులు ఇప్పించినా జగ్గయ్యపేట తహసీల్దార్ మాత్రం వాయిదాలు వేస్తున్నారన్నారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన కాంట్రాక్టర్ ఆంజనేయులు తహసీల్దార్ శేషు, డీటీ నాగరాజును దీనిపై నిలదీశారు. జేసీ చెప్పినా బిల్లులు ఎందుకు ఇవ్వటం లేదంటూ మండిపడ్డారు. బిల్లులు ఇవ్వకపోతే ఇక్కడే కాగితం రాసి నుయ్యో, గొయ్యో చూసుకుంటానని హెచ్చరించారు. ఆంజనేయులు మాటలు కార్యాలయంలో కలకలం రేపాయి.

బాలికకు వేధింపులు.. పోక్సో కేసు నమోదు

గుడ్లవల్లేరు, జూలై 19 : బాలికను దురుద్దేశపూర్వకంగా వేధిస్తున్నాడన్న అభియోగంపై వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. గుడ్లవల్లేరు ఎస్‌ఐ జి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మదిరి అరుణ్ కుమార్ (55) తన ఇంటి సమీపంలో ఉండే బాలికపై జూలై 1న అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లి, బంధువులు గట్టిగా మందలించారు. అప్పటి నుంచి బాలికను, కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్నాడు. శుక్రవారం బాలిక రోడ్డుపై వెళుతుండగా బైక్‌తో వెంబడించి వేధిస్తుండటంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 123, 133
చికెన్ విత్ స్కిన్	218
చికెన్ స్కిన్‌లెస్	228

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

వివాహిత ఆత్మహత్యాయత్నం..భర్తపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 19: భర్త వేధింపుల కారణంగా దేవినగర్ ప్రాంతానికి చెందిన బొమ్మశాలి ఝాన్సీ గురువారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల ప్రకారం ఝాన్సీకి రెండేళ్ల క్రితం అన్నం ప్రసన్నకుమార్‌తో వివాహం జరిగింది. అప్పటి నుంచి ప్రసన్నకుమార్ ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండటంతో దంపతుల మధ్య గొడవలు వచ్చాయి. భర్త శారీరకంగా, మానసికంగా భార్యను హింసిస్తున్నాడు. భర్త పెట్టే బాధలు భరించలేక భార్య ఇంట్లో ఉన్న పలు రకాల ట్యాబ్‌లెట్లను మిగింది. నోటి నుంచి నురగలు వస్తూ అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఝాన్సీ తల్లి ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం భర్తపై కేసు నమోదు చేశారు.

ఇంట్లో చోరీ

పాయకాపురం: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాల ప్రకారం ఉడా కాలనీలో ఉంటున్న రైల్వే ఉద్యోగి పాల వెంకటేశ్వరరావు ఈనెల 16న ఇంటికి తాళం వేసి ఉయ్యూరులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం రాత్రి వచ్చే సరికి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించాడు. ఇంట్లో సామాన్లు చిందరవందరగా ఉండటాన్ని గుర్తించి ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 25 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 30 వేలు, కెమేరా చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.



4వ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో



50వ డివిజన్‌లో



45వ డివిజన్ బ్రహ్మయ్యకాలనీలో



33వ డివిజన్ సత్యనారాయణపురంలో



62వ డివిజన్‌లో

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక కార్యాచరణ

● నగరంలో ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీలు

చిట్టినగర్, జూలై 19: డెంగ్యూ, మలేరియా వ్యాధులను అరికట్టేందుకు, ప్రజలకు వాటిపై అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్యాన్ని మెరుగుపర్చటంతోపాటు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను కాపాడేందుకు నగరంలోని 64 డివిజన్లలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి డివిజన్ కార్పొరేటర్లతోపాటు వీఎంసీ అధికారులు, హెల్త్ సెక్రటరీలు వీధుల్లో ర్యాలీగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. హెల్త్ సెక్రటరీలు డోర్ టు డోర్ వెళ్లి ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. చెత్త వ్యర్థాలు ఇంటింటికి వచ్చే సిబ్బందికి ఇవ్వాలని, డ్రెయిన్లలో, రహదారుల వెంబడి చెత్త వేయవద్దని సూచించారు. మలేరియా సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి దోమల నివారణ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ. మహేష్, అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కె.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● 49వ డివిజన్ పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొమర కిరణ్, స్పెషల్ ఆఫీసర్ ఆశా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం పాల్గొన్నారు.

● 50వ డివిజన్‌లో సీజనల్ వ్యాధులపై జరిగిన అవగాహన ర్యాలీలో సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొని ప్రారంభించారు.

శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో

భారతీనగర్: తూర్పు నియోజకవర్గ పరిధి 4వ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం రూ. 20లక్షలతో పరమేశ్వరరావు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, గాంధీ, డివిజన్ నాయకులు, జోనల్ కమిషనర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

పాయకాపురం: డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బందితో కలిసి 62వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 62వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పైడి శ్రీను మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

సత్యనారాయణపురం: 33వ డివిజన్ సత్యనారాయణపురంలో శుక్రవారం దోమల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ (పభుదాస్, కార్పొరేటర్ శర్వాణీ మూర్తి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జైపాల్, హెల్త్ సెక్రటరీలు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

భవానీపురం : 45వ డివిజన్ జనసేన అధ్యక్షులు బొమ్ము గోవిందలక్ష్మి, రాంబాబులు డివిజన్‌లో బ్రహ్మయ్య కాలనీ, శ్రీనిధి శాంతినగర్ కాలనీలో అవగాహన కల్పించారు. 43వ డివిజన్ 133, 134 సచివాలయాల పరిధిలో డెంగ్యూ, డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జనసేన డివిజన్ అధ్యక్షుడు బి. కోటి, శానిటరీ, హెల్త్ సెక్రటరీ, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. 44వ డివిజన్‌లో కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. వేణుగోపాలరావు, సిబ్బంది లేబర్‌కాలనీ, ఇతర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అజిత్‌సింగ్‌నగర్, జూలై 19 : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ అండ్ ఏపీసీపీడీసీఎల్ ఇన్‌స్పెక్టర్ డి. గంగాభవాని సూచించారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో విద్యుత్ ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. వర్షాలు పడుతున్న సమయంలో కరెంట్ స్థంభాలను తాకడం, దగ్గరగా ఉండటం చేయరాదన్నారు. చెట్లు, కొమ్మలు విరిగి పడిన చోట విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉందని అటువంటి చోట అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో రైతులు మోటార్లను వేసే ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడి చేతులతో ఇళ్లల్లోని స్విచ్‌బోర్డులను తాకరాదన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తినపుడు దగ్గరలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందికి, లేదా 1912 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని కోరారు.

దేశసేవలో యువత భాగస్వాములు కావాలి

అగ్నివీర్ యువ పోస్టర్ ఆవిష్కరణలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి సందీప్

లబ్బీపేట, జూలై 19: దేశ సేవలో యువకుల పాత్ర ఎంతో ఉంటుందని, ప్రతి ఒక్కరూ దేశ సేవలో భాగస్వాములు కావాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి ఎన్.సందీప్ అన్నారు. నలంద కళాశాలలో శుక్రవారం అగ్నివీర్ వాయు అగ్నిపాత్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అగ్నిపాత్ పథకంలో యువతీ, యువకులు నాలుగేళ్ల పాటు సాయుధ దళంలో చేరడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని, భారత వైమానిక దళంలో చేరి దేశసేవ చేయలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ఈ ఉద్యోగాలకు ఏ విధంగా ఎంపిక కావాలి, సౌకర్యాలు తదితర అంశాలను వివరించారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్‌డీ డైరెక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ ఈ పరీక్ష రిజిస్ట్రేషన్ ఈ నెల 28వ తేదీ వరకు ఉంటుందని, ఆన్‌లైన్ పరీక్ష అక్టోబరు 18 నుంచి జరుగుతాయని తెలిపారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం అగ్నివీర్ యువ పోస్టర్ ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎయిర్‌ఫోర్స్ అధికారి సందీప్. ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

ఎస్ఆర్ఆర్ కళాశాలలో అవగాహనా సదస్సు

విజయవాడ లీగల్ : ఎస్ఆర్ఆర్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి ఎన్.సందీప్ హాజరై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్న ఉద్యోగావకాశాలను తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి, జిల్లా ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీ సర్వాణి, అధ్యాపకులు డాక్టర్ లలిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వన్‌టౌన్: కేబీఎన్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో రక్షణ రంగంలో ఉపాధి అవకాశాలపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎన్ సందీప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి నారాయణరావు, ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారి కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే తూర్పులో అభివృద్ధి

ఎంపీ కేశినేని శివనాథ్

మొగల్రాజపురం, జూలై 19: ఎమ్మెల్యేగా గద్దె ఎన్నికైన తరువాతే ప్రజలు తూర్పులో అభివృద్ధి చూశారని, ఇపుడు కూడా అదే ఒరవడి కొనసాగుతుందని ఎంపీ కేశినేని శివనాథ్ చెప్పారు. 8వ డివిజన్ అశోక్‌నగర్ 5వ నెంబర్ బస్‌రూట్‌లో మొదటి క్రాస్ రోడ్డుకు రూ.17.97లక్షలతో, శ్యామ్‌నగర్‌లో రూ.9.97 లక్షలతో చేపట్టే సిమెంట్ రోడ్డు పనులకు ఆయన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చుతామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, దాని వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అరికట్టవచ్చని చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రోడ్లతో పాటు స్ట్రాం వాటర్ డ్రెయిన్స్ నిర్మిస్తామని చెప్పారు. ఇందు కోసం ఎల్ అండ్ టీ తో పనులు చేశామని, వైసీపీ వచ్చి పనులను ఆపేసిందని దాని ప్రభావం వల్ల చిన్న పాటి వర్షానికే రోడ్లు మునిగిపోతున్నాయన్నారు. ఈ పథకంలో మిగిలిన నిధులు ఎంపీ సాయంతో తీసుకొచ్చి చేయిస్తామని ఆయన చెప్పారు. కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, కోగంటి రామారావు, మల్లెల రామకృష్ణ, పాలడుగు వల్లభాయ్ పటేల్, కేవీ శ్రీనివాస్, నారు రామారావు, సోంగా సంజయ్ వర్మ, బోగాది అనిల్, ఎర్నేని వేదవ్యాస్, గడ్డం హరి కృష్ణ, వీరపనేని అరుణ, గద్దె రమేష్, చలసాని రమణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో మహాలక్ష్మిదేవి, గంగానమ్మ



శాకంబరీ అలంకారంలో చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారు, కొత్తపేట గంగానమ్మ అమ్మవారు

చిట్టినగర్, జూలై 19: కొత్తపేట, చిట్టినగర్ పలు దేవాలయాల్లో శాకంబరీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాలక్ష్మి అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, దాతలు సమర్పించిన కూరగాయలతో ఆలయ అర్చకులు అమరలింగేశ్వర కృష్ణప్రసాద్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం పంచహారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షకార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ● కొత్తపేట గంగానమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని మంగళగౌరి, శాంభవి అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వాండ్రాసి నానాజి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



జ్యోతి వెలిగించి సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గద్దె అనురాధ

లబ్బీపేట, జూలై 19: బృందావన్ కాలనీలోని ఎ కన్వెన్షన్‌లో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ నగరంలో మొట్టమొదటి సారిగా మహిళల కోసం సరికొత్త వెరైటీ వస్త్రాలను అందుబాటులో ఉంచుతూ ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయం అని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని పేరు పొందిన పలు రాష్ట్రాల నుంచి మంచి వెరైటీ వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిర్వాహకులు వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో మొదటిసారి ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ దేశంలోని 14 రాష్ట్రాల నుంచి పలు వస్త్రాలను వస్త్ర ప్రేమికుల కోసం అందుబాటులో ఉంచామని తెలిపారు. ముఖ్యంగా వెడ్డింగ్ కలెక్షన్స్, వరమహాలక్ష్మి వ్రతం వస్త్రాలు తమ ప్రత్యేకత అని, ఈ ఎగ్జిబిషన్ ఈనెల 22 వరకు ఉదయం 11గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఉంటుందని తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

● సంకల్ప సిద్ధి షిర్డీసాయిబాబాకు స్వర్ణకిరీటం



స్వర్ణ కిరీటధారుడైన షిర్డీసాయిబాబా

భవానీపురం, జూలై 19: హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షిర్డీసాయిబాబా ఆలయంలో ఘనంగా శుక్రవారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు అఖండ జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. భక్తుల విరాళాలతో కేజీ 100 గ్రాముల బంగారంతో తయారుచేయించిన స్వర్ణ కిరీటాన్ని భక్తులే స్వయంగా పాలాభిషేకం చేసి అలంకరించారు. మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, భక్తులు పెద్ద ఎత్తున బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెండు వేల మందికి పైబడి సాయి భక్తులు, పేదలు అన్నదానం స్వీకరించారు. కమిటీ సభ్యులు మోటమర్రి సుబ్బారావు, ఇన్నమూరి రమేష్, చందలూరి రాజశేఖర్, శివన్నారాయణ, పెండేల వెంకటలక్ష్మిప్రసాద్, గుడివాడ విజయ్‌కుమార్, రజనీకాంత్, యెనిగళ్ల సుబ్బారావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేబీఎన్‌లో బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు

వన్‌టౌన్, జూలై 19: విద్యార్థులకు తమ రక్తం గ్రూపు వివరాలు తెలిసి ఉండాలని గైనకాలజిస్ట్ భారతలక్ష్మి అన్నారు.గాంధీ మహిళా కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేయించారు. కరస్పాండెంట్ ,సెక్రటరీ సీఎల్ కాంతారావు, వైస్ చైర్మన్ కేవీ పిచ్చయ్య, ప్రిన్సిపాల్ ఎం. రమణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ రావు పార్కు స్విమ్మింగ్‌పూల్ విద్యార్థినికి కాంస్యం



చిట్టినగర్, జూలై 19: ఇటీవల కర్నూలులో జరిగిన ఆక్వాటిక్ అసోసియేషన్ స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం గెలుపొందిన కేఎల్ రావుపార్కు స్విమ్మింగ్‌పూల్ విద్యార్థిని ఎన్.స్మృతిహర్షికను శుక్రవారం కోచ్ రఫీతోపాటు పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు. పోటీల్లో స్మృతి హర్షిక 50మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో కాంస్య పతకం సాధించిందని కోచ్ పేర్కొన్నారు.

భారీ వృక్షాన్ని తొలగించండి



పటమట, జూలై 19 : పటమటలంక రాఘవ నగర్‌లో బుజ్జులు టవర్స్ ఎదురుగా ఏళ్లనాటి భారీ వృక్షం ఎండిపోయి, ఆకులు రాలి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఈ రోడ్డులో పలు కార్పొరేట్ పాఠశాలల పిల్లలు తిరుగుతూ ఉంటారు. బందరు రోడ్డు నుంచి వాహనదారులు ఈ మార్గానే పటమటలంకలోకి రాకపోకలు సాగిస్తుంటారు. ఏ క్షణ్ణాన్నైనా పడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఈ భారీ వృక్షాన్ని కార్పొరేషన్ సిబ్బంది తొలగించాలని పటమటలంక వాసులు కోరుతున్నారు.



కూలిన గోడ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు , నాయకులు

కొండప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించాలి

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

చిట్టినగర్, జూలై 19: కొండప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి జీ. కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం 51వ డివిజన్ కొండప్రాంతంలో జారిపడిన గోడ ప్రాంతాన్ని ఆయన పలువురు సీపీఐ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, కొండప్రాంతాల్లో పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ ప్రమాదభరితంగా ఉండటంతోపాటు రిటైనింగ్ వాల్స్ లేని ప్రాంతాల్లో ఇళ్లు కూలిపోతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆకుల ఏసు, సింగరాజు సాంబశివరావు పాల్గొన్నారు.

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ప్రోగ్రామ్స్ వివరాలు

1. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్
2. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్:
3. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్:

అర్హతలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Mx7wZFHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం!

మెల్‌బోర్న్ వేదికగా జరిగే 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ 15వ ఎడిషన్‌కు హీరో రామ్‌చరణ్ అతిథిగా హాజరు కానున్నారు. ఇందులో బహూకరించే సినిమా అవార్డులకు తన స్టార్ పవర్‌ను జోడించడం ఆసక్తికరం. భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'మన భారతీయ చిత్రాల్లోని వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని అంతర్జాతీయ వేదికగా వేడుక నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ వేడుకలో పాల్గొనే అవకాశం రావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున నేను ప్రాతినిధ్యం వహించడం ఆనందం కలిగించే అంశం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల్ని, అభిమానుల్ని కలుసుకోవడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాను' అన్నారు.



ఏజెంట్ జాన్ స్నో



నితిన్, శ్రీలీల జంటగా రూపుదిద్దుకుంటున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇందులో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రను పోషిస్తున్నారు. ఆయన అసలు పేరు జనార్ధన్ సున్నిపెంట అయితే జాన్ స్నో గా మార్చుకోడం ఆసక్తికరం. శుక్రవారం రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. చిత్రంలో ఆయనది కీలకమైన పాత్ర అనీ, వినోదభరితంగా ఉంటుందని దర్శకుడు వెంకీ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదలవుతుంది.

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో చల్లగాలులు పలకరిస్తుంటే కోర్టు కేసులు, పోలీసు విచారణలు, విడాకులు, వివరణల వార్తలతో చిత్రసీమ వేడెక్కింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలు శుక్రవారం పలు వివాదాలతో వార్తల్లో నిలిచాయి.



వివాదం విచారణ వివరణ

వివాదం

రూ. పాతిక కోట్లకు పరువునష్టం దావా

'కల్కి 2898 ఏడీ' చిత్రానికి వచ్చిన వసూళ్లు అంతా ఫేక్ అనే వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ సినీ విమర్శకులు సుమిత్ కడేల్, రోహిత్ జైశ్వాల్‌పై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేసింది.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' చిత్రం బాక్సాఫీసు దగ్గర సత్తా చాటుతోంది. ఇటీవలే రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరినట్లు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అయితే ఇవన్నీ ఫేక్ కలెక్షన్‌లు అని సుమిత్, రోహిత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. రూ. 800 కోట్లు వస్తే, రూ. వెయ్యి కోట్లు అని చెబుతున్నారని విమర్శించారు. దీంతో వైజయంతి మూవీస్ రంగంలోకి దిగింది. 'కలెక్షన్లు ఫేక్ అని మీకు ఎవరు చెప్పారు? మీ దగ్గర ఉన్న ఆధారాలేమిటో చూపించండి, లేదా రూ. 25 కోట్లు చెల్లించండి' అని నోటీసులు పంపింది. గతంలోనూ ఇలాగే సుమిత్, రోహిత్ ప్రభాస్ చిత్రాలను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.

విడాకులు నిజమేనా?

అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్ బచ్చన్ దంపతుల విడాకులు ఖాయమనే ప్రచారం కొన్నాళ్లుగా బాలీవుడ్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే అభిషేక్‌బచ్చన్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఐశ్వర్య తాముకలిసే ఉన్నామంటూ చెప్పకనే చెప్పారు. అయినా ఆ ప్రచారం మాత్రం ఆగలేదు. ఇటీవలే అనంత్ అంబానీ పెళ్లికి సైతం వీరిద్దరూ విడివిడిగా రావడమే గాకుండా ఫొటోలు సైతం విడిగానే దిగారు. దీంతో మరోసారి వీరి విడాకుల వ్యవహారం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు అభిషేక్‌బచ్చన్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ విడాకుల పోస్ట్‌కు లైక్ కొట్టారు. దీంతో వీరిద్దరూ విడిపోబోతున్నారు కాబట్టే అభిషేక్ ఆ పోస్ట్‌కు లైక్ కొట్టాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రచయిత హీనా ఖండేల్‌వాలా షేర్ చేసిన ఆ పోస్ట్‌లో ఏముందంటే 'కొన్నిసార్లు జీవితం మనం అనుకున్నట్లు సాగదు. విడిపోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. అయినా 50 ఏళ్లు దాటిన వారు కూడా రకరకాల కారణాలతో విడిపోతున్నారు. దశాబ్దాల పాటు కలసి బతికిన వారిని ఇప్పుడు విడిపోవడానికి పురికొల్పుతున్నది ఏమిటి' అనేది ఆ పోస్ట్ సారాంశం.



విచారణకు రాలేను

- రాజ్‌తరుణ్



రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ప్రేమ వ్యవహారం కేసులో విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ నెల 18న విచారణకు హాజరవ్వాలని నార్సింగ్ పోలీసులు రాజ్‌తరుణ్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణకు హాజరవ్వలేనని రాజ్‌తరుణ్ పోలీసులకు తన న్యాయవాది ద్వారా వివరణ పంపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు కొత్త సినిమా చిత్రీకరణ, ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండడమే అందుకు కారణమని పేర్కొన్నారు. దీంతో రాజ్‌తరుణ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ విచారణకు హాజరవ్వకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

వివరణ

చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి

- బన్నీ వాసు

'ఏ కుటుంబంలో అయినా ఒకరు తీసుకున్న నిర్ణయాల వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇలాంటివి మామూలే. వచ్చిపోతుంటాయి. సమయం వచ్చినప్పుడు 'మేం అంతా ఒక్కటే' అని మెగా - అల్లు ఫ్యామిలీ చాటి చెబుతుంది' అన్నారు నిర్మాత బన్నీవాసు. శుక్రవారం ఆయన ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లు అర్జున్ గత ఎన్నికల్లో వైసీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌కు ప్రచారం చేయడం మెగా-అల్లు కుటుంబాల మధ్య విభేదాలకు దారి తీసిందనే ప్రచారం కొన్నాళ్లుగా జరుగుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు బన్నీవాస్‌ను అడగ్గా, ఆయన 'అవును' అని గానీ, 'కాదు' అని గానీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పాత్రికేయుల ప్రశ్నకు సమాధానమిస్తూ 'అవన్నీ చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి' అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. 'గడ్డు పరిస్థితుల్లో ఆ రెండు కుటుంబాలు ఒకరికి ఒకరు అండగా నిలిచాయి. ఏ కుటుంబంలో అయినా కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అంతమాత్రాన వారి అనుబంధం దెబ్బతిన్నట్లు కాదు. వాటినే హైలైట్ చేయడం మంచిది కాదు. నేను 20 ఏళ్లుగా మెగా-అల్లు ఫ్యామిలీని చూస్తున్నా. 'కుటుంబ సభ్యులందరూ కలసి ఉండాలని చిరంజీవి గారు ఎప్పుడూ కోరుకుంటారు. ప్రతి సంక్రాంతికి ఆయన కుటుంబ సభ్యులందరినీ తీసుకొని బెంగళూరు వెళ్తారు. మనమందరం ఒకటే అనే భావన కుటుంబ సభ్యుల్లో కలిగించాలనేదే ఆయన ఆలోచన' అని చెప్పారు.

క్షమాపణ

తప్పు చేశా... మన్నించండి

'హీరోయిన్ తమన్నా సాంగ్ ఉంటే చాలు... కథలో పస లేకపోయినా సినిమా హిట్టవుతుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి అలా తయారైంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో తమిళ నటుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దిగజారుడు వ్యాఖ్యలు చేశారంటూ కోలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన తీరును తప్పుబట్టింది. దీంతో పార్తీబన్ క్షమాపణలు చెప్పారు. 'చిత్ర పరిశ్రమకు చెందిన అందరినీ నేను గౌరవిస్తాను. నటీనటులను తక్కువ చేసే ఆలోచన నాకు లేదు. నా మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే నన్ను క్షమించండి' అని పార్తీబన్ కోరారు. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో తమన్నా ప్రత్యేకగీతంలో నర్తించారు. అలాగే ఆమె లీడ్‌రోల్ పోషించిన 'బాక్' చిత్రం కూడా మంచి వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో ఆ రెండు సినిమాలను దృష్టిలో ఉంచుకొనే పార్తీబన్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.




ఆయ్.. అందరినీ ఆకట్టుకుంటుంది



'ఆయ్.. అనే టైటిల్ పెడితే ఒక ప్రాంతానికే పరిమితం అవుతుందా అని అనుకున్నాం. కానీ కథ బాగుంటే అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఫిక్స్ చేశాం. ఈ కథను ఓకే చేసిన హీరో నితిన్‌కు అభినందనలు. అంతా ఓకే అనుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు ఫోన్ చేశాను. 'ఫస్ట్ డే వరకూ మనం పుష్ చేస్తాం. ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. కథ బాగుందని అంటున్నారు కనుక చేసేయ్యండి' అని ఆయన చెప్పారు. ఈ సినిమాలో వర్షం కోసమే రూ. కోటికి పైగా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊళ్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్లుగా అనిపిస్తుంది' అన్నారు అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నార్నే నితిన్ హీరోగా బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన 'ఆయ్' చిత్రం థీమ్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడారు. మంచి గోదావరి సినిమా తీశామనీ, స్నేహం గురించి ఇందులో చెప్పామనీ హీరో నార్నే నితిన్ చెప్పారు. ఈ సినిమా చూస్తుంటే నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయని బన్నీ వాసు చెప్పారు. గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని తీసిన సినిమాల్లో 'ఆయ్' బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర చెప్పారు.

కొత్త ప్రపంచంలోకి తంగలాన్

తమిళ హీరో విక్రమ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' విడుదల తేదీని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా చెప్పారు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.





మరిచిపోయినా...

కొన్ని వంటకాలు కాలక్రమేనా మరుగవుతుంటాయి. ఎందుకిలా అవుతుంటాయో మనకు తెలీదు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన వంటకాలు.. తూకా రోటీ, కొబ్బరిపాలు పులావ్, కిబ్బి, గ్రేటెడ్ కార్న్ స్నాక్స్‌ను వండుకోవచ్చు ఇలా..

మరపురాని వంటకాలు

వంటిల్లు

గ్రేటెడ్ కార్న్ స్నాక్

కావాల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్ కంకులు- 4, పచ్చిమిర్చి- 2 (సన్నగా తరగాలి), అల్లం- చిన్న ముక్క (సన్నగా తరగాలి), శనగపప్పు- 2 టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి సరిపడ, ధనియాల పొడి- పావు టీస్పూన్, యాలకులు- 3, ఆవాలు- పావు టీస్పూన్, నూనె- 2 టీస్పూన్స్ నెయ్యి- టీస్పూన్, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, తురిమిన ఎండుకొబ్బరి- 1 టేబుల్ స్పూన్, నిమ్మకాయ- 1

తయారీ విధానం: స్వీట్‌కార్న్ గింజలు తీసి మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని కుక్కర్‌లో వేసి సన్నగా తరిగిన అల్లం ముక్కలు, పచ్చిమిర్చి వేసి కలపాలి. స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి రెండు నిముషాలు గరిటెతో తిప్పాక.. కప్పు నీళ్లు పోసి.. మూత పెట్టకుండా మాత్రమే లోహీట్‌లో ఇరవై నిముషాల పాటు ఉంచితే బాగా ఉడుకుతుంది. స్వీట్‌కార్న్ మిశ్రమాన్ని బౌల్‌లో ఉంచి చల్లబర్చాలి.

గుంతప్యాన్‌లో నూనె, నెయ్యి కలిపి వేడి చేయాలి. ఇందులో శనగపప్పు, ఆవాలు వేసి కలపాలి. చేత్తో యాలకులు నలిపి వేయాలి. లోహీట్‌లో ఉంచి స్వీట్‌కార్న్ మిశ్రమం వేయాలి. ఇందులో పసుపు, ఉప్పు, కారం, ధనియాల పొడి వేసి ఇరవై నిముషాల పాటు కలపాలి. అంటే ఉప్మాలా కలపాలి. దీన్ని పొయ్యి మీద నుంచి తీసేసి ఐదు నిముషాల పాటు చల్చార్చాలి. ఆ తర్వాత కొబ్బరి తురుము, కొత్తిమీర, నిమ్మరసం చల్లుకుని కలపాలి. ఈ స్వీట్‌కార్న్ స్నాక్ రుచికరంగా ఉంటుంది.

కొబ్బరిపాల పులావ్

కావాల్సిన పదార్థాలు: నూనె- 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- టీస్పూన్, యాలకులు-2, దాల్చిన చెక్క-1, లవంగాలు- 4, సోంపు- అర టీస్పూన్, బిర్యానీ ఆకు-1, జీడిపప్పు- 12, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, క్యారెట్- 1 (సన్నగా తరగాలి), బీన్స్- 5 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 2, బఠాణీలు- 2 టేబుల్ స్పూన్లు, కొబ్బరిపాలు- 2 కప్పులు, బాస్మతి బియ్యం- కప్పు(ఇరవై నిముషాలు నానబెట్టాలి), తరిగిన కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడ

తయారీ విధానం: కుక్కర్‌లో నూనె వేసి జీలకర్ర, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, సోంపు, బిర్యానీ ఆకు వేసి లోఫ్లేమ్‌లో కలపాలి. మంచి సువాసన వస్తుంది. జీడిపప్పు వేసి రంగుమారేంత వరకూ కలపాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిలువుగా చీరిన పచ్చిమిర్చి వేయాలి. క్యారెట్, బీన్స్ ముక్కలతో పాటు బఠాణీలు వేసి రెండు నిముషాలు కలపాలి. వెంటనే కొబ్బరి పాలు పోయాలి. మూడు నిముషాలు ఉడికిన తర్వాత నానబెట్టిన బాస్మతి బియ్యం, తగినంత ఉప్పు వేసి కలియబెట్టాలి. కుక్కర్ మూత క్లోజ్ చేసి రెండు విజిల్స్ వచ్చేంత వరకూ కుక్ చేయాలి. ఆ తర్వాత గరిటెతో బాస్మతి బియ్యం విరక్కుండా మెల్లగా కలపాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుంటే సరి.. కొబ్బరిపాల పులావ్ రెడీ.



తూకా రోటీ

కావాల్సిన పదార్థాలు

బియ్యం- 500 గ్రాములు, పచ్చిమిర్చి- 8, మీడియం సైజ్ ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), కొత్తిమీర- టేబుల్ స్పూన్, ఉప్పు- తగినంత, ఎండు మిర్చి గింజలు- టీ స్పూన్, నూనె- 2 టేబుల్ స్పూన్లు



తయారీ విధానం

బియ్యాన్ని మెత్తగా అయ్యేంత వరకూ నానబెట్టుకోవాలి. ఆ తర్వాత బియ్యాన్ని తీసి జార్‌లో వేయాలి. వీటితో పాటు పచ్చిమిర్చి వేసి మిక్సీ పట్టాలి. ఈ పేస్ట్‌ను బౌల్‌లో వేసి.. ఇందులో ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, ఉప్పు, ఎండుమిర్చి గింజలు, నూనె వేసి మెత్తగా కలపాలి. ఈ పిండితో చపాతీల్లా ఒత్తుకుని.. ప్యాన్‌మీద కొద్దిగా నూనె వేసి స్పూన్‌తో ప్యాన్ అంతా స్ప్రెడ్ అయ్యేట్లు చేసిన తర్వాత ఈ రోటీని రెండు వైపులా కాల్చుకోవాలి. ప్రతి రోటీ కాల్చే ముందు ప్యాన్ మీద నూనె చిలకరించాలి. ఈ రోటీలను స్నాక్స్‌లా తినొచ్చు లేదా చట్నీ, ఊరగాయలతో తినొచ్చు.

కిబ్బి

కావాల్సిన పదార్థాలు

పెద్ద ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), ధనియాల పొడి- టీస్పూన్, కారంపొడి- టీస్పూన్, కుంకుమపువ్వు- కొద్దిగా, బాదాం- 20, నెయ్యి- ఫ్రైకి తగినంత

మారినేషన్ కోసం

బోన్‌లెస్ చికెన్ థై- 8, పెరుగు- 4 టేబుల్ స్పూన్లు, నల్ల మిరియాలు- 8, యాలకులు- 5, బాదాం- 12, లవంగాలు- 4, అల్లం వెల్లుల్లి పేస్ట్- టేబుల్ స్పూన్, తరిగిన పచ్చిమిర్చి ముక్కలు- అర టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత

తయారీ విధానం

ముందుగా నల్లమిరియాలు, యాలకులు, లవంగాలను వేయించి పొడిగా చేసుకుని ఉంచుకోవాలి. బౌల్‌లో చికెన్ ముక్కలు వేసి పెరుగుతో పాటు తయారు చేసుకున్న పొడి వేయాలి. పది ఆల్మండ్స్‌ను వేడినీటిలో నానబెట్టి పొట్టును తీసేసి ముక్కలుగా తరిగి వేయాలి. ఈ మిశ్రమంలోకి అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, తగినంత ఉప్పు వేసి నలభై ఐదు నిముషాల పాటు మారినేట్ చేసుకోవాలి.

ప్యాన్‌లో టీస్పూన్ నెయ్యి వేసి పది ఆల్మండ్స్‌ను వేయించాలి. వీటిని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ప్యాన్ మీద చికెన్ ముక్కలు ఉంచి రెండు వైపులా మీడియం హీట్‌లో రంగు మారేంత వరకూ వేయించాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు వేసి గోల్డెన్ బ్రౌన్ వచ్చేంత వరకూ వేయించాలి. ఇందులోకి కారంపొడి, ధనియాల పొడి వేసి కలపాలి. చికెన్ ముక్క జ్యూసీగా ఉన్నట్లు కనపడిన వెంటనే ఇందులోకి నెయ్యి చిలకరించి.. కుంకుమ పువ్వు వేయాలి. గరిటెతో బాగా కలపాలి. చివరగా వేయించిన బాదం పలుకులతో గార్నిష్ చేసుకుని స్నాక్స్‌లా తినాలి. ●



భూలోకంలో అమృతం
మజ్జిగ



అమరత్వం యథా స్వర్గం దేవానామమృతాద్భవేత్!
తక్రాద్భూమౌ తథా నృణామమరత్వం హి జాయతే!

సమస్త దోషాలనూ హరింపచేసే మజ్జిగని మానవులు తప్పనిసరిగా తాగాలి. అమరత్వం కోసం స్వర్గంలో దేవతలకు అమృతాన్ని, భూమ్మీద మానవులకు మజ్జిగని ఇచ్చాడు పరమాత్ముడు. మంచినీళ్లు అడిగితే మజ్జిగ ఇచ్చి పంపే సంస్కృతి మనది. మజ్జిగ లేదా చల్లకూ... తెలుగువారికీ అనుబంధం అనాదిగా ఉంది.

క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో మజ్జిగతో అనేక ప్రయోగాలు చెప్పాడు. మజ్జిగని సంస్కృతంలో 'తక్రం' అంటారు. 'తక్రం' ఆరోగ్య పరిరక్షణకు, వ్యాధి నివారణకూ పనికొచ్చే ఔషధం. వాపుల్ని కరిగించే శక్తి ఉంది. మొత్తం జీర్ణాశయ వ్యవస్థని బల సంపన్నం చేస్తుంది. లివరు, స్ప్లీను లాంటి మృదువైన అవయవాలలో కలిగే వ్యాధుల్ని నివారిస్తుంది. రక్త పుష్టి ఇస్తుంది. తీసుకున్న ఆహారంలో పోషకాలు వంటబట్టేలా చేస్తుంది. వేసవిలోనే కాదు, అన్ని కాలాల్లో తీసుకోదగిన ఔషధం మజ్జిగ. నెయ్యి, నూనెలతో కూడిన ఆహార పదార్థాలను ఎక్కువగా తిన్నప్పుడు మజ్జిగ తాగితే ఆ దోషం పోతుంది. జఠరాగ్ని పెరుగుతుంది.

కొందరికి మజ్జిగంటే పడదు. దాని వాసన సరిపడకపోవటం ఒక కారణం. ఇంకొందరికి మజ్జిగ తాగితే జలుబు చేస్తుందని భయం. మరికొందరికి మజ్జిగ అరగదనీ, త్రేన్పులు వస్తాయని అనుమానం. మజ్జిగలో నీళ్లు తప్ప ఏమీ లేవనే అభిప్రాయం కూడా కొందరిలో ఉంది. ఇవన్నీ మజ్జిగ ఉపయోగాలు తెలియక పెంచుకున్న అపోహలు.

ఒక గ్లాసు పెరుగుని చిలికి మూడు నుండి ఎనిమిది గ్లాసుల నీళ్లు కలిపి ఒక పూటంతా ఉంచాలి. ఆ పెరుగులో ఉన్న ఉపయోగపడే బాక్టీరియా ఆ నీళ్ల నిండా పెరుగుతాయి. ఈ ఉపయోగపడే బాక్టీరియా కోసమే మజ్జిగ. దీన్ని ప్రోబయాటిక్ ఔషధంగా చెబుతారు. జీర్ణశక్తి బలంగా ఉండాలంటే ఈ ప్రోబయాటిక్ కావాలి. అందుకు మజ్జిగే మంచి ఉపాయం. పాల కన్నా పెరుగు మంచిది. పెరుగు కన్నా చిలికిన మజ్జిగ తాగేవారి శరీరానికి వృద్ధాప్యం వచ్చినా పేగులకు రాదు.

మజ్జిగ అంటే పూర్ణచంద్రుడిలా, మల్లెపువ్వులా, శంఖంలా తెల్లగా ఉండాలి. బాగా చిలికితే తేలికగా అరుగుతాయి. ఫ్రిడ్జ్‌లో ఉంచిన మజ్జిగైతే దాని చల్లదనం పోయేదాకా బయటే ఉంచి తీసుకుంటే జలుబు చెయ్యదు. ఈ పెద్ద గ్లాసు మజ్జిగలో అరచెంచా నెయ్యి కలిపి, తగినంత సైంధవ లవణం, చిటికెడు ఇంగువ చేర్చి తాగితే అన్ని వ్యాధుల మీదా ఔషధంగా పని చేస్తుంది. అన్నంలో కూడా తినవచ్చు.

> **బాగా మీగడ కట్టిన పెరుగుని చిలికి, వెన్న తీసిన మజ్జిగని బటర్‌మిల్క్ అంటారు. నిజమైన బటర్‌మిల్క్ అంటే 'వెన్న తీసిన మజ్జిగ' అని అర్థం. రోజూ పెరుగు మీద మీగడని సేకరించి, ఒక పాత్రలో భద్రపరచి, చిలికి వెన్న తీసిన బటర్‌మిల్క్ కూడా మంచి ప్రోబయోటిక్ గుణాలు కలిగి ఉంటుంది. చిలికినకొద్దీ మజ్జిగలో తేలికగా అరిగే గుణాలు వస్తాయి.**

పెరుగుని చిలికి, దానికి మూడు నుంచి ఎనిమిది రెట్లు నీళ్లు పోసి, రాత్రంతా ఫ్రిడ్జ్‌లో కాకుండా బయటే ఉంచాలి. ఉదయాన్నే అందులో సైంధవ లవణం, జీలకర్ర, కాల్చిన శొంఠి దంచి, ఆ పొడి తగుపాళ్లలో కలిపి రోజూ తాగితే వాతం, పైత్యం, కఫ దోషాలు పోతాయి. కడుపులో నొప్పి, ఉబ్బరం, గ్యాసు, మంట తగ్గుతాయి. మొలల వ్యాధి కూడా తగ్గుతుంది. అజీర్తి పోతుంది. షుగరు, బీపీ, స్థూలకాయం, కీళ్లవాతం, చర్మ వ్యాధులు. సైనసైటిస్, మైగ్రేన్ తలనొప్పికి మంచి ఔషధం.

శొంఠి, మిరియాలు, ఉప్పు, జీలకర్ర, కమలాపండు పైన తొక్కలను తగు పాళ్లలో తీసుకొని, దంచి, ఆ పొడిని చిలికిన మజ్జిగలో కలపాలి. ఇంగువ పొంగించిన నెయ్యితో తిరగమోత పెడితే ఆ మజ్జిగని 'గౌరీ తక్రం' అంటారు. దీన్ని పార్వతీదేవి శివుడి కోసం తయారు చేసిందన్నాడు క్షేమశర్మ. ఇది ఆకలిని పుట్టిస్తుంది. తీసుకున్న ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. సమస్త వ్యాధుల్లోనూ ఔషధం. దీని రుచి 'దివ్యం' అన్నాడు.

పులిసిన మజ్జిగలో ఎనిమిది రెట్లు నీళ్లు కలిపి, ఔషధంగా మలుచుకోవచ్చు. వాత వ్యాధుల్లో సైంధవ లవణం (పింక్ సాల్ట్), పైత్య వ్యాధుల్లో చక్కెర, కఫ వ్యాధుల్లో శొంఠి, పిప్పలి, మిరియాల పొడి కలిపి తాగాలన్నాడు.

నిన్నటి మజ్జిగ మిగిలిపోతే ఒక వస్త్రంలో పోసి, మూటగట్టి, వడగట్టండి. సైంధవ లవణం, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, పిప్పళ్లు, శొంఠి, ఇంగువ, ఆవాలు, మెంతులు దంచి, ఆ పొడిని తగినంత కలిపిన మజ్జిగని 'అచ్చిక' అంటారు. ఇది అన్ని దోషాల మీదా పని చేస్తుంది. ముఖ్యంగా అజీర్తిని పోగొడుతుంది. భోజనం చేసిన తరువాత పైన చెప్పిన పద్ధతుల్లో ఏదైనా మజ్జిగని ఎంచుకుని, రోజూ తాగుతుంటే భుక్తాయాసం కలగదు. తీసుకున్న ఆహారం తేలికగా అరుగుతుంది. అన్నంలో విష దోషాలు పోతాయి. చర్మానికి మంచి కాంతి వస్తుంది. స్థూలకాయం తగ్గుతుంది. నరాలకు ఉత్తేజం కలుగుతుంది. షుగరు రోగులు ఈ మజ్జిగని తాగితే షుగరు త్వరగా అదుపులోకి వస్తుంది.

● గంగరాజు అరుణాదేవి



ఈ పరుగు... నాన్న కల కోసమే!

ఈ అమ్మాయి.. పదమూడేళ్ల వయసులో స్కూల్ రన్నింగ్ పోటీల్లో పాల్గొని ఓడిపోయింది. 'ఓడిపోయినా పర్వాలేదు.. మళ్లీ గెలవొచ్చు' అంటూ భుజం తట్టారు ఆ అమ్మాయి తండ్రి శ్రీనివాసరావు. ఓడిన ఆ అమ్మాయే.. ఆగష్టు తొమ్మిదో తేదీ పారిస్ ఒలింపిక్స్‌లో రన్నింగ్ చేయటానికి రెడీగా ఉంది. పేరు జ్యోతిక శ్రీ. ప్రస్తుతం పోలెండ్‌లో ఉన్న ఈ రన్నర్ తన పరుగుల ప్రయాణాన్ని 'నవ్య'తో పంచుకుందిలా...

"పోలెండ్‌లోని ఇండియా క్యాంప్‌లో ఉన్నా. ఐదు రోజులయ్యింది ఇక్కడికొచ్చి. ముఖ్యంగా యూరప్ వాతావరణానికి అలవాటు పడవచ్చు. విదేశీ కోచ్‌ల శిక్షణ ఉంటుంది. ఇక్కడినుంచి ఒలింపిక్స్ వేదిక పారిస్‌కి దగ్గర కూడా. ఇకపోతే పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకులో పుట్టిన నేను.. ఒలింపిక్స్ దాకా వచ్చానంటే.. నమ్మశక్యం కాదు. అయితే నాన్న ఎప్పుడో నమ్మారు. ప్రపంచ స్థాయికి వెళ్తానని నాన్న కల కన్నారు. అదే నిజమైంది.

నాన్న ప్రోత్సాహకానికి మాటల్లేవు...

పదమూడేళ్ల వయసులో మా స్కూల్‌లో పీఈటీ వంద మీటర్ల పరుగు పందేనికి నన్ను ఎంపిక చేశారు. నాకు చదువంటేనే ఆసక్తి. తప్పదు కాబట్టి పోటీల్లో పాల్గొన్నా. నాలుగో స్థానం వచ్చింది. పరుగులో ఓడిపోయా. 'గెలిచిన ముగ్గురుకీ ఆయాసం వచ్చింది. నాకేమీ రాలేదు నాన్న. నేను ఇంకా పరిగెత్తుతా' అన్నాను. అంతే.. 'ఇది ఓటమి కాదు. నువ్వు మరింత వేగంగా పరిగెత్తగలవు. వెయ్యి మీటర్లు కూడా పరిగెత్తే సత్తా నీది' అన్నారు నాన్న. సీతారామయ్య సర్ దగ్గరకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించారు. నాన్న పెద్దగా చదువుకోలేదు. బీరువాలు తయారు చేసే వర్క్‌షాప్. ఈ ఆటలేందీ? అని కొందరు అన్నారు. అవేమీ పట్టించుకోలేదు. మంచి శిక్షణ ఇప్పించారు. జోనల్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ వచ్చింది. వైజాగ్‌లో జాతీయ స్థాయి పోటీ జరిగింది. అందులో తప్పుగా 400 మీటర్లు రాయకుండా.. వెయ్యి మీటర్ల పరుగు పందెం అని రాశారు. దీంతో పరిగెత్తా. కాంస్య పతకం గెలుచుకున్నా. ఆ తర్వాత 400 మీటర్లు పరుగుపందెం నేషనల్స్ స్థాయిలో కేరళలో జరిగింది. అక్కడ రజత పతకం సాధించాను. వీటివల్ల టర్కీలోని ప్రపంచగేమ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించా. ఇందుకోసం మా స్థానిక ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణగారు లక్ష రూపాయలు సాయం అందించారు. నాకు పదో తరగతిలో 9.7 శాతం గ్రేడింగ్ వచ్చింది. పదికి పది రాలేదని బాధపడ్డా. 'నీకు జాతీయస్థాయిలో రెండు పతకాలు వచ్చాయి. రాష్ట్రస్థాయి చదువుల్లో మూడు శాతం తగ్గినా.. ఇబ్బంది లేదు. నీకు ఇంకా మంచి భవిష్యత్ ఉంది' అంటూ నాన్న ప్రోత్సహించారు.

ప్రతి గెలుపులో నాన్న ఉన్నారు...

మా అమ్మ పేరు లక్ష్మి నాగ వెంకటేశ్వరి. నాకో అక్క ఉంది. తన పేరు కీర్తి సత్యశ్రీ. మా నాన్నగారు బాడీబిల్డింగ్‌లో రాష్ట్రస్థాయిలోనూ పాల్గొన్నారు. అయితే ఆర్థిక పరిస్థితి వల్ల తన కలను వదిలేశానని చెప్పేవారు. ఆటల్లోనే నువ్వు పేరు తెచ్చుకోవాలమ్మా అనేవారు. నాన్న మాటే.. నాకు వేదం. నా ప్రతి గెలుపులో నాన్న ఉన్నారు. పదోతరగతి తర్వాత ఇంటర్ చదవడానికి విజయవాడకు వెళ్లా. ఖర్చులు ఎక్కువయ్యాయి. అయినా శిక్షణ ఇప్పించారు. కోచ్ వినాయక్ ప్రసాద్ శిక్షణలో రాటుదేలాను. అండర్ 18 విభాగంలో జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ కొట్టాను. గోల్డ్ మెడల్ సాధించా. నాన్న ఆనందానికి అవధుల్లేవు. హైదరాబాద్‌లోని ప్రముఖ కోచ్ నాగపురి దగ్గర చేరి మెళకువలు తెలుసుకున్నా.

> 
>
> నేను బాడీబిల్డర్‌ను. జిల్లా స్థాయిలో సత్తా చాటాను. అబ్బాయి పుడితే మిస్టర్ ఇండియా చేయాలనుకున్నా. నాకు ఇద్దరు అమ్మాయిలు. జ్యోతిక శ్రీ.. మా చిన్నమ్మాయి. ఏదైనా సాధించాలనే మొండిఘటం. కష్టపడుతుంది. సాధన చేస్తుంది. గత రెండేళ్లనుంచీ ఇండియన్ కోచ్‌లు, విదేశీ కోచ్‌ల నిర్వహణలో రోజుకు ఆరుగంటలు శిక్షణ తీసుకుంది. ఇల్లు అమ్ముకున్నా.. రేకుల షెడ్డులో ఉంటున్నా... నాకెలాంటి బాధలేదు. సంతృప్తిగా ఉంది. మా అమ్మాయి నేను ఊహించిన దానికంటే మెరుగైన విజయాలు అందుకుంది. యూరప్‌కు బయలుదేరేముందు 'పతకంతో వస్తాను నాన్న' అన్నది. ఫలితాలు ఎలా ఉంటాయో మనకు తెలీదు. అయితే నా బిడ్డ ఒలింపిక్స్ దాకా వెళ్లింది. తండ్రిగా గర్వపడుతున్నా! ఇంతకంటే నాకేం కావాలి?
>
> - దండి శ్రీనివాసరావు



మాకోసం జీవితం అంకితం...

ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ వరల్డ్ రిలేలో సత్తా చాటాను. అప్పుడే మోకాలి నొప్పి వల్ల ఇబ్బంది పడ్డాను. అందుకే ఆసియన్ గేమ్స్ ఆడలేకపోయా. గాయం మానిన తర్వాత ఫిట్‌నెస్ సాధించా. ఒలింపిక్స్‌కు అర్హత సాధించటం చాలామంది క్రీడాకారులకు జీవితకాలం కల. నాన్న గురించి ఇంకో విషయం చెప్పాలి. గతేడాది మా ఇంటిని అమ్మారు. అక్క పెళ్లి చేశారు. నాకోసం తెచ్చిన అప్పులను కట్టారు. మేం రేకుల షెడ్డులో ఉంటున్నాం... అదికూడా మా వర్క్‌షాప్‌లో. ఇప్పుడు చెప్పండి? మా నాన్న మిగతా వారికంటే ప్రత్యేకమే కదా! మాకోసం జీవితాన్ని అంకితం చేశారు. 400 మీటర్లు రిలే పరుగు పందెంలో ఒలింపిక్ పతకాన్ని గెలవాలన్నది మా నాన్న కల. అదే నా కల".


● పి.సి.హెచ్. కృష్ణమూర్తి, తణుకు

నారింజ పండ్లు తింటూ రుచిని ఆస్వాదిస్తారు. కానీ ఆ తొక్కతో ఏముందిలే అని పరి పారేస్తారు. మీకో విషయం తెలుసా.. నారింత తొక్కను ఎండబెట్టి పొడి చేసుకుంటే.. హాయిగా ఫేస్‌మాస్క్‌గానూ ఉపయోగించుకోవచ్చు. ఎ-విటమిన్, సి-విటమిన్ ఉండే నారింజ తొక్కల పొడితో నాజూగ్గానూ తయారు కావొచ్చిలా...

నారింజ తొక్కతో నాజూకు!

నారింజ పండ్లు తింటూ రుచిని ఆస్వాదిస్తారు. కానీ ఆ తొక్కతో ఏముందిలే అని పరి పారేస్తారు. మీకో విషయం తెలుసా.. నారింత తొక్కను ఎండబెట్టి పొడి చేసుకుంటే.. హాయిగా ఫేస్‌మాస్క్‌గానూ ఉపయోగించుకోవచ్చు. ఎ-విటమిన్, సి-విటమిన్ ఉండే నారింజ తొక్కల పొడితో నాజూగ్గానూ తయారు కావొచ్చిలా..

- బౌల్‌లో టేబుల్ స్పూన్ నారింజ తొక్కల పొడితో పాటు టేబుల్ స్పూన్ పెరుగు వేసి చూర్ణం చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం కాంతివంతంగా తయారవుతుంది.
- టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పొడిలోకి టీస్పూన్ తేనె, కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి ముఖానికి పట్టించుకోవాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- నారింజ తొక్క పొడిలోకి అంతే పరిమాణంలో సున్నిపిండి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టిస్తే మృతకణాలు తొలగిపోతాయి.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పొడిలో, టేబుల్ స్పూన్ కొబ్బరినూనె, టేబుల్ స్పూన్ పాలు కలిపి చూర్ణం చేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకుంటే మొటిమలు తగ్గిపోతాయి.



- ముందుగా ఆరెంజ్ పీల్ పౌడర్‌ను టేబుల్ స్పూన్ తీసుకోవాలి. ఇందులో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి చూర్ణం చేయాలి. అవసరమైతే పేస్ట్‌కు తగినట్లు నిమ్మరసం వేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే మచ్చలు మాయమవుతాయి.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ ఆరెంజ్ తొక్కల పొడిని తీసుకుని అందులో టీస్పూన్ చక్కెర, టీస్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి చూర్ణం చేసుకోవాలి. ఇది స్క్రబ్‌లా ఉపయోగపడుతుంది. చర్మం మీద స్క్రబ్‌లా అప్లయ్ చేసుకోవటం వల్ల మృతకణాలు తొలగిపోతాయి. ఫ్రెష్‌గా అనిపిస్తుంది.
- ఆరెంజ్ పీల్ పౌడర్‌ను నీళ్లతో కలిపి ముఖానికి పట్టించుకుంటే చాలు.. చర్మంలో నూనె శాతం తగ్గుతుంది. యువీ కిరణాల బారిన నుంచి రక్షించే గుణం ఈ పొడికి ఉంది. ఇందువల్ల వృద్ధాప్యఛాయలు త్వరగా దరిచేరవు. ●

మేకప్

సాఫ్ట్ లుక్ కోసం...

మేకప్ ఎంత సహజంగా ఉంటే అంత ఆకర్షణీయంగా కనిపిస్తాం! కాబట్టే కొత్త పెళ్లికూతురు, అంబానీ కోడలు, రాధిక మర్చంట్ సాఫ్ట్ మేకప్‌ను ఎంచుకుంది. అలాంటి న్యాచురల్ లుక్‌ను మరిపించే సాఫ్ట్ మేకప్ టిప్స్ ఇవే!

చర్మం ఇలా సిద్ధం

చర్మం తగినంత తేమగా ఉంటేనే సహజత్వం ఉట్టిపడుతుంది. కాబట్టి ఎస్‌పిఎఫ్ లేదా మాయిశ్చరైజర్ కలిగి ఉండే బ్రైటెనింగ్ సీరమ్ ఎంచుకోవాలి. లేదంటే పిగ్మెంట్ కలిసి ఉండే, అల్ట్రా లైట్ లోషన్, యాంటీఆక్సిడెంట్ విటమిన్ ఇ కలిసి ఉండే బిబి క్రీమ్‌ను కూడా అప్లై చేసుకోవచ్చు.

అండర్ ఐ కన్‌సీలర్

కళ్ల కింద నలుపును కవర్ చేయడం కోసం, ఇన్‌వర్టెడ్ ట్రయాంగిల్ ఆకారంలో కన్‌సీలర్‌ను అప్లై చేసి, మునివేలితో చర్మంలో కలిసిపోయేలా అద్దుకోవాలి. ఈ కన్‌సీలర్‌తో కళ్ల కింది వాపు, నలుపు చర్మంలో కలిసిపోయి, కళ్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తుంది.

మెరిసే బుగ్గల కోసం...

సాఫ్ట్ మేకప్‌తో ముఖం చదునుగా కనిపించకుండా ఉండడం కోసం చెక్కిళ్లకు గులాబీ రంగు బ్లష్ అద్దుకోవాలి. ఇందుకోసం రోజీ క్రీమ్ బ్లష్‌ను అప్లై చేసి బుగ్గల నుంచి కణతల వైపు బఫ్ చేసుకోవాలి. న్యాచురల్ లుక్ కోసం, బ్లష్ కోసం ముదురు రంగు గులాబీ రంగుకు బదులుగా వీలైనంత లేత గులాబీ రంగు బ్లష్‌ను ఎంచుకోవాలి.

గ్లాసీ హైలైట్

హైలైటర్ అనగానే షిమ్మర్ కలిసిన పౌడర్లు, క్రీమ్స్ గుర్తుకొస్తాయి. కానీ చర్మానికి షిమ్మర్ లుక్‌కు తెప్పించడానికి బదులుగా, గ్లాసీ హైలైట్‌ను ఎంచుకోవాలి. ఇందుకోసం చీక్‌బోన్స్, కనురెప్పలు, ముక్కుకు ఇరుపక్కల హైలైటర్‌ను అప్లై చేసుకోవాలి. ఒకవేళ గ్లాస్ లేకపోతే, దానికి బదులుగా నచ్చిన లిప్‌గ్లాస్‌ను కూడా అప్లై చేసుకోవచ్చు.

ఐలైనర్ ఇలా...

ముచ్చటగా తీర్చిదిద్దినట్టుండే ఐలైనర్ ఫ్యాషన్‌కు కాలం చెల్లింది. స్మడ్జ్ లుక్ లేటెస్ట్ ఫ్యాషన్. అందుకోసం కుదురుగా గీసుకోడానికి బదులుగా కనురెప్పల అంచుల్లో వీలైనంత మామూలుగా లైనర్ గీసుకుని, స్మడ్జ్ బ్రష్ లేదా దూది ఉండతో స్మడ్జ్ చేసుకోవాలి.



మస్కారా ముద్దుగా

కనురెప్పల కుదుళ్ల నుంచి అంచుల వరకూ మస్కారా అప్లై చేసుకోవాలి. మస్కారా అప్లై చేయడంలో ఈ చిన్న టెక్నిక్ పాటిస్తే, ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. కనురెప్పలు మరింత చిక్కగా కనిపించడం కోసం, రెండో కోట్ కూడా అప్లై చేసుకోవాలి.

లిప్‌స్టిక్ ఇలా...

లిప్ బ్రష్ ఉపయోగించి, లిప్‌స్టిక్ పెదవులు దాటకుండా కుదురుగా వేసుకోవచ్చు. గ్లిట్టర్, గ్లాస్ కలిగిన లిప్‌స్టిక్‌కు బదులుగా మ్యాట్ లిప్‌స్టిక్‌ను ఎంచుకుంటే న్యాచురల్ లుక్ సొంతమవుతుంది. బ్లాటింగ్ పేపర్‌తో అదనపు రంగును తొలగించుకుంటే పెదవులు సహజసిద్ధమైన గులాబీ రంగును సంతరించుకుంటాయి. ●

స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 20 జూలై 2024

రోయింగ్ ఒకే ఒక్కడు



పారిస్ క్రీడలకు భారత్ నుంచి తొలి కోటా అందుకున్న ఆటగాడు బల్‌రాజ్ పన్వర్. హరియాణాకు చెందిన 25 ఏళ్ల ఈ ఆర్మీ మ్యాన్.. ఈ ఒలింపిక్స్‌లో దేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక రోయింగ్ క్రీడాకారుడు. ఆసియా-ఓషియానియా ఒలింపిక్ క్వాలిఫికేషన్స్ ఈవెంట్‌లో మూడోస్థానంలో నిలిచిన పన్వర్ పురుషుల సింగిల్స్ స్కల్ ఈవెంట్‌లో పారిస్ బెర్త్ దక్కించుకున్నాడు. ఒలింపిక్స్ రోయింగ్‌లో భారత్ నుంచి గతంలో ఒక్కరు కూడా కనీసం సెమీస్ చేరలేకపోయారు. ఈసారి తాను సెమీస్ దాటగలనన్న ధీమాతో పన్వర్ సిద్ధమయ్యాడు.

ఈక్వెస్ట్రియన్ అనూష్



గుర్రంతో ఆటాడించే ఈక్వెస్ట్రియన్ క్రీడాంశంలో భారత్ నుంచి అర్హత సాధించింది ఒక్కడే. కోల్‌కతాకు చెందిన 24 ఏళ్ల అనూష్ అగర్వాల ఈక్వెస్ట్రియన్‌లో వ్యక్తిగత డ్రెసేజ్ ఈవెంట్‌లో పోటీపడుతున్నాడు. ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించి పారిస్ టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్న అనూష్ ఇక్కడ మెరుగైన ప్రదర్శన ఇవ్వగలనన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు.



పారిస్ ఒలింపిక్స్ 6 రోజుల్లో

పారిస్ ఒలింపిక్స్‌లో 32 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నా..అథ్లెటిక్స్‌కు ఉండే క్రేజే వేరు. గతంలో ఈ విభాగానికి సంబంధించి భారత్‌కు పెద్దగా చెప్పుకోవాల్సింది ఉండేది కాదు. కానీ టోక్యో విశ్వ క్రీడల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా చారిత్రక స్వర్ణ పతకం కొల్లగొట్టడంతో ప్రపంచ అథ్లెటిక్స్ దృష్టి ఒక్కసారిగా భారత్‌పై నిలిచింది. ఈ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో భారత్‌పై అంచనాలు పెరిగిపోయాయి. టోక్యో గేమ్స్ తర్వాత నీరజ్ చోప్రా మరింత అద్భుతంగా రాణిస్తుండడం, పురుషుల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో అవినాష్ సబ్లే మెరుపులు మెరిపిస్తుండడంతో పారిస్ క్రీడల ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకాల పరంగా భారత్ మెరుగవుతుందేమో చూడాలి. ఈసారి విశ్వ క్రీడల్లో అథ్లెటిక్స్ పోటీలు ఆగస్టు ఒకటిన ప్రారంభం కానున్నాయి. 29 మందితో కూడిన భారత అథ్లెటిక్స్ బృందం 16 అంశాల్లో అదృష్టాన్ని పరీక్షించుకొంటోంది.

నీరజ్‌కు ఎదురుందా?

'90'పై చోప్రా నజర్



సబ్లే

జావెలిన్ త్రో

పారిస్ క్రీడల్లో భారత్ కచ్చితంగా పసిడి పతకం గెలిచే ఈవెంట్ జావెలిన్ త్రో. టోక్యోలో టైటిల్ నెగ్గిన 26 ఏళ్ల నీరజ్ చోప్రా అనంతరం వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రజత, స్వర్ణ పతకాలతో తన సంచలన ప్రదర్శనను కొనసాగించాడు. '90' మీటర్ల లక్ష్యానికి గురి పెట్టిన నీరజ్.. పారిస్‌లో దానిని అందుకోవడంతోపాటు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోగలనన్న విశ్వాసంతో ఉన్నాడు. 28 ఏళ్ల కిషోర్ జెనా కూడా తలపడుతున్నాడు. మహిళల విభాగంలో అన్నూ రాణి బరిలో దిగుతోంది.

షాట్‌పుట్

భారత షాట్‌పుట్‌కు పర్యాయపదంగా నిలిచే తజిందర్ పాల్ సింగ్ తూర్ ఆసియా దిగ్గజంగానూ పేరు పొందాడు. అయితే తరచూ గాయాలతో ప్రపంచ స్థాయిలో అంతగా పేరు తెచ్చుకోలేకపోయాడు. ఫెడరేషన్ కప్‌లో 20.38 మీ. గుండు విసిరి సీజన్ అత్యుత్తమ ప్రదర్శన చేసిన తూర్.ప్రపంచ స్థాయిలో సత్తా చాటేందుకు 'పారిస్'ను మించిన వేదిక లేదు.

వీళ్లపైనా ఆశలు

వరల్డ్ ర్యాంకింగ్స్‌తో పారిస్ క్రీడలకు అర్హత సాధించిన ట్రిపుల్ జంపర్లు ప్రవీణ్ చిత్రవేల్ (17.12మీ), అబ్దుల్లా అబూబాకర్ (17మీ.) ఈ సీజన్‌లో 17 మీటర్ల మార్క్‌ను దాటారు. పారిస్‌లో ఈ ఇద్దరిలో ఎవరైనా ఫైనల్‌కు చేరితే వారి కెరీర్‌లో అది అత్యుత్తమ ప్రదర్శనే అవుతుంది. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుషారే, లాంగ్‌జంప్‌లో జస్విన్ ఆల్డ్రిన్, మహిళల 5వేల మీటర్ల పరుగులో పారుల్ చౌధురి, 400 మీ.లలో కిరణ్ పహల్, 100 మీ. హర్డిల్స్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ, 4×400మీ. పురుషులు, మహిళల రిలేలు, 20 కి.మీ. రేస్ వాక్‌లో ముగ్గురు పురుషులు, ఓ మహిళ, మిక్స్‌డ్ మారథాన్ రిలేలో ఇద్దరు భారత అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. 4×400మీ. రిలేలో తెలుగు అథ్లెట్ జ్యోతికశ్రీ దండి కూడా తలపడుతోంది.

3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్

ఈసారి విశ్వ క్రీడల్లో జావెలిన్ తర్వాత పురుషుల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్ ఆసక్తి రేపుతోంది. 29 ఏళ్ల అవినాశ్ సబ్లే ఈ విభాగంలో ఇటీవలే ఎనిమిది నిమిషాల 9.91 సెకన్ల టైమింగ్‌తో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. ఇది ఆసియాలో నాలుగో అత్యుత్తమ సమయం కావడం విశేషం. టోక్యో ఒలింపిక్స్ హీట్స్‌లో నయా జాతీయ రికార్డుతో సబ్లే అంచనాలను పెంచినా..ఫైనల్‌కు చేరడంలో మాత్రం విఫలమయ్యాడు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కెన్యాకు చెందిన హెగిమొనీ మీట్ రికార్డును బద్దలుగొట్టిన అవినాశ్ రజత పతకం సాధించాడు. దరివిలా పారిస్‌లో అతడిపై అంచనాలు పెరిగాయి. ఇక..మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో జాతీయ రికార్డు హోల్డర్ (9.15.31సె.) పారుల్ చౌదరి పారిస్‌లో తనదైన ముద్ర వేయాలంటే తన శక్తికి మించి ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.



జ్యోతి



జ్యోతికశ్రీ

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

స్విమ్మింగ్ 14 ఏళ్లకే..



పారిస్ ఒలింపిక్స్‌కు ఈసారి భారత్ నుంచి స్విమ్మింగ్‌లో ఇద్దరే బరిలో ఉన్నారు. ఒకరు శ్రీహరి నటరాజ్ కాగా, మరొకరు భారత జట్టులోనే అతిపిన్నవయసు అథ్లెటైన 14 ఏళ్ల దినిధి దేసింఘు. శ్రీహరి పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో, దినిధి 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో తలపడుతున్నారు. ఈసారి భారత స్విమ్మర్లు ఎవరూ ఒలింపిక్స్ అర్హతకు ప్రామాణికమైన టైమింగ్‌ను అందుకోలేకపోవడంతో.. యూనివర్సాలిటీ నిబంధనల ప్రకారం ప్రతి దేశం నుంచి ఇద్దరిని (పురుషుల్లో ఒకరు, మహిళల్లో ఒకరు) ఆడించే అవకాశం ఉండడంతో మెరుగైన ర్యాంకులున్న శ్రీహరి, దినిధి ఎంపికయ్యారు. అయితే, 23 ఏళ్ల శ్రీహరికి గత టోక్యో ఒలింపిక్స్‌లో ఆడిన అనుభవం ఉంది. పతకంపై పెద్దగా ఆశలు లేకున్నా, సెమీఫైనల్ చేరినా తన ప్రదర్శన మెరుగుపడినట్టేనని శ్రీహరి చెబుతున్నాడు. గత క్రీడల్లో శ్రీహరి 27వ స్థానంలో నిలిచాడు. ఇక, తొలిసారి అర్హత సాధించిన దినిధిపైనా అంచనాలు లేకున్నా.. ప్రతిభ చాటుతానని ధీమా వ్యక్తం చేస్తోంది. 9వ తరగతి చదువుతున్న దినిధి..2022 ఆసియా క్రీడల్లో పోటీపడింది. అలాగే.. ఈ ఏడాది దోహాలో జరిగిన ప్రపంచ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ పాల్గొంది. కాగా, శ్రీహరి, దినిధి ఇద్దరూ బెంగళూరుకు చెందినవారే. ఆర్తి సాహా (11 ఏళ్ల వయసులో 1952 ఒలింపిక్స్‌లో పాల్గొంది) తర్వాత విశ్వక్రీడల బరిలో దిగుతున్న అతిపిన్న వయసు భారత అథ్లెట్ దినిధినే.



భారత్ అదిరే బోణీ

పాక్‌పై ఘనవిజయం • మహిళల ఆసియాకప్



దీప్తి (3/20)

దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టైటిల్ వేటను ఘనంగా ఆరంభించింది. పాకిస్థాన్‌తో ఆసక్తికరంగా సాగుతుందనుకున్న మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షంగా మార్చేసింది. ముందుగా బౌలర్లు సమష్టిగా సత్తా చాటగా, ఓపెనర్లు స్మృతి మంధాన (45), షఫాలీ (40) మెరుపులు తోడవ్వడంతో.. శుక్రవారం గ్రూప్ 'ఏ'లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.2 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. ఆరంభంలో సిద్రా అమీన్ (25), చివర్లో ఫాతిమా (22 నాటౌట్), తౌబా హసన్ (22) మాత్రమే ప్రభావం చూపారు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్నర్ దీప్తికి మూడు.. పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, స్పిన్నర్ శ్రేయాంకలకు రెండేసి వికెట్లు దక్కాయి.

ఆడుతూ.. పాడుతూ

స్వల్ప ఛేదనను భారత్ 14.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 109 పరుగులతో సునాయాసంగా ముగించింది. ఓపెనర్లు షఫాలీ, స్మృతి మంధాన నువ్వా.. నేనా? అనే రీతిలో సాగించిన ఎదురుదాడికి పాక్ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. ఈ జోడీ బౌండరీల బాదుడుకు పవర్‌ప్లేలో జట్టు 57 పరుగులు సాధించింది. ఆరంభంలో షఫాలీ జోరు చూపినా.. ఆ తర్వాత మంధాన బ్యాట్ ఝుళిపిస్తూ ఎనిమిదో ఓవర్‌లో ఏకంగా ఐదు ఫోర్లతో 21 పరుగులు రాబట్టింది. అయితే ఈ ఇద్దరే ఛేదనను పూర్తి చేస్తారనిపించినా.. లెగ్ స్పిన్నర్ అరూబ్ షా తన వరుస ఓవర్లలో మంధాన, షఫాలీ వికెట్లను తీసింది. దీంతో తొలి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు హ్యాట్రిక్ ఫోర్లతో మురిపించిన హేమలత (14) 13వ ఓవర్‌లో వెనుదిరిగినా, అప్పటికి ఏడు పరుగులే అవసరం కావడంతో 35 బంతులుండగానే విజయం ఖాయమైంది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 19.2 ఓవర్లలో 108 ఆలౌట్. (సిద్రా అమీన్ 25, ఫాతిమా 22 నాటౌట్, తౌబా హసన్ 22; దీప్తి 3/20, రేణుకా 2/14, శ్రేయాంక 2/14, వస్త్రాకర్ 2/31).
భారత్: 14.1 ఓవర్లలో 109/3. (మంధాన 45, షఫాలీ 40; అరూబ్ షా 2/9).

హాడ్జ్ శతకం

విండీస్ తొలి ఇన్నింగ్స్ 351/5
ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ దీటుగా బదులిస్తోంది. కెరీర్‌లో నాలుగో టెస్టు ఆడుతున్న మిడిలార్డర్ బ్యాటర్ కవెమ్ హాడ్జ్ (120) శతకంతో అదరగొట్టగా.. అథనజె (82) అర్ధశతకంతో రాణించాడు. దీంతో శుక్రవారం రెండోరోజు ఆట ముగిసేసరికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 84 ఓవర్లలో 351/5 స్కోరు చేసింది. తొలి వికెట్‌కు బ్రాత్‌వైట్ (48), లూయిస్ (21) 53 రన్స్ జత చేశారు. అలాగే 84/3 స్కోరు వద్ద అథనజెకు హాడ్జ్ కలవడంతో ఇంగ్లండ్ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఈ ఇద్దరూ రెండో సెషన్‌లో వికెట్ కోల్పోకుండా ఆడి జట్టును పటిష్ఠ స్థితికి చేర్చారు. చివరకు 62వ ఓవర్‌లో అథనజెను స్టోక్స్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఇక సెంచరీ చేశాక హాడ్జ్‌ను వోక్స్ అవుట్ చేసినా.. ఆట చివర్లో కీపర్ జోషువా (32 బ్యాటింగ్), హోల్డర్ (23 బ్యాటింగ్) వికెట్‌ను కాపాడుకుంటూ రోజును ముగించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 416 రన్స్ చేసింది.

నేపాల్‌కు 'తొలి' విజయం

యూఏఈతో మ్యాచ్


దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్ చరిత్రలో నేపాల్ జట్టు తొలి విజయాన్ని అందుకుంది. శుక్రవారం యూఏఈతో జరిగిన గ్రూప్ 'ఏ' ఆరంభ మ్యాచ్‌లో ఈ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతో ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. 2012, 2016 టోర్నీల్లోనూ పాల్గొన్నప్పటికీ వీరికి ఒక్క గెలుపు కూడా దక్కలేదు. ఓపెనర్ సంఝానా ఖడ్కా (72 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో కీలకంగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 8 వికెట్లకు 115 పరుగులు చేసింది. ఖుషీ శర్మ (36), కవిష (22) మాత్రమే రాణించారు. పేసర్ ఇందు బర్మకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో నేపాల్ 16.1 ఓవర్లలో 4 వికెట్లకు 118 పరుగులు చేసి నెగ్గింది. కవిషకు మూడు వికెట్లు దక్కాయి.

బిజినెస్

తగ్గిన రిలయన్స్ లాభం

- క్యూ1లో 5 శాతం క్షీణతతో రూ.15,138 కోట్లకు పరిమితం
- డీలాపడిన ఓ2సీ వ్యాపారం
- ఆదాయం రూ.2.36 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభం మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ఆర్ఐఎల్ నికర లాభం రూ.15,138 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.22.37) పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.16,011 కోట్ల (ఒక్కో షేరుకు రూ.23.66) లాభంతో పోలిస్తే 5 శాతం తగ్గింది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఆర్జించిన రూ.18,951 కోట్ల లాభంతో పోలిస్తే ఏకంగా 20 శాతం క్షీణించింది. ముడిచమురు శుద్ధి వ్యాపార లాభాల మార్జిన్ తగ్గడం, ఇంధన విక్రయ మార్జిన్ల క్షీణతతోపాటు తరుగుదల వ్యయాలు, రుణ వ్యయాల పెరుగుదల కంపెనీ లాభాలకు గండికొట్టింది. టెలికాం, రిటైల్ వ్యాపారాల జోరు కొనసాగడం కంపెనీని ఆదుకుంది. కాగా, ఈ క్యూ1లో రిలయన్స్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం పెరిగి రూ.2.36 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రాబడి రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.2.64 లక్షల కోట్ల రెవెన్యూతో పోలిస్తే మాత్రం ఈ ఏప్రిల్-జూన్‌లో భారీగా తగ్గింది.



Reliance Industries Limited

ఆయిల్ అండ్ గ్యాస్

ఈ ఏప్రిల్-జూన్ కాలానికి ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి వ్యాపార ఆదాయం 33.4 శాతం వృద్ధి చెంది రూ.6,179 కోట్లకు పెరిగింది. స్థూల లాభం 29.8 శాతం పెరుగుదలతో రూ.5,210 కోట్లుగా నమోదైంది. కేజీ బేసిన్‌లోని డీ6 బ్లాక్ నుంచి రోజుకు సహజ వాయువు సగటు ఉత్పత్తి 28.7 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లకు చేరుకుంది.

{ గత త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభం వార్షిక ప్రాతిపదికన మెరుగుపడింది. ఓ2సీ వ్యాపార పరిస్థితులు బలహీనంగా ఉన్నప్పటికీ టెలికాం, రిటైల్‌తో పాటు ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి వ్యాపారాలు బలమైన పనితీరు కనబర్చడం ఇందుకు దోహదపడింది. కంపెనీ చురుకైన నిర్వహణ, ఆర్థిక పనితీరు విభిన్న వ్యాపారాల బలాన్ని నొక్కి చెబుతుంది. }

-ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ,ఆర్ఐఎల్

జియో ప్లాట్‌ఫామ్స్

రిలయన్స్ జియో సహా డిజిటల్ వ్యాపారాలన్నింటినీ ఏకతాటికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ నిర్వహణ ఆదాయం ఈ క్యూ1లో 13 శాతం పెరిగి రూ.29,449 కోట్లకు చేరుకుంది. నికర లాభం 12 శాతం వృద్ధితో రూ.5,698 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో రిలయన్స్ జియో కస్టమర్లు మరో 80 లక్షల మేర పెరిగి 48.97 కోట్లకు చేరుకున్నారు. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7గా నమోదైంది. జియో కస్టమర్ల సగటు డేటా వినియోగం నెలకు 30.3 జీబీ లేదా రోజుకు ఒక జీబీకి చేరుకుంది. అంతేకాదు, డేటా వినియోగపరంగా జియో ప్రపంచంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీగా అవతరించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ డేటా ట్రాఫిక్ 44.1 బిలియన్ జీబీలు, వాయిస్ కాలింగ్ ట్రాఫిక్ 1.42 లక్షల కోట్ల నిమిషాలుగా నమోదైంది.

రిలయన్స్ రిటైల్

గడిచిన త్రైమాసికంలో ఈ విభాగ స్థూల ఆదాయం 8.1 శాతం వార్షిక వృద్ధితో రూ.75,615 కోట్లకు చేరుకోగా.. నికర లాభం 4.63 శాతం పెరుగుదలతో రూ.2,549 కోట్లుగా నమోదైంది. గత మూడు నెలల్లో రిలయన్స్ రిటైల్ 331 కొత్త విక్రయ కేంద్రాలను ప్రారంభించింది. దాంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,918కి చేరుకుంది. కాగా, మూడు నెలల్లో తమ స్టోర్లను 29.6 కోట్ల మంది సందర్శించారని కంపెనీ తెలిపింది.

ఆయిల్ టు కెమికల్స్

గత క్వార్టర్‌లో ఓ2సీ విభాగ ఆదాయం 18 శాతం పెరిగి రూ.1.57 లక్షల కోట్లకు చేరుకున్నప్పటికీ, స్థూల లాభం మాత్రం 14 శాతం తగ్గి రూ.13,093 కోట్లకు పరిమితమైంది. ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే విభాగ మార్జిన్లు 30 శాతం క్షీణించడంతో పాటు కెమికల్ వ్యాపారాల మార్జిన్లు కూడా గణనీయంగా తగ్గడం ఇందుకు ప్రధాన కారణమైంది.

మీడియా

గత మూడు నెలల్లో కంపెనీ మీడియా వ్యాపారం రూ.221 నికర నష్టాన్ని చవిచూసింది. ఆదాయం కూడా 3.7 శాతం తగ్గి రూ.3,650 కోట్లకు పరిమితమైంది.

శరత్ సిటీ క్యాపిటల్ మాల్ ప్రమోటర్, పారిశ్రామికవేత్త శరత్ గోపాల్ కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ పారిశ్రామికవేత్త బొప్పన శరత్ గోపాల్ శుక్రవారం కన్నుమూశారు. శనివారం హైదరాబాద్, జూబ్లీహిల్స్ విస్పర్‌వ్యాలీలోని వైకుంఠ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విద్య, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో శరత్ గోపాల్ తనదైన ముద్ర వేశారు. హైదరాబాద్ కొత్తగూడలో ఆయన నిర్మించిన శరత్ సిటీ క్యాపిటల్ మాల్ దక్షిణ భారతదేశం లోనే అతిపెద్ద మాల్‌గా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా ఆయన స్థాపించిన మ్యాట్రిక్స్ లేబొరేటరీస్ బల్క్‌డ్రగ్స్ తయారీలో అగ్రగామిగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని పెంజెండాలో 1949లో జన్మించిన శరత్ గోపాల్.. వరంగల్ ఎన్ఐటీ నుంచి 1974లో మెటలర్జీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1978లో ప్రీమియర్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించారు. అనంతరం 1988లో మ్యాట్రిక్స్ లేబొరేటరీస్‌ను ప్రారంభించారు. 1991లో డైమ్స్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ కెమికల్ ప్రాసెస్ మెషినరీ తయారీలో కీలకంగా ఉంది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1995లో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఈఈపీసీ నుంచి ఉత్తమ పారిశ్రామికవేత్త పురస్కారాన్ని అందుకున్నారు. కాగా ప్రస్తుతం కొండాపూర్‌లో ఏ గ్రేడ్ ఐటీ బిల్డింగ్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అంతేకాకుండా ఇంజనీరింగ్ విద్యలో కీలకమైన విద్యాసంస్థగా ఉన్న వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీని శరత్ గోపాల్ స్థాపించారు.

జీఆర్‌టీ జువెలర్స్‌లో ఆషాఢ ఆశ్చర్యం ఆఫర్లు



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్.. వినియోగదారులకు ఆషాఢ ఆశ్చర్యం పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి. విలువైన రత్నాలకు సంబంధించి చేతితో తయారు చేసిన ఆభరణాలు వినియోగదారులకు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉంటాయని తెలిపింది. అంతేకాకుండా ఈ ఆషాఢ మాసంలో జీఆర్‌టీ జువెలర్స్‌కు చెందిన అత్యంత నమ్మకమైన 'కైరాసీ' ఆభరణాలు కొనుగోలు చేయకుండా వినియోగదారుల షాపింగ్ పూర్తి కాదని పేర్కొంది. అలాగే ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతిని అందించనున్నట్లు తెలిపింది. దీంతోపాటు ఈ ఆషాఢ మాసంలో పాత బంగారం మార్చుకునే కస్టమర్లకు ప్రతి గ్రాముకు అదనంగా రూ.50 అందుకుంటారని జీఆర్‌టీ జువెలర్స్ వెల్లడించింది.

గూగుల్ క్లౌడ్‌తో ఎల్4జీ జట్టు

హైదరాబాద్: విద్య, నైపుణ్యాభివృద్ధిలో కీలకంగా ఉన్న ఎల్4జీ (లెర్నింగ్ ఫర్ గ్రోత్) సొల్యూషన్స్.. గూగుల్ క్లౌడ్ ఇండియాతో కలిసి జెనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణను అందించనుంది. ఇందులో భాగంగా గూగుల్ క్లౌడ్ స్కిల్స్ బూస్ట్ (జీసీఎస్‌బీ) ప్లాట్‌ఫామ్ ద్వారా అవసరమైన కంటెంట్‌ను గూగుల్ క్లౌడ్ అందిస్తుంది. డెవలపర్ల కోసం జెనరేటివ్ ఏఐ, జెమినీ ఫర్ గూగుల్ క్లౌడ్‌లో లెర్నింగ్ పద్ధతులను ఆఫర్ చేయనుంది. అలాగే జీసీఎస్‌బీ ప్లాట్‌ఫామ్‌పై కెరీర్ లాంచ్‌పాడ్ కార్యక్రమం కింద లెర్నర్స్‌కు ఉచితంగా లెర్నింగ్ విధానాలను అందించనుంది. కోర్సు పూర్తయిన అనంతరం లెర్నర్స్‌కు కంప్లీషన్ బ్యాడ్జ్‌ను అందించనున్నట్లు ఎల్4జీ సొల్యూషన్స్ తెలిపింది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	116
కరీంనగర్	110	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	126
కర్నూలు	110	నెల్లూరు	126
విశాఖపట్నం	106	అనంతపురం	115
గోదావరి	115		

విప్రో లాభం రూ.3,003 కోట్లు

- ఆదాయం రూ.21,963 కోట్లు
- ఈసారి 12,000 నియామకాలు

బెంగళూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.6 శాతం వృద్ధితో రూ.3,003.2 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.2,870 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ1లో విప్రో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.8 శాతం తగ్గి రూ.21,963.8 కోట్లకు పరిమితమైంది. 2023-24లో ఇదే సమయానికి రాబడి రూ.22,831 కోట్లుగా నమోదైంది. క్యూ1లో ఐటీ సేవల ద్వారా కంపెనీకి 262.59 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగియనున్న రెండో త్రైమాసికం (క్యూ2)లో ఐటీ సేవల ద్వారా ఆదాయం 260-265.2 కోట్ల డాలర్ల శ్రేణిలో నమోదు కావచ్చని విప్రో అంచనా వేసింది. అంటే, త్రైమాసిక ప్రాతిపదికన (క్యూ1తో పోలిస్తే) ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ప్లస్ ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని కంపెనీ భావిస్తోంది. మరిన్ని వివరాలు..

- గడిచిన మూడు నెలల్లో 120 కోట్ల డాలర్ల విలువైన బడా కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు విప్రో వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే సమయంలో దక్కిన డీల్స్ విలువతో పోలిస్తే మాత్రం 3.6 శాతం తగ్గింది.
- క్యూ1లో విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 337 పెరుగుదలతో 2,34,391కి చేరుకుంది. దాంతో వరుసగా ఆరు త్రైమాసికాలుగా సిబ్బంది సంఖ్య తగ్గుదలకు అడ్డుకట్టపడింది. కాగా, క్యూ1లో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 14.1 శాతానికి తగ్గింది. అంతక్రితం త్రైమాసికంలో అట్రిషన్ రేటు 14.2 శాతంగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో ప్రాంగణ నియామకాల ద్వారా దాదాపు 3,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగాల్లో చేర్చుకున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ (సీహెచ్ఆర్ఓ) సౌరభ్ గోవిల్ తెలిపారు. ముందుందూ ప్రాంగణ నియామకాలతో పాటు ఆఫ్-క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సైతం జరపనున్నట్లు.. ఆర్థిక సంవత్సరం మొత్తానికి 10,000 నుంచి 12,000 నియమించుకోనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో నియామకాలు చేపట్టే అవకాశం ఉందని గోవిల్ సంకేతాలిచ్చారు.

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 739 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఔటేజ్‌లో అంతర్జాతీయ మార్కెట్లలో పోటెత్తిన అమ్మకాలకు తోడు ఇటీవలి లాభాలను సొమ్ము చేసుకోవాలన్న ఆకాంక్షతో ఇన్వెస్టర్లు తెగబడి అమ్మకాలు సాగించడం మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ కౌంటర్‌లో జరిగిన అమ్మకాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. అయితే ట్రేడింగ్ ప్రారంభంలో సూచీలు జీవిత కాల గరిష్ఠ స్థాయిలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 81,587.76 పాయింట్లు, నిఫ్టీ 24,854.80 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. కాని చివరికి సెన్సెక్స్ 738.81 పాయింట్ల నష్టంతో 80,604.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 844.36 పాయింట్లు దిగజారి 80,499.10 స్థాయిని తాకింది. ఇంట్రాడేలో 292.70 పాయింట్లు నష్టపోయి 24,508.15 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 269.95 పాయింట్ల నష్టంతో 24,530.90 వద్ద ముగిసింది.. వారం మొత్తం మీద సెన్సెక్స్ 85.31 పాయింట్లు, నిఫ్టీ 28.75 పాయింట్లు లాభపడ్డాయి.

రూ.7.94 కోట్ల సంపద ఫట్

మార్కెట్లో ఏర్పడిన భారీ పతనంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.7.94 కోట్లు దిగజారింది. మార్కెట్ ముగిసే సమయానికి రూ.4,46,38,826.75 కోట్ల వద్ద (5.34 లక్షల కోట్ల డాలర్లు) స్థిరపడింది.

పేటీఎంకు రూ.840 కోట్ల నష్టం

డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన క్వార్టర్‌లో రూ.840 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 33.48 శాతం తగ్గి రూ.1,639.1 కోట్లకు పరిమితమైంది.



టాటా మోటార్స్.. భారత్‌లో తొలి ఎస్‌యూవీ కూపే 'టాటా కర్వ్'ను ఆవిష్కరించింది. ఆగస్టు 7న ఈ కారును లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తొలుత ఎలక్ట్రిక్ వెర్షన్ (ఈవీ) కర్వ్‌ను ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ వెర్షన్స్ అందుబాటులోకి తీసుకురానుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,350 ▼	68,150 ▼	97,750 ▼
ముంబై	73,240 ▼	67,088 ▼	88,983 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 20వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	


అల్లూరి జిల్లా వరరామచంద్రపురం మండలం ఉమ్మడివరం వాగు ఉధృతికి కోతకు గురైన సైడ్ బర్మ్


కుక్కునూరు మండలంలో పెదవాగు వరద ధాటికి కోతకు గురైన కుక్కునూరు- దాచారం రోడ్డు


వేలేరుపాడు మండలం పూచిరాల గ్రామంలో ఒక చెట్టుకు చిక్కుకుని మృతి చెందిన జంటెద్దులు


వేలేరుపాడు మండలంలో ముంపు ప్రాంతాలను బైక్‌పై తిరుగుతూ పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి(బైక్‌పై వెనుక)

వాన.. వరద!

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం.. తూర్పు, పశ్చిమలో ఎర్ర కాలువ కన్నెర్ర.. నీట మునిగిన పలు గ్రామాలు.. గోదావరికి భారీగా పెరిగిన వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారటంతో రాష్ట్రంలోని ఉమ్మడి గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు సాధారణ జన జీవనంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఎర్రకాలువ కన్నెర్ర చేయడంతో పదుల సంఖ్యలో గ్రామాలు, వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. రాజమహేంద్రవరంలో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో 1922.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- పశ్చిమ గోదావరిలో భారీ వర్షాలకు ప్రధాన పట్టణాల్లో డ్రైయిన్లు పొంగిపొర్లాయి. ఎర్రకాలువ ఉప్పొంగి.. వరద బీభత్సం సృష్టించింది. తాడేపల్లిగూడెం రూరల్ మండలం మాధవరం, జగన్నాథపురం, నందమూరు, మారంపల్లి, అప్పారావుపేట, వీరంపాలెం గ్రామాల్లో వందలాది ఎకరాలు మునిగిపోయాయి.
- కోనసీమ జిల్లాలో వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. వరి పొలాలు, వరి నారుమడులు ముంపునకు గురయ్యాయి. కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా తొమ్మిది మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. వేల ఎకరాల్లోవరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. పి.గన్నవరం పరిధిలోని గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామస్తులు ఇంజన్ పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.
- అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో ఎడతెరపిలేని వర్షం కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతూరు, వీఆర్‌పురం మండలాల ప్రధాన రహదారిపై జల్లేరు గూడెంవాగు పొంగి ప్రవహిస్తోంది. ఉమ్మడివరం వద్ద వాగు ఉధృతికి వంతెన సైడ్ బర్మ్ కోతకు గురైంది. ఎటపాకలో పత్తి, వరి నారు నీట మునిగింది. కూనవరం మండలంలో శబరి, సీలేరు, గోదావరి నదుల సంగమం ఉధృతి దాల్చింది.
- ఏలూరు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో కొండ వాగులు, ఎర్రకాలువ, తమ్మిలేరు ఉధృతంగా పొంగుతున్నాయి. తమ్మిలేరు వరద కారణంగా ఏలూరులో ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రకటించారు. జిల్లాలోని 12 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పార్థసారథి విజ్ఞప్తిచేశారు. శుక్రవారం మధ్యాహ్నానికి కొగువారిగూడెం ఎర్ర కాలువ ప్రాజెక్టు నుంచి 12,713 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 26.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.
- అల్లూరి జిల్లాలో 5రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో గోదావరి ముంపు ప్రాంతాలున్న చింతూరు డివిజన్ పరిధిలోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర సహాయం కోసం 08935293120, 08935293448కు కాల్ చేయాలని సూచించారు.
- శ్రీకాకుళం జిల్లాలో వర్షాల కారణంగా చెరువులు, పంట పొలాల్లో నీరుచేరింది. అన్ని మండలాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పునరావాస కేంద్రాలు కూడా సిద్ధం చేయాలని సూచించారు.

స్కూళ్లకు సెలవు

- వర్షాల కారణంగా పశ్చిమ గోదావరి, కోనసీమ, విశాఖ జిల్లాల్లో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సెలవు ప్రకటించారు.
- శ్రీకాకుళం జిల్లా తాడివలస పంచాయతీ లచ్చయ్యపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

- ఎన్టీఆర్ జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలతో కట్టలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగుపై ఉన్న వంతెనలపై రాకపోకలను నిలిపేశారు. కృష్ణాజిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు డ్రెయిన్ మచిలీపట్నం, చల్లపల్లి, ఘంటసాల మండలాల పరిధిలోని గుండేరు, శివగంగ డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి.
- పార్వతీపురం మన్యం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వంశధార, నగావళి నదులకు వరద పోటెత్తుతోంది.
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో లోతట్టుప్రాంతాలు మునిగాయి.

రైతు కష్టం- అపార నష్టం!

- తూర్పుగోదావరి జిల్లాలో 7,500 ఎకరాల్లో వరి నీట మునిగినట్లు వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు తెలిపారు.
- పశ్చిమగోదావరిలో 15,485 ఎకరాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయి.
- కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, గుడ్లవల్లేరు, పెడన, తదితర మండలాల్లో వరినాట్లు వేసిన పొలాల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో రైతులకు అపార నష్టం ఏర్పడింది.

ఇద్దరు మృతి

- తూర్పుగోదావరి జిల్లాలోని ఎర్రకాలువ ఉధృతికి నిడదవోలు మండలం తీరుగూడెం గ్రామానికి చెందిన ఘంటసాల వెంకటేశు(56) కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు. మృతుడి కుటుంబాన్ని మంత్రి కందుల దుర్గేశ్, కలెక్టర్ పి.ప్రశాంతి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు.
- కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం కరవాక లోని గంగాపురం కాలనీకి చెందిన కొప్పనాతి రాంబాబు(38) అనే మత్స్యకారుడు మృతి చెందారు. వేటకు వెళ్లిన రాంబాబు.. చేపల కోసం విసిరిన వల గాలికి తిరిగి అతడి మీదే పడింది. దీంతో ఉప్పుటేరులో పడి ప్రాణాలు కోల్పోయారు.
- తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి- చీపురుపల్లి గ్రామాల మధ్య రోడ్డు మీదకు కొండ వాగు నీరు రావడంతో శివ అనే యువకుడు బైక్‌మీద దాటే యత్నంలో కొట్టుకుపోయాడు. స్థానికులు రక్షించారు.

వేలేరుపాడులో.. జలవిలయం!

- పెద్దవాగుకు గండితో పెనువిధ్వంసం
- కొట్టుకుపోయిన కుమ్మరిగూడెం
- వరద పోటెత్తడంతో వందలాది పశువులు మృతి
- 13 గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- ధ్వంసమైన అప్రోచ్‌రోడ్లు.. కలెక్టర్ పర్యటన

ఏలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం చివురుటాకులా వణికిపోయింది. మండల పరిధిలోని దాదాపు 13 గ్రామాలకు వెళ్లే మార్గాలన్నీ విచ్ఛిన్నమయ్యాయి. 100 కుటుంబాలు నివసించే కమ్మరిగూడెం పూర్తిగా కొట్టుకుపోయింది. ఇక్కడ 100 పూరిళ్లు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఈ జలవిలయం నుంచి రక్షించుకునేందుకు కమ్మరిగూడెం వాసులు సమీపాన ఉన్న గుట్టలపైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. పశువులు, కోళ్లు, పెంపుడు జంతువులు మొత్తం కొట్టుకుపోయాయి. పూరిళ్లు కుప్పకూలిపోయాయి. ఒంటిబండ, ఊటగుంపు, మేడేపల్లి, కోయ మాధవాపురం, రామవరం, అల్లూరినగర్, రెడ్డిగూడెం, వసంతవాడ తదితర గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. అప్రోచ్ రోడ్డులు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకు ఒరగటం, మరికొన్ని పక్కకు ఒరగటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వేలేరుపాడు-రుద్రంపాడు మధ్యలో కీలకమైన 22 కిలోమీటర్ల మార్గమంతా ధ్వంసమైంది. రామవరంలో గుత్తి కోయలుకు చెందిన 30కి పైగా గుడిసెలు నేలమట్టం అయ్యాయి. మేడేపల్లిలో ఇళ్లలోకి నీరు చొచ్చుకువచ్చింది. వేలేరుపాడు-కోయిదా మార్గం పూర్తిగా దెబ్బతినగా, ఎద్దు వాగు బ్రిడ్జి రెండువైపులా అప్రోచ్ రోడ్డు ధ్వంసమైంది. ఆయా గ్రామాలకు చెందిన పశువులు మేతకు వెళ్లిన సమయంలో వరద ఒక్కసారిగా పోటెత్తడంతో వందలాది పశువులు మృత్యువాత పడ్డాయి. వరద గ్రామాల్లో ప్రజలను పరామర్శించేందుకు శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్‌శివకుమార్, ఇతర అధికారులు వచ్చారు. కానీ రోడ్లు కొట్టుకుపోవడంతో కొన్ని గ్రామాలకే వెళ్లగలిగారు. ఎక్కడ వీలైతే అక్కడ గ్రామస్తులకు ఆహారం, తాగునీరు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. 48 గంటలుగా ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, పాల వ్యాన్‌లు రావడానికి అనువైన మార్గాలు లేకపోవడంతో వేలేరుపాడు మండల ప్రజలంతా విలవిల్లాడుతున్నారు. చాలాచోట్ల తాగునీటి కొరత ఏర్పడింది.

అన్నదాతకు వాయు'గండం'

- బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడిన అల్పపీడనం
- నేడు ఉత్తర, దక్షిణ కోస్తాలకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి వాయుగుండం ఏర్పడింది. మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం శుక్రవారం ఉదయానికి బలపడి వాయుగుండంగా మారింది. అది వాయవ్యంగా పయనించి ఉత్తర కోస్తా, ఒడిశాకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఇది శనివారం తెల్లవారుజామున పూరికి దక్షిణాన చిలికా సరస్సు వద్ద తీరం దాటి పశ్చిమ వాయవ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు వెళుతూ బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు కోస్తాలో విస్తారంగా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీగా, కొద్దిప్రాంతాల్లో కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. వాయుగుండం ప్రభావంతో కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ ఓడరేవుల్లో మూడో నంబరు సూచికను ఎగురవేశారు. మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం రేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అనకాపల్లిలో 70, పాణ్యంలో 51.5, గోపాలపట్నంలో 50.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 90 ప్రాంతాల్లో 20 మిల్లీమీటర్ల కన్నా అధికంగా వాన పడింది.

అన్నదాతలో ఆందోళన..

రాష్ట్రంలో వరిసాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో బంగాళాఖాతంలో వాయుగుండం పడడంతో రైతులు కలత చెందుతున్నారు. ముఖ్యంగా కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తుండటంతో పల్లపు ప్రాంత పొలాలు నీట మునుగుతాయని ఆందోళన చెందుతున్నారు. గత 50 రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. అయితే అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరి నారుమళ్లు ముంపుబారిన పడతాయని అన్నదాతలు భయపడుతున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా నీట మునిగిన వరి పొలాల్లో రైతులు తగిన యాజమాన్య పద్ధతుల్ని పాటించాలని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం గిరిజారాణి సూచించారు. 'నారుమళ్లలో ఎక్కువగా ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలి.

గోదారి.. ఇంతింతై!

గోదావరి వరద అంతకంతకూ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం బ్యారేజి నుంచి శుక్రవారం 175 గేట్లు ఎత్తి సుమారు 4 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలి పెట్టారు.


స్పిల్వే వద్ద గోదావరి జలాల విడుదల

ఉధృతంగా గోదావరి!

- పోలవరంలో అనూహ్యంగా పెరిగిన నీటిమట్టం
- 48 గేట్ల ద్వారా 3.30లక్షల క్యూసెక్కులు విడుదల
- మరో 5లక్షల క్యూసెక్కులు రావచ్చని అంచనా

పోలవరం, దేవీపట్నం, జూలై 19: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండగా, పోలవరం స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే 3,30,115 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 28.700 మీటర్లు, స్పిల్‌వే దిగువన 19.110 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాముకు ఎగువన 28.900 మీటర్లు, దిగువ కాపర్ డ్యాముకు దిగువన 18.600 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 26.30 అడుగులకు చేరుకుంది. గోదావరిలోకి ఎగువ ప్రాంతాల నుంచి అదనపు జలాలు వస్తుండడంతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 4 లక్షల క్యూసెక్కుల వరద జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి మరో ఐదు లక్షల క్యూసెక్కుల జలాలు రానున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఎగువ కాపర్ డ్యాం బ్యాక్ వాటర్ లెవెల్ పెరిగి కాపర్ డ్యాముకు సమీపంలో ఉన్న గండిపోశమ్మ ఆలయంలోకి వరద జలాలు ప్రవేశించాయి. దీంతో అధికారులు ఆలయానికి రాకపోకలు నిలిపివేశారు. ఇక, అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో ఎడతెరిపిలేని వర్షాలకు గత వారంరోజుల నుంచి గోదావరి వరద క్రమేపీ పెరిగి మండలంలోని ముంపు గ్రామాలతోపాటు గండిపోశమ్మ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. అమ్మవారి విగ్రహం మెడ భాగం వరకు వరదనీరు చుట్టుముట్టింది. వరద ఇలాగే కొనసాగితే శనివారం సాయంత్రానికి అమ్మవారి గోపురాన్ని సైతం తాకే అవకాశముంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం కుడి కాలువకు గోదావరి జలాల విడుదలను నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడం, కృష్ణా డెల్టాలో సమృద్ధిగా నీరు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

'పెద్ద వాగు'ను ముంచేశారు

ప్రాజెక్టుకు గండి పాపం జగన్‌దే.. 2021లోనే రూ.100కోట్లతో ప్రతిపాదనలు

- గోదావరి బోర్డు మాటా వినని నాటి సర్కారు
- నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసిన వైనం
- దానివల్లే వేలేరుపాడును ముంచిన వరద

ఏలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పెద్ద వాగుకు పడిన గండి ఎవరి పాపం? అధికారులు కొన్ని విషయాల్లో తడబడిన కారణంగానే ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం అతలాకుతలం కావాల్సి వచ్చిందా? గోదావరి బోర్డు చేసిన సూచనలను గత సీఎం జగన్ పట్టించుకోకపోవడమే ఈ ఆపదను తెచ్చిపెట్టిందా? ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయి రోడ్డు మార్గం విధ్వంసమై ముసలి, ముతక, పసిపిల్లల సైతం ప్రాణాలు కాపాడుకోవడానికి గుట్టలెక్కి చిమ్మ చీకటిలోనే బిక్కుబిక్కుమంటూ గడపాల్సి రావడానికి ముందుచూపు లేని జగన్ విధ్వంసకర పాలనే కారణమా? ఈ ప్రశ్నలకు వరద బాధిత వేలేరుపాడు మండలవాసుల్లో ఎవరిని అడిగినా అవుననే సమాధానం ఇస్తున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి వద్ద పెద్ద వాగు ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు భద్రతా నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగానే పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి, 15 గ్రామాల్లో విధ్వంసం సృష్టించింది. ప్రజలకు గూడు లేకుండా చేసింది. వందల ఇళ్లు దెబ్బతిన్నాయి.

గాలికొదిలేసిన జగన్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లనుంచి గోదావరిబోర్డు పరిధిలోకి వచ్చిన ఉమ్మడి ప్రాజెక్టుల్లో పెద్దవాగు ప్రాజెక్టు ఒకటి. 1980లో నిర్మించిన దీని నిల్వ సామర్థ్యం 0.5 టీఎంసీలు. సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాలు. ఏపీకి 13,640 ఎకరాలు, తెలంగాణకు 2,360 ఎకరాలకు సాగు నీరందిస్తోంది. ఇందులో వేలేరుపాడుకు కుడి కాలువ 2.37 కిలోమీటర్లు, కుక్కునూరుకు ఎడమ కాలువ 2.37 కిలోమీటర్లు. గోదావరి బోర్డు ప్రాజెక్టు నిర్వహణ, భద్రతకుగానూ అయ్యే వ్యయంలో 15:85 కోటా పద్ధతిలో ముందుకు సాగాలని ఇరురాష్ట్రాలకు సూచించింది. జగన్ సీఎంగా ఉండగా నిధులు కేటాయిస్తే కనీసం క్రస్ట్ గేట్లైనా పక్కాగా మెయింటినెన్స్‌లో ఉండేవి. గురువారం నాటికి ప్రాజెక్టు మూడు గేట్లలో ఒక గేటు మొరాయించడం.. కొద్దిసేపటి తరువాత ప్రాజెక్టు కట్టకు గండి పడడం జరిగి, విధ్వంసానికి దారితీసింది. ఫలితంగా గ్రామాలన్నీ బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కోయ మాధవరం, అల్లూరినగరం మధ్య గురువారం కారు వాగులో కొట్టుకుపోయింది. ఈ క్రమంలో ప్రవాహ ఉధృతిని నియంత్రించేందుకు పెద్ద వాగు క్రస్ట్ గేట్లను కొంత సేపు మూసి ఉంచే ప్రయత్నం చేశారు. ఆ తరువాత కొంత సేపటికి తిరిగి గేట్లను పైకెత్తే క్రమంలో మూడోగేటు మొరాయించిందని,ప్రాజెక్టు గండికి ప్రధాన కారణమిదేనని అంటున్నారు. దీనికితోడు ఎగువ ప్రాంతాల నుంచి 25వేల క్యూసెక్కులకుపైగా వరదనీరు అత్యధికంగా వచ్చిపడడం మరో కారణంగా భావిస్తున్నారు.

ఇది రెండోసారి..

పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడడం ఇది రెండోసారి. దాదాపు 35 ఏళ్ల క్రితం 1989లో మొదటిసారి గండి పడింది. అప్పట్లో ప్రాజెక్టుకు దిగువనే ఉన్న వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం గ్రామం సైతం వరద తాకిడికి కొట్టుకుపోయింది. అప్పట్లో దీనిప్రభావం ఈ గ్రామంతోపాటు అల్లూరినగర్ వరకు ఉంది. ఈసారి వరదలకు కూడా ఈ గ్రామమే పూర్తిగా దెబ్బతింది.


వర్షాలు, వరదల పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

డైనమిక్‌గా పనిచేయండి

- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడండి
- వరద ప్రాంతవాసులను అప్రమత్తం చేయండి
- అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విపత్తుల సమయంలో అధికారులు డైనమిక్‌గా వ్యవహరించి, ప్రజలను అప్రమత్తం చేయాలని, విపత్తు నిర్వహణ ప్రక్రియను క్రియాశీలకం చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, వరదల పరిస్థితులపై శుక్రవారం సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదల ప్రభావం ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాతావరణశాఖ ద్వారా వర్షాలు, వరదల ప్రభావాన్ని అంచనావేసి, ప్రజలను అప్రమత్తం చేయాలని వారికి చంద్రబాబు సూచించారు. "ముందస్తు ప్రణాళికతో పని చేయడంద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి. చెరువు కట్టలు, వాగుల్లో నీటి ప్రవాహంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. గత ప్రభుత్వంలో ఇష్టానుసారం ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల చేయడం వల్ల గోదావరి కట్టలు బలహీన పడ్డాయి. వాటిపై దృష్టి పెట్టాలి. అధికారులు పూర్తి అప్రమత్తతతో, డైనమిక్‌గా పనిచేయాలి. వర్షాలు, వరదలు వచ్చిన తర్వాత కాకుండా, వాతావరణశాఖ హెచ్చరికలు, పరిస్థితులను అంచనా వేసి, అప్రమత్తంగా వ్యవహరిస్తే, నష్టాలను నివారించగలుగుతాం. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 185 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికిగాను 244 మిల్లీమీటర్లు నమోదై, 31% అదనంగా వర్షం కురిసింది" అని చంద్రబాబు చెప్పారు.

నాకు ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి!

- పోలీసులకు మదన్ మోహన్ ఫిర్యాదు

తాడేపల్లి టౌన్/విజయవాడ, జూలై 19: వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ ప్రభుత్వ ప్లీడర్ పి.సుభాష్ రెడ్డితోపాటు తన భార్య కె.శాంతి (దేవదాయ శాఖ సహాయ కమిషనర్) నుంచి తనకు ప్రాణ హాని ఉందని మదన్‌మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే తన భార్యకు పుట్టిన మగ బిడ్డకు తండ్రి ఎవరో శాస్త్రీయంగా నిర్ధారించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై న్యాయ సలహా తీసుకుని కేసు నమోదు చేస్తామని తాడేపల్లి సీఐ కళ్యాణరాజు శుక్రవారం తెలిపారు. మరోవైపు.. మదన్ మోహన్ విజయవాడలో దళిత, గిరిజన బహుజన సంఘాల ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడారు. శాంతికి జన్మించిన మగ బిడ్డకు తండ్రి ఎవరో తేల్చాలని, విజయసాయిరెడ్డికి డీఎన్‌ఏ టెస్టు చేయించాలని డిమాండ్ చేశారు. తాను అమెరికా నుంచి వచ్చాకే... శాంతికి బిడ్డ పుట్టినట్లు తెలిసిందన్నారు. ఆ షాక్ నుంచి ఆరు నెలలు కోలుకోలేదన్నారు.

అసత్యాల శాంతి!

- 2022 వరకు మదన్‌తో కలిసి పూజలు, వ్రతాలు
- కానీ... 2016లోనే విడాకులని ప్రకటన
- 2020లో సుభాష్‌తో పెళ్లి జరిగిందట
- డీసీపై ఇసుక చల్లడంపైనా మాట మార్పు

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

వివాదాస్పదంగా మారిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి తన వైవాహిక జీవితంపై చెబుతున్న మాటలన్నీ అబద్ధాలేనా? గతంలో డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్‌పై చేసిన ఆరోపణలూ అసత్యాలేనా? తాజాగా బయటపడుతున్న ఆధారాలు, పొంతన లేకుండా చెప్పిన మాటలే ఈ సందేహాలకు కారణం. వైసీపీ ఎంపీ సాయిరెడ్డితో సంబంధంపై ఆమె భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలను ఖండించేందుకు గత వారం ఆమె విజయవాడలో ప్రెస్‌మీట్ పెట్టారు. 2016లోనే మదన్ మోహన్‌కు విడాకులు ఇచ్చేశానని చెప్పారు. దేవదాయ శాఖ ఏసీగా ఆమె తొలి పోస్టింగ్ విశాఖే! ఆమె 2020 ఏప్రిల్ 24న ఇక్కడ విధుల్లో చేరారు. 2022 జూలై ఒకటో తేదీ వరకు పనిచేశారు. అప్పుడు... దేవదాయ శాఖ సిబ్బంది అందరికీ మదన్‌మోహన్‌ను తన భర్తగా పరిచయం చేశారు. ఆయన తరచూ ఇక్కడికి వచ్చేవారు. ఇద్దరూ కలిసి ఏసీ కార్యాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కూడా చేశారు. 2021 ఆగస్టు 15న ఏసీ కార్యాలయంలో జెండా వందనానికి కూడా మదన్‌మోహన్ హాజరయ్యారు. వారిద్దరి పెళ్లి రోజు... 2021 నవంబరు 9న ఏసీ కార్యాలయంలో ఇద్దరి పేర్లు ఉన్న కేకును కూడా కట్ చేశారు. విల్లా కొనుగోలు కోసం మదన్‌మోహన్ సెప్టెంబరులో విశాఖపట్నం వచ్చినప్పుడు ఇద్దరూ కలిసి వన్‌టౌన్‌లోని కనక మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేయించుకున్నారు. ట్రస్టు బోర్డు సభ్యులంతా వారిద్దరితో ఫొటోలు దిగారు. ఫ్లాట్ కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి పొందేందుకు సంబంధించిన దరఖాస్తులో... మదన్‌నే తన భర్తగా చూపించారు. శాంతి విశాఖ నుంచి బదిలీ అయి వెళ్లిపోయేంత వరకు (2022 జూలై) ఆమె భర్త మదన్‌మోహన్‌గానే ఇక్కడ అందరికీ తెలుసు. అయినా సరే... 2016లోనే ఆయనతో విడాకులు తీసుకున్నానంటూ విజయవాడలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శాంతి తెలిపారు. 'ఇవిగో ఒప్పంద పత్రాలు' అంటూ కొన్ని కాగితాలు చూపించారు. అయితే... అవి ఫేక్ అని, 2024 జూన్‌లో వాటిపై తనతో బలవంతంగా సంతకం చేయించారని మదన్‌మోహన్ ఆరోపిస్తున్నారు.



2021లో కనక మహాలక్ష్మి ఆలయంలో భర్త మదన్ మోహన్‌తో కలిసి పూజలు, ఏసీ కార్యాలయంలో వివాహ వార్షికోత్సవ వేడుక

డీసీపైనా తప్పుడు ఆరోపణలేనా?

విశాఖలో శాంతి ఏసీగా పనిచేస్తున్నప్పుడు 2021 ఆగస్టు 6న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్‌పై ఇసుక చల్లారు. "2016లో నా భర్తకు విడాకులు ఇచ్చాక ఒంటరిగా నివసిస్తున్నా. ఏ అండా లేదని.. పుష్పవర్ధన్ నన్ను లైంగికంగా వేధించారు. అందుకే ఆయనపై ఇసుక చల్లాను" అని శాంతి ఇప్పుడు చెబుతున్నారు. కానీ ఆ ఘటన జరిగినప్పుడు ఆమె చెప్పింది వేరు. తాను శాఖాపరంగా చేసే పనుల్లో తప్పులను మీడియాకు లీకులు ఇచ్చి తనపై పత్రికల్లో వార్తలు రాయిస్తున్నారని, ఆ వేధింపులు తట్టుకోలేకే ఇసుక చల్లానని ఆమె అప్పట్లో మీడియాకు వివరించారు. ఆయన లైంగికంగా వేధించారని ఎక్కడా చెప్పలేదు. ఇప్పుడు మాట మార్చారు. ఇక.. సుభాష్ రెడ్డితో 2020లోనే తనకు వివాహమైందని శాంతి చెబుతున్నప్పటికీ... అందుకు ఎలాంటి ఆధారాలూ చూపడం లేదు. విశాఖ నుంచి బదిలీ అయ్యేదాకా, అంటే 2022 జూలై వరకు మదన్ మోహనే ఆమె భర్తగా అందరికీ తెలుసు.



శుక్రవారం అధికారులతో సమావేశమైన స్పీకర్, మండలి చైర్మన్

ఎల్లుండి నుంచి అసెంబ్లీ

- సమావేశాలు 5 రోజులు జరిగే అవకాశం
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయండి
- మండలి చైర్మన్ మోషేన్‌రాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు...పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశాలు ఐదు రోజులు ఉండే అవకాశం ఉందని తెలిపారు. తొలిసారి ఎన్నికై కొత్తగా 88మంది ఎమ్మెల్యేలు, తొమ్మిదిమంది ఎమ్మెల్సీలు హాజరవుతున్నార న్నారు. వారి గుర్తింపులో పొరపాట్లు రాకుండా చూడాలని మోషేన్‌రాజు సూచించారు. కాగా, సమావేశాల నిర్వహణపై శాఖల కార్యదర్శులతో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మోషేన్‌రాజు, అయ్యన్నపాత్రుడు సమావేశమయ్యారు. సభలో చర్చలు సక్రమంగా జరగాలంటే అధికారుల పాత్రే కీలకమని వారు స్పష్టం చేశారు. సభల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పయ్యావుల హామీ ఇచ్చారు.

అసెంబ్లీకి సందర్శకుల తాకిడి తగ్గించండి: స్పీకర్

ఈసారి అసెంబ్లీ సమావేశాలకు సందర్శకుల తాకిడి తగ్గించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. సోమవారం నుంచి ప్రారంభం అవుతున్న సభాసమావేశాల నిర్వహణపై శుక్రవారం తన చాంబర్లో ఆయన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. "అసెంబ్లీ భవనంలో పరిమితమైన స్థలం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమతోపాటు సందర్శకులను తీసుకురాకుండా ఉంటే మంచిది. సమావేశం ముగిసిన తర్వాత పొరుగునే ఉన్న సచివాలయంలో వారు సందర్శకులను కలవవచ్చు. మంత్రులను కలిపించవచ్చు" అని ఆయన సలహా ఇచ్చారు.

జగన్.. గుంట నక్కల కంటే హీనం: కొల్లు

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): గుంట నక్కల కంటే హీనంగా, రాబందుల కంటే రాక్షసంగా జగన్‌రెడ్డి తయారయ్యాడని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన రౌడీ హత్యను కూడా రాజకీయం చేయాలనుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. శవం ఎక్కడ దొరుకుతుందా, ఎప్పుడు రాజకీయం చేద్దామా.. అనే ఆలోచన తప్ప... ఏ రోజూ ప్రజా సమస్యల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఈమేరకు శుక్రవారం రాత్రి మంత్రి ఓ ప్రకటన చేస్తూ... 'ప్రజలు ఛీ కొట్టినా జగన్‌రెడ్డికి సిగ్గురాలేదు. జగన్‌రెడ్డి ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మరు. ఐదేళ్ల పల్నాడులో ఎంతటి భయానక పరిస్థితులు సృష్టించారో ప్రజలందరికీ తెలుసు. అందుకే వైసీపీని పల్నాడు ప్రాంత ప్రజలు ఛీత్కరించుకున్నారు. రాష్ట్రంలో వ్యవస్థల్ని చక్కబెట్టే ప్రయత్నంలో ఉన్న ప్రభుత్వంపై అభాండాలు వేయడం తప్ప జగన్‌రెడ్డికి మరో పని లేకుండా పోయింది. పాత కక్షలతో జరిగిన హత్యను రాజకీయం చేస్తూ, పల్నాడులో అల్లర్లు సృష్టించే ప్రయత్నంలో భాగంగానే వినుకొండకు వెళ్లాడు. ఐదేళ్లు ప్రజల్లోకి రాని వ్యక్తి శవం కనిపించగానే వాలిపోవడం జగన్‌రెడ్డి పైశాచికత్వానికి నిదర్శనం. ఇదే పల్నాడులో మా బీసీ బిడ్డ తోట చంద్రయ్యను వైసీపీ నేతలు నడిరోడ్డుపై పీక కోసి చంపారు. కంచర్ల జల్లయ్యను రాళ్లతో కొట్టి చంపేశారు. వందలాది మందిని హతమార్చారు. చివరికి ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, బొండా ఉమ, హైకోర్టు లాయర్ పారా కిశోర్‌పై హత్యాయత్నం చేసినప్పుడు స్పందించని జగన్‌రెడ్డి.. ఇప్పుడు రాజకీయం కోసం వినుకొండ వెళ్లడానికి సిగ్గుపడాలని మంత్రి కొల్లు ధ్వజమెత్తారు.

మరోసారి జగన్ శవ రాజకీయాలు: పల్లా



పల్నాడులో జగన్‌రెడ్డి రక్త చరిత్ర అంటూ టీవీలో చూపెడుతూ విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): జగన్ మరోసారి శవ రాజకీయాలకు తెరలేపారని, వ్యక్తిగత హత్యలను టీడీపీకి రుద్దుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. జగన్ రాజకీయ రాక్షసత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా మారారన్నారు. గిరిజన మహిళతో విజయసాయిరెడ్డి విషయాన్ని డైవర్ట్ చేయడానికే వినుకొండ ఘటనను రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. పరామర్శకు వెళ్లి రాష్ట్రపతి పాలన కోరడం, గవర్నర్ ప్రసంగం అడ్డుకుంటామనడం జగన్ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. రషీద్ హత్యకు జిలానీ కారణమని, వారి మధ్య సంవత్సరం నుంచే గొడవలున్న విషయం అక్కడివారందరికీ తెలుసునని చెప్పారు. ఏడాది కిందట అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వద్ద వాళ్ల పంచాయతీ జరిగిందని, తేలకపోవడంతోనే ఈ హత్య జరిగిందని స్పష్టం చేశారు. టీడీపీ ఎప్పుడూ ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జగన్ ఆయన ఉనికిని కాపాడుకోవడానికే శవ రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం తీసుకురానున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా శుక్రవారం రాష్ట్రం నలుమూలల నుంచి వినతులతో టీడీపీ జాతీయ కార్యాలయానికి వచ్చిన వారి నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు.

రాష్ట్రంలోనూ రైతు రుణ మాఫీ చేయండి: షర్మిల

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తరహాలో రాష్ట్రంలోనూ రైతు రుణమాఫీని అమలు చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం డిమాండ్ చేశారు. 'రాష్ట్రంలో రైతుల తలసరి అప్పు రూ.2,45,554. ఈ రుణ భారాన్ని రైతులు మోయలేకపోతున్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉందని చెబుతున్న కూటమి ప్రభుత్వం... కేంద్రం సాయంతో రాష్ట్రంలో వ్యవసాయ రుణమాఫీ చేయాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిఉంటే రుణమాఫీ చేసేవాళ్లం' అని షర్మిల అన్నారు.

చంద్రబాబు బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు హైకోర్టు మంజూరుచేసిన బెయిల్‌ను రద్దు చేయాలని నాటి జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం దీనిని విచారించాల్సి ఉంది. అయితే తమ బెంచ్ విచారణ జరపాల్సి కేసులను రెండు, మూడు వారాల తర్వాత విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.

పుంగనూరు ఘటన: ఎంపీ సహా 78 మందిపై కేసులు

పుంగనూరు, జూలై 19: చిత్తూరు జిల్లా పుంగనూరులో గురువారం జరిగిన ఘటనకు సంబంధించి మూడు ఫిర్యాదులపై కేసులు నమోదయ్యాయి. ఇద్దరు టీడీపీ నేతల ఫిర్యాదుతో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహా 71మంది వైసీపీ శ్రేణులపైన.. వైసీపీ నేతల ఫిర్యాదుతో 8మంది టీడీపీ వారిపైనా కేసులు నమోదయ్యాయని సీఐ జయరామయ్య శుక్రవారం తెలిపారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలంటూ భూపరిపాలనా ప్రధాన కమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలో సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం 656 మంది తహసీల్దార్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి నుంచి వారంతా ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రభుత్వ ఆదేశాలతో తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపించాలని సీసీఎల్ఏను ఆదేశిస్తూ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మెమో ఇచ్చారు.

పేదల జీవితాలు మార్చాలి

- ప్రతి సామాన్యుడికీ ఫలాలు అందాలి
- నీతి ఆయోగ్‌తో భేటీలో చంద్రబాబు

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో ఉన్న నిరుపేదల జీవితాలను మార్చేలా ప్రభుత్వ విజన్ ఉండాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో సీఎంతో నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. వికసిత్ భారత్-2047కు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లుగానే వికసిత ఆంధ్రప్రదేశ్-2047 కోసం ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. రాబోయే రోజుల్లో ఏపీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై చర్చించారు. చంద్రబాబు తన గత అనుభవాలు, నిర్ణయాలు, వాటి ఫలితాలు, భవిష్యత్ ఆలోచనలను పంచుకున్నారు. దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలతో ఏపీ పనిచేస్తుందన్నారు. 'వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం విజన్-2047 సిద్ధం చేసుకుని ప్రయాణం సాగించాలి. పేదరికం లేని సమాజం సాధించాలి. అమరావతి, విశాఖపట్నం ఏఐ హబ్‌లుగా రూపొందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్నాం. ప్రతి సామాన్యుడికీ ఫలాలు అందాలి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధానాలు ఉండాలి. రాయలసీమలో హార్టికల్చర్ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తే రైతులు లబ్ధి పొందుతారు. సంపద సృష్టికి దోహదపడే విధానాలకు విజన్ డాక్యుమెంట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి' అని చంద్రబాబు అన్నారు. వికసిత ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌పై భవిష్యత్‌లో మరిన్ని సమావేశాలు, సమాలోచనలు జరిపి విడుదల చేయనున్నారు. సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అమరావతికి వచ్చిన నీతి ఆయోగ్ సభ్యులను సత్కరించిన సీఎం చంద్రబాబు

నేడు టీడీపీ ఎంపీల సమావేశం

టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం ఇక్కడ జరగనుంది. చంద్రబాబు అధ్యక్షతన ఆయన నివాసంలో మధ్యాహ్నం 2.30గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పార్టీ ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చిస్తారు.

27న ఢిల్లీకి చంద్రబాబు

సీఎం చంద్రబాబు 27న ఢిల్లీ వెళ్లనున్నారు. ఆ రోజున నీతి ఆయోగ్ సంస్థ తన గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తోంది. దీనికి దేశంలోని ముఖ్యమంత్రులు అందరినీ ఆహ్వానిస్తోంది. దీనికి హాజరు కావాలని ఆయన నిర్ణయించారు.

జగన్ 'కారు' కథలు!

- వినుకొండ పర్యటనలో హైడ్రామా
- ఐదు నిమిషాల్లోనే 'సఫారీ' దిగిన జగన్
- కారు బ్రేక్‌డౌన్ అని వైసీపీ తప్పుడు ప్రచారం
- వినుకొండ దాకా అదే కాన్వాయ్‌లో సఫారీ
- ముందురోజే విజయనగరం నుంచి రాక
- ఫార్చూనర్ లేదా క్రూజర్ కావాలని 'తాడేపల్లి' డిమాండ్
- అలాంటివి లేవంటూ సఫారీ పంపిన పోలీసులు
- విపక్షనేతగా చంద్రబాబు వాడిందీ అదే
- అందుకే.. జగన్‌కు నచ్చలేదనే అనుమానం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మా నాయకుడికి కేటాయించిన కారు మాటికీ మాటికీ ఆగిపోతోంది' అంటూ వైసీపీ రచ్చ చేసింది. చివరికి... కారు బాగానే ఉందని, వైసీపీయే ఎప్పట్లాగా తప్పుడు కోతలతో యాగీ చేసిందని రుజువైంది. అసలేం జరిగిందంటే... వైసీపీ అధికారంలో ఉండగా అప్పటి వినుకొండ ఎమ్మెల్యే పెంచి పోషించిన 'గ్యాంగ్ వార్' కారణంగా రషీద్ అనే యువకుడు హత్యకు గురయ్యారు. దీనిని రాజకీయం చేసిన జగన్... రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు శుక్రవారం వినుకొండ పర్యటనకు బయలుదేరారు. జగన్ భద్రత రీత్యా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) బుల్లెట్ ప్రూఫ్ టాటా సఫారీ కారు ఏర్పాటు చేసింది. శుక్రవారం ఉదయం 10.05 గంటలకు తాడేపల్లి నుంచి ప్రయాణం మొదలుపెట్టిన జగన్ కేవలం ఐదు నిమిషాల్లోనే కిందికి దిగారు. వైసీపీ నాయకుడికి చెందిన ఫార్చూనర్‌లో కూర్చున్నారు. అంతే... వైసీపీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. "జగన్‌కు కేటాయించిన కారు అడుగడుగునా ఆగిపోతోంది. మాజీ సీఎంకు భద్రత కల్పించేది ఇలాగేనా? ఇది పోలీసుల వైఫల్యమే" అంటూ ప్రచారం మొదలుపెట్టింది. ఇక... జగన్ కూలి, నీలి మీడియా కూడా ఇదే పాట పాడాయి. నిజానికి... ప్రభుత్వం జగన్ పర్యటనకోసం కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ సఫారీ వాహనం ఎక్కడా ఆగలేదు. ఆయన కాన్వాయ్‌లోనే వినుకొండ దాకా రయ్యిమని దూసుకెళ్లింది.



కారు మొరాయిస్తోందంటూ మార్గమధ్యంలో దిగిపోయిన జగన్

ఎందుకింత యాగీ అంటే..

జగన్ పర్యటన కోసం కేటాయించిన సఫారీ (ఏపీ 39 పి0014) పూర్తి కండిషన్‌లో ఉంది. ఎన్నికల్లో విజయం సాధించే వరకూ ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు అందులోనే ప్రయాణించారు. చంద్రబాబును నంద్యాలలో అరెస్టు చేసినప్పుడు... అక్కడి నుంచి విజయవాడ మీదుగా రాజమండ్రి వరకు ఇందులోనే ప్రయాణించారు. 'చంద్రబాబు వాడిన కారు నేను ఎక్కడమేమిటి' అనుకున్నారో ఏమో! ఎక్కిన ఐదు నిమిషాల్లోనే జగన్ అందులో నుంచి దిగిపోయారు. రచ్చ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీయగా మరిన్ని ఆసక్తికరమైన అంశాలు బయటపడ్డాయి. జగన్ పర్యటన కోసం టయోటా ఫార్చూనర్ లేదా ల్యాండ్ క్రూజర్ ప్రడో పంపాలని తాడేపల్లి నుంచి ఐఎస్‌డబ్ల్యూకు ఫోన్ వెళ్లింది. అయితే... ఆ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో బుల్లెట్ ప్రూఫ్ సఫారీని కేటాయించారు. అది కూడా విజయవాడలో సిద్ధంగా లేకపోవడంతో విజయనగరం నుంచి తెప్పించారు. గురువారం రాత్రి 11 గంటలకు అక్కడ బయలుదేరిన సఫారీ... ఉదయానికి తాడేపల్లి చేరుకుంది. పూర్తి కండిషన్‌లో... ఎక్కడా ఆగకుండా పరుగులు తీసింది. కానీ... జగన్ ఎక్కిన ఐదు నిమిషాల్లోనే అది బ్రేక్‌డౌన్ అయ్యిందంటూ వైసీపీ తప్పుడు ప్రచారం చేసింది. అదే వాహనం జగన్ కాన్వాయ్‌లో వినుకొండ వరకు ఎక్కడా ఆగకుండా దూసుకెళ్లిందంటూ ఐఎస్‌డబ్ల్యూ వీడియో ఆధారాలు కూడా చూపించింది. "మొన్నటిదాకా ముఖ్యమంత్రి హోదాలో ల్యాండ్ క్రూజర్ ప్రడో కారులో ప్రయాణించిన జగన్‌కు... బహుశా ఇప్పుడు 'సఫారీ' ప్రయాణం నచ్చలేదేమో! మాజీ అయిన తర్వాత కూడా అదే దర్పం ప్రదర్శించాలంటే ఎలా? సెక్యూరిటీ రివ్యూ కమిటీ-2024 నిబంధనల మేరకు మాజీ ముఖ్యమంత్రి అయిన జగన్‌కు భద్రత కల్పిస్తున్నాం. సీఎంగా ఉండగా ప్రధాని తరహాలో ఆయన ఏర్పాటు చేసుకున్న స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్(ఎస్ఎస్‌జీ)ను కొనసాగించేందుకు నిబంధనలు అంగీకరించవు" అని పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి.

కోర్టుకు, అసెంబ్లీకి.. ఎగ్గొట్టే ఎత్తుగడ!

- కోడికత్తి కేసులో ఎన్ఐఏ కోర్టుకు వెళ్లకుండా జగన్ వినుకొండ పర్యటన

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోడికత్తి దాడి కేసులో శుక్రవారం విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టులో హాజరు కావలసిన మాజీ సీఎం జగన్.. అది తప్పించుకోవడానికే వినుకొండ పర్యటన చేపట్టారని రాజకీయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. సోమవారం నుంచి మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు ప్రభుత్వం శ్వేతపత్రాలు ప్రవేశపెడితే తన అరాచకాలు బయటకు వస్తాయనే 24న ఢిల్లీలో ధర్నా చేపట్టబోతున్నారని ధ్వజమెత్తుతున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ తీరు పరిశీలిస్తే.. ప్రజల సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదు. బెంగళూరు ప్యాలెస్‌లో పది రోజులు ఉండివచ్చి.. నెల్లూరు సెంట్రల్ జైలుకు వెళ్లి.. హత్యాయత్నం కేసులో రిమాండ్‌లో ఉన్న తన పార్టీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాఖత్ అయ్యారు. ఆయన ఈవీఎం ధ్వంసం చేయడాన్ని నిస్సిగ్గుగా, బహిరంగంగా సమర్థించి విమర్శలపాలయ్యారు. తాజాగా వినుకొండలో వైసీపీ అధ్యక్షుడు ఖాన్ అనుచరుల ఆధిపత్య పోరులో రషీద్ అనే కార్యకర్త చనిపోతే.. దీనిని రాజకీయ హత్యగా చిత్రించేందుకు శుక్రవారం అక్కడకు వెళ్లారు. వాస్తవానికి శుక్రవారం ఆయన విశాఖ ఎన్ఐఏ కోర్టులో కోడికత్తి కేసుకు సంబంధించి వాయిదాకు హాజరవ్వాలి. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. ఖరీదైన లాయర్లను పెట్టుకుని.. కోర్టు వాయిదాలు ఎగ్గొట్టి ఐదేళ్లు కాలం గడిపేసిన ఆయన.. ఎన్ఐఏ కోర్టుకు వెళ్తే అసలు గుట్టు బయట పడుతుందనే భయంతో వినుకొండ పర్యటన ఎత్తుగడ వేశారని ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. తన డ్రామాను రక్తి కట్టించడానికి తన భద్రతను అలక్ష్యం చేశారని.. పాత కారు ఇచ్చారని.. అది కదలకుండా మొరాయిస్తోందంటూ అబద్ధపు ప్రచారం చేయించారు. ఇక అసెంబ్లీకి వెళ్తే టీడీపీ కూటమి ప్రభుత్వం రోజుకో శ్వేతపత్రం విడుదల చేసి.. గత ఐదేళ్లలో తన ప్రభుత్వ అక్రమాలు, అవినీతి, అరాచకాలు, అప్పులపై నిలదీస్తుందని జగన్ భయపడ్డారని.. అందుకే 24న ఢిల్లీలో ధర్నా తలపెట్టారని అంటున్నారు. ఇందులో పాల్గొనాలని వైసీపీ ప్రజాప్రతినిధులకు తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలిచ్చింది.

రాష్ట్రపతి పాలన విధించాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా వినుకొండలో ఇటీవల హత్యకు గురైన వైసీపీ కార్యకర్త షేక్ రషీద్ కుటుంబాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆనక 'ఎక్స్'లోనూ స్పందించారు. రాష్ట్రంలో లా-అండ్-ఆర్డర్ లేదని, 45 రోజుల టీడీపీ పాలనలో 306 రాజకీయ హత్యలు, 300కి పైగా హత్యాయత్నాలు, 560 చోట్ల ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం, వెయ్యికి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని, అనేక చోట్ల టీడీపీ వేధింపులను భరించలేక ప్రజలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఈ సమయంలో విలేకరులు ప్రశ్నించబోగా.. 'ఆగాగు... నువ్వు ఆంధ్రజ్యోతి విలేకరివైనంత మాత్రాన మాట్లాడేప్పుడు మధ్యలో ప్రశ్నించడం వల్ల ఫ్లో పోతుంది' అని ఆయన వారించారు. తర్వాత ఎక్కడి దాకా మాట్లాడానంటూ పక్కనే ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డిని అడిగి మళ్లీ ప్రారంభించారు. రాష్ట్రంలో లా-అండ్-ఆర్డర్ లేదనడానికి వినుకొండలో రషీద్ హత్యే నిదర్శనమన్నారు. టీడీపీకి చెందిన వ్యక్తి నడిరోడ్డుపై తమ కార్యకర్త రషీద్‌ను నరికి చంపడం అత్యంత దారుణమన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీగా శ్రీనివాసరావు వచ్చిన రెండ్రోజుల్లోనే ఈ హత్య జరగడం పథకంలో భాగమేనని ఆరోపించారు. గతంలో జిల్లా ఎస్పీగా ఉన్న రవిశంకర్‌రెడ్డిని ఎన్నికల ముందు అన్యాయంగా తప్పించి ఎస్పీగా బింధు మాధవ్‌ను తీసుకొచ్చారని.. ఎన్నికల కమిషన్ ఆయన్ను సస్పెండ్ చేసి ఎస్పీగా మల్లికను నియమించిందని అన్నారు. టీడీపీ నాయకుల మాట వినడం లేదని, ఆమెను బదిలీపై పంపి టీడీపీకి అనుకూలమైన శ్రీనివాసరావును తీసుకొచ్చిన రెండ్రోజులలోనే రషీద్ హత్య జరిగిందని చెప్పారు. రషీద్‌ను పథకం ప్రకారం హత్య చేసి జిలానీ ఒక్కడిపైనే కేసుపెట్టి వదిలేయడం సరికాదని, హత్యకు సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన చంద్రబాబు పథకాలు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, చదువుకునే ప్రతి పిల్లాడికి రూ.15 వేలు ఇస్తానని మోసం చేశారన్నారు. ఢిల్లీలో 24న శాంతియుతంగా ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

పరామర్శా.. ప్రచార యాత్రా?

జగన్ వినుకొండ పర్యటన రషీద్ కుటుంబానికి పరామర్శలా కాకుండా.. ప్రచార యాత్రలా సాగడం విమర్శలకు దారితీసింది. హతుడి కుటుంబాన్ని ఓదార్చి సహాయం అందించాల్సిన మాజీ సీఎం.. రషీద్ హత్య వ్యక్తిగత కక్షలతో జరగలేదని, రాజకీయ హత్యేనంటే రాజకీయ రంగు పులిమారు. ఇక తాడేపల్లి నుంచి బయల్దేరిన ఆయనకు స్వాగతం పలికేందుకు చిలకలూరిపేట, నరసరావుపేట మండలం ఉప్పలపాడు వద్ద ముందుగానే ఏర్పాట్లు చేశారు. దీంతో మధ్యాహ్నం 12.30 గంటలకు రషీద్ ఇంటికి రావలసిన జగన్.. సాయంత్రం 5.24 గంటలకు చేరుకున్నారు. వినుకొండ నియోజకవర్గంలోకి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రవేశించిన ఆయన కాన్వాయ్.. 13 కిమీ దూరంలోని పట్టణంలోకి రావడానికి 3గంటలు పట్టింది.

రషీద్ కుటుంబానికి న్యాయం చేస్తాం

రషీద్ తల్లిదండ్రుల వద్ద కూర్చుని జగన్ మాట్లాడుతూ.. ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. కోర్టులో న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి న్యాయవాదిని ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయకపోతే.. ఢిల్లీలో పెద్దల సాయంతో పోరాడి తాను న్యాయం చేస్తానన్నారు. రషీద్ పార్టీ కోసమే బతికాడని, రాజకీయ కక్షతోనే టీడీపీకి చెందిన జిలానీ తమ కుమారుడిని చంపారని తల్లిదండ్రులు విలపించారు. గొడవలతో సంబంధం లేని రషీద్‌ను చంపడం దారుణమని జగన్ అన్నారు. రషీద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి వెళ్లిపోయారు.

రాష్ట్రంలో శాంతి భద్రతల్లేవు

- ప్రధాని మోదీకి జగన్ లేఖ

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే.. తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. వైసీపీ శ్రేణులను హింసిస్తున్నారని, వారిపై దాడులు చేస్తున్నారని.. వారి ఆస్తులతోపాటు ప్రభుత్వ ఆస్తులనూ ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఏజెన్సీలతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. వీటిని వివరించేందుకు ప్రధాని సమయం కోరారు.

'పుంగనూరు'లో పెద్దిరెడ్డి సేవలో..

(మొదటి పేజీ తరువాయి)

మార్చారు. ఈ మొత్తం ప్రక్రియ అడ్డగోలుగా జరిగిందని ప్రభుత్వం తాజాగా గుర్తించింది. ఈ కేసులో అసలేం జరిగిందో కనిపెట్టే పనిలో నిమగ్నమైంది. ఈ సందర్భంగా అనేక అంశాలు వెలుగు చూస్తున్నాయి. అందులో నాటి చిత్తూరు జిల్లా కలెక్టర్ వైఫల్యమే స్పష్టంగా కనిపిస్తోంది. అసలు ఎలాంటి సెటిల్‌మెంట్ ఉత్తర్వు లేకుండానే భూమిని పరాధీనం చేశారని నిర్ధారణ అవుతోంది. నాటి ప్రభుత్వ పెద్దలతో అధికారులు కుమ్మక్కయ్యారని సంచలన అంశాలు బయటకొస్తున్నాయి. రాగానిపల్లె భూమి విషయంలో ఎస్టేట్ రద్దు చట్టం-1948 ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, కొత్తగా విచారణ చేపట్టాలని, పుంగనూరు తహసిల్దార్‌కు కూడా నోటీసులు ఇచ్చి అభిప్రాయం తీసుకోవాలని 2022 ఏప్రిల్ 28న సెటిల్‌మెంట్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. చిత్తూరు ఎస్టేట్ కేసుల సెటిల్‌మెంట్ అధికారిగా ఉన్న జాయింట్ కలెక్టర్ ఈ ఆదేశాలను ఆచరించాలి. ఆరు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలి. అయితే అప్పుడు జేసీ దీనిపై స్పందించలేదు. అదే ఏడాది నవంబరులో సుమోటోగా విచారణ చేపట్టారు. ఆ భూమిపై హక్కులు కోరుతున్నవారు తమ వద్ద ఉన్న రఫ్ పట్టాను సెటిల్‌మెంట్ అధికారి ముందు ఉంచారు. 2022 నవంబరు 18, డిసెంబరు 2, 24, 2023 జనవరి 12 తేదీల్లో విచారణ పూర్తి చేసి మార్చి 25న రఫ్ పట్టాను ప్రామాణికంగా తీసుకోవాలని జేసీ ఉత్తర్వులు ఇచ్చారు. 74 ఏళ్లుగా వివాదంలో ఉన్న కేసును జేసీ చాలా సింపుల్‌గా నాలుగే నాలుగు సిట్టింగ్‌ల్లో తేల్చారు. నాటి జమిందారుకు సెటిల్‌మెంట్ అధికారి ఇచ్చిన రఫ్ పట్టా సరైనదే అని, దాన్ని ఈ భూమి విషయంలో ప్రామాణికంగా తీసుకుంటున్నట్లుగా 2023 మార్చి 25న ఉత్తర్వులు ఇచ్చారు. రఫ్ పట్టా సరైనదే అని తేల్చిన 9 రోజుల తర్వాత జేసీని మార్చారు. మరో జేసీని తీసుకొచ్చారు.

విచారణ ఏదీ?

రఫ్ పట్టా సరైనదేనని జేసీ ఉత్తర్వు ఇవ్వగానే సరిపోదు. ఆ తర్వాత ఆ భూమిపై హక్కులు కోరుతున్న వారు రఫ్ పట్టా ఆధారంగా తమకు 982 ఎకరాల భూమిపై రైత్వారీ పట్టాలు జారీ చేయాలని అదే సెటిల్‌మెంట్ అధికారి (జేసీ) కోర్టులో అప్పీల్ చేయాలి. ఇందులో ప్రభుత్వం తరఫున పుంగనూరు తహసీల్దార్, ఇతర అధికారులు పార్టీలుగా ఉంటారు. భూమిపై హక్కులు కోరుతున్నవారితో పాటు పుంగనూరు తహసీల్దార్‌కు కూడా నోటీసులు ఇచ్చి జేసీ సెటిల్‌మెంట్ కోర్టులో విచారణ చేయాలి. ఆ తర్వాత రైత్వారీ పట్టాలు జారీ చేస్తున్నట్లుగానో, లేదా పట్టా ఇవ్వడం లేదనో జేసీ స్పష్టమైన ఉత్తర్వు ఇవ్వాలి. కానీ ఈ కేసులో రైత్వారీ పట్టాలు కోరుతూ సెటిల్‌మెంట్ కోర్టులో అప్పీల్ చేయలేదు. అలాగని సెటిల్‌మెంట్ పట్టా జారీ చేస్తూ ఉత్తర్వు ఇవ్వలేదు.

రికార్డులు ఎలా మార్చారు?

ఆ భూమిపై రైత్వారీ పట్టాలు జారీ చేస్తున్నట్లుగా సెటిల్‌మెంట్ కమిషనర్ ప్రత్యేకంగా ఎలాంటి ఉత్తర్వు ఇవ్వలేదు. ఆ భూమికి సంబంధించి రఫ్ పట్టాను పరిగణనలోకి తీసుకుంటామని మాత్రమే ఉత్తర్వులో పేర్కొన లేదు. దాని ఆధారంగా అప్పీల్ జరగలేదు. కేసు విచారణే ముందుకు రాలేదు. అలాంటప్పుడు ఆర్ఎస్ నంబర్ 22లోని 982 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చడానికి వీల్లేదు. కానీ అధికారులు మార్చారు. ఉత్తర్వు ఇచ్చిన మరుసటి రోజే అంటే .. గత ఏడాది మార్చి 26న 15-20 మంది సర్వేయర్లను పెట్టి ఆగమేఘాల మీద ఆ భూమిపై సర్వేతో పాటు సబ్ డివిజన్ చేయించారు. ఆ మరుసటి రోజే ఆ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట మారుస్తూ రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేశారు. ఆ భూమిని ఏ ఉత్తర్వు ఆధారంగా రికార్డులు మార్చారని చెప్పడానికి సమాధానం లేదు. నాటి చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఇచ్చిన ఆదేశాల మేరకే సర్వే, సబ్ డివిజన్ చేసి భూమి రికార్డులు మార్చేశారు.

కలెక్టర్ వైఫల్యం..?

భూముల విషయంలో జాయింట్ కలెక్టర్‌కు ఎన్ని అధికారాలున్నా, వాటిని కాపాడేందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక అధికారాలు ఉంటాయి. రాగానిపల్లెలోని 982 ఎకరాల భూమిపై రైత్వారీ పట్టాలు జారీ చేయడానికి ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అలాంటి ఉత్తర్వులేవీ లేకుండా కేవలం రఫ్ పట్టాను నిర్ధారిస్తూ ఇచ్చిన ఆదేశాన్ని పరిగణనలోకి తీసుకున్నారు నాటి చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్. ఆ తర్వాత ఆగమేఘాల మీద రికార్డుల మార్పిడి జరిగిపోయేలా ఆయన పెద్దలకు సహకరించినట్లుగా పలు ఆధారాలు నిరూపిస్తున్నాయి. ఒకవేళ కలెక్టర్ తప్పేమీ లేదనుకుంటే, సెటిల్‌మెంట్ అధికారి ఇచ్చిన ఆదేశాలపై 30 రోజుల్లోగా సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ కోర్టులో అప్పీల్ చేయాలి. కలెక్టర్‌కు ఆ అధికారం ఉంది. కానీ కలెక్టర్ ఆ పని చేయలేదు. అప్పీల్ చేయకుండా శరవేగంగా రికార్డుల మార్పిడికి ఆదేశాలు ఇచ్చారని స్పష్టమవుతోంది. ఒకవేళ రైత్వారీ పట్టాల జారీకి సెటిల్‌మెంట్ అధికారి ఉత్తర్వులే ఇచ్చి ఉంటే, 30 రోజుల్లోగా హైకోర్టు అంటే సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని అందులో ప్రస్తావిస్తారు. ఆ అవకాశాన్ని కూడా కలెక్టర్ వాడుకోవచ్చు. కానీ అది జరగలేదు. అసలు సెటిల్‌మెంట్ ఆర్డరే లేనప్పుడు ఇవన్నీ ఎలా జరుగుతాయన్నది మౌలిక ప్రశ్న. కేవలం రఫ్ పట్టాను నిర్ధారించిన వెంటనే శరవేగంగా సర్వేలు, సబ్ డివిజన్‌లు చేయించి భూమి రికార్డులు మార్చేశారు. నిజానికి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకే ఆ భూమి రికార్డుల్లో మార్పులు చేశారు. ఈ పరిణామంపై సీనియర్ ఐఏఎస్‌లే విస్తుపోతున్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటుకు కట్టబెట్టే క్రమంలో చట్టాలు, నియమ నిబంధనలను ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లంఘించినట్లుగా ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

రఫ్ పట్టా అంటే..

జమిందారీ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం 1948లో ఎస్టేట్‌ల రద్దుచట్టం తీసుకొచ్చింది. ఈ వ్యవస్థ అమల్లో ఉన్నప్పుడు జమిందారుల నుంచి భూములు పొందినవారు లేదా కొన్నవారికి రఫ్ (చిత్తు) పట్టాలు ఇచ్చారు. ఇలా రఫ్ పట్టాలు ఉన్నవారు సెటిల్‌మెంట్ చట్టం ప్రకారం సెటిల్‌మెంట్ అధికారి వద్ద రైత్వారీ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి, నిజమైనవే అని తేలితే రైత్వారీ పట్టాలు ఇస్తూ సెటిల్‌మెంట్ అధికారి ఉత్తర్వులు ఇస్తారు. అయితే, కాలక్రమంలో బోగస్ రఫ్ పట్టాలు పుట్టించి వాటి ఆధారంగా రైత్వారీ పట్టాలు కోరుతున్నారని ప్రభుత్వం గుర్తించి వాటిని సీరియస్‌గా తీసుకోవద్దని మార్గదర్శకాలు జారీ చేసింది.

ఎల్లుండి విచారణ

చిత్తూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా రాగానిపల్లెలో భూముల పరాధీనం వ్యవహారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలుగు చూసింది. ఈ భూములకు చెందిన అసలైన రైతులు కొందరు చిత్తూరు కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ రివిజన్ పిటిషన్ వేయాలని పుంగనూరు తహసీల్దారును ఆదేశించారు. తాజాగా తహసీల్దారు... సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థజైన్ కోర్టులో రివిజన్ పిటిషన్ వేశారు. సోమవారం విచారణకు రానుంది. ఇరువైపుల వాదనల తర్వాత కమిషనర్ ఈ భూముల విషయంలో నిర్ణయం తీసుకోనున్నారు. వివాదాస్పద భూములుగా తేల్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆ 982 ఎకరాల్ని రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు. కాగా 982 ఎకరాలకు చెందిన 29 మంది రైతుల్లో నలుగురు హైకోర్టును ఆశ్రయించడంతో వారి భూములపై స్టేటస్ కో విధించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గమ్మ సేవలో..



ఇంద్రకీలాద్రిపై పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న అధికారులు



పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ గవర్నర్ సతీమణి సమీరా నజీర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు

- వన్‌టౌన్

అమ్మా అని శరణు కోరితే

దుర్గమ్మ సాక్షాత్కారం

వన్‌టౌన్, జూలై 19: అమ్మా అని శరణు కోరితే కనకదుర్గమ్మ సాక్షాత్కరిస్తుందని భక్తుల బాధలను తీరుస్తుందని త్రిభాషా మహా సహస్రావధాని, ప్రణవ పీఠాధిపతి వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ కళాక్షేత్రంలో దుర్గమ్మ మహిమ పేరిట పద్మాకర్‌తో రెండు రోజుల ప్రవచనాలను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఏర్పాటు చేసింది. తొలి రోజు శుక్రవారం అమ్మవారి మహిమలను పద్మాకర్ వివరించారు. యజ్ఞాలు చేయడం వల్ల అమ్మవారు కరుణిస్తుందని తెలిపారు. ధర్మాచరణ ముఖ్యమని తెలిపారు దుర్గాదేవి ప్రకృతి స్వరూపిణి అని ఆమెను పూజించడమంటే ప్రకృతిని ఆరాధించడమేనని అన్నారు ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు శతాక్షి అమ్మవారు శాకంబరీ దేవిగా అవతరించి లోకంలో కరువు కాటకాలను పారదోలారని పద్మాకర్ పేర్కొన్నారు. అమ్మ అనే రెండు అక్షరాలే ఆమెను ఆరాధించేందుకు మంత్రమన్నారు. దేవస్థానం ఈవో రామారావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాయి దీక్షిత్ బృందం స్వాగత నృత్యం చేసి అలరించింది. కార్యక్రమాన్ని డాక్టర్ కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు.



దుర్గమ్మ మహిమ ప్రవచన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్

నగరంలో కేఆర్ఎంబీని ఏర్పాటు చేయించండి

ఎంపీ కేశినేని చిన్నికి సాగునీటి సంఘాల నాయకుల వినతి

విద్యాధరపురం, జూలై 19: 2018లో కేంద్ర జలశక్తిశాఖ, ఆనాటి టీడీపీ ప్రభుత్వం మధ్య జరిగిన నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని కృష్ణా రివర్ బోర్డు (కేఆర్ఎంబీ)ను విజయవాడలో ఏర్పాటు చేసేలా చూడాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్యచౌదరి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ తదితరులు కోరారు. గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందించారు. కేంద్ర జలశక్తిమంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు జరిగేలా చూస్తామని చిన్ని వారికి హామీ ఇచ్చారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య కార్యవర్గ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, గుండపనేని శ్రీనివాసరావు, జంగా చెంచురెడ్డి, నాదెళ్ల చెన్నకేశవరావు, బొర్రా అశోక్‌కుమార్, ఉప్పలపాటి చక్రపాణి, అంకాళ్ల ప్రభుదాస్ పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని చిన్నికి వినతిపత్రం అందజేస్తున్న సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య ప్రతినిధులు



సీపీ రాజశేఖర్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమెల్యే గద్దె రామ్మోహన్, పట్టాభిరామ్

సీపీకి శుభాకాంక్షలు

విద్యాధరపురం: ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబును శుక్రవారం ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేనిశివనాథ్(చిన్ని), తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీకి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు కేసన శంకరరావు, మహంతి వాసు తదితరులు

ఓబీసీ రిజర్వేషన్లకు అడ్డంకులు తొలగించండి

- కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి
- పురందేశ్వరిని కోరిన బీసీ సంక్షేమ సంఘం నేతలు

గవర్నర్‌పేట, జూలై 19: ఓబీసీ రిజర్వేషన్ల అమలులో ఉన్న అడ్డంకులు తొలగించడంతో పాటు క్రిమిలేయర్ నిబంధనలను తొలగించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తేవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సూర్యారావుపేటలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పురందేశ్వరిని కలిశారు. ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. జనగణనలో సమగ్ర కులగణనను చట్టబద్ధంగా నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తేవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, మహిళా రిజర్వేషన్ల చట్టంలో ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని కోరారు. ఓబీసీల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రధాని నరేంద్ర మోదీని కలిసేలా చూస్తానని వారికి పురందేశ్వరి హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు ఎంపీ పురందేశ్వరిని సత్కరించారు. బీసీ సంఘం నాయకుడు ఎంఏఎం ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు(వాసు), నేతలు కుమ్మర క్రాంతికుమార్, మేకా వెంకటేశ్వర్లు, వీరంకి గోకర్ణేశ్వరరావు, కొండగట్టు రాము, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

- కేశినేని చిన్నిని కోరిన సూపర్‌స్టార్ అభిమానులు

గవర్నర్‌పేట: సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని లెనిన్ పార్కులో ఏర్పాటు చేస్తున్న కృష్ణ కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి కోరారు. సుధాస్వామి ఆధ్వర్యంలో కృష్ణ అభిమానులు శనివారం గురునానక్‌కాలనీలోని ఎంపీ కార్యాలయంలో చిన్నిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. విగ్రహం ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకరిస్తానని, పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీ సూచించారని సుధాస్వామి తెలిపారు. కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు విజయ్, తరుణ్, సాయిచరణ్, వాసు, సత్యం, అప్పారావు, గోపీ పాల్గొన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్లన్నీ ఒక్కటవ్వాలి

- సమావేశమై వివాదాలు పరిష్కరించుకోవాలి
- అసోసియేషన్ నేతలకు కేశినేని చిన్ని సూచన

విద్యాధరపురం: క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, ఒలింపిక్ అసోసియేషన్లన్నీ ఒక్కటిగా విలీనం కావాలని, అసోసియేషన్ల మధ్య వివాదాలను పరిష్కరించుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం కేపీరావు ఆధ్వర్యంలోని అసోసియేషన్ క్రీడాకారులతో ఆయన మాట్లాడారు. ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌లో ప్రస్తుతమున్న సభ్యులు, సభ్యులు కాని వారందరూ ఒకే చోట సమావేశమై వివాదాలు పరిష్కరించుకోవాలన్నారు. క్రీడల అభివృద్ధికి ఒక ఒలింపిక్ అసోసియేషన్ మాత్రమే ఉండాలన్నారు. ఆర్కే పురుషోత్తం ఆధ్వర్యంలోని అసోసియేషన్‌ను కూడా పిలవాలని పట్టాభికి ఎంపీ సూచించారు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు, లేదా ఆ తర్వాత ఒకే ఒలింపిక్ అసోసియేషన్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని ఎంపీ తెలిపారు. అసోసియేషన్ నాయకులు చిత్తశుద్ధి, నిజాయితీ, నిబద్ధతతో ముందుకొస్తే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

ఈటీటీసీలో ఏసీ హాస్టల్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్, జూలై 19: విజయవాడ ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీటీసీ)లో శిక్షణ పొందుతున్న ఉద్యోగుల సౌకర్యం కోసం 54 ఏసీ హాస్టల్ రూములను ప్రారంభించడం ఆనందంగా ఉందని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన గదులను ప్రారంభించారు. శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు వేడి ఉక్కపోతల నుంచి ఉపశమనం కలిగించేందుకు ఏసీ గదులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన రైలు ప్రమాదాలు సిగ్నలింగ్ వ్యవస్థలోని సాంకేతికలను ఆయన వివరించారు, లోకో పైలట్లు భద్రతా నియమాలను నిబద్ధతతో పాటించాలని సూచించారు. సీనియర్ డీఈఈలు బి.శ్రీనివాసులు, టి.సురేష్‌బాబు, ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎ.సీతారాం, పవర్ ఏడీఎంఈ కె.హనుమా రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలు, అంగన్వాడీల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహించాలి

కలెక్టర్ జి.సృజన ఆదేశం

కృష్ణలంక, జూలై 19: పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న స్థలాల్లో కిచెన్ గార్డెన్లను నిర్వహించాలని, ఒకవేళ స్థలం అందుబాటులో లేకుంటే మిద్దె తోటల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఉద్యాన, అటవీ శాఖల అధికారులతో పాఠశాలల్లో కార్యకలాపాలు, కిచెన్ గార్డెన్ల నిర్వహణపై ఆమె సమావేశం నిర్వహించారు. కిచెన్ గార్డెన్ల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. 6-10వ తరగతి వరకు విద్యార్థులు ప్రకృతితో మమేకమై కిచెన్‌గార్డెన్ కార్యకలాపాల్లో పాల్గొనేలా చూడాలని, ప్రతిరోజూ ఒక తరగతి చొప్పున చివరి పీరియడ్‌ను ఇందుకు కేటాయించాలని ఆమె సూచించారు. తొలుత పోషక విలువలున్న ఆకుకూరలను పండించాలని, వీటిని మధ్యాహ్న భోజనంలో ఉపయోగించడం వల్ల రక్తహీనత దరిచేరకుండా చూడొచ్చని తెలిపారు. కిచెన్‌గార్డెన్ కార్యక్రమం మంచి ఫలితాలు సాధించేలా పాఠశాల విద్యాశాఖ, వ్యవసాయం, ఉద్యాన, అటవీ, ప్రకృతి వ్యవసాయం, డ్వామా తదితర విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని, విజయవంతంగా నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



కిచెన్ గార్డెన్లపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ సృజన

టీచింగ్ ప్లాన్ తప్పనిసరి

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా టీచింగ్‌ప్లాన్‌ను అనుసరించి బోధన జరగాల్సిందేనని కలెక్టర్ సృజన స్పష్టం చేశారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఏ ప్రతిపాదన అయినా విద్యార్థి కేంద్రీకృతంగా ఉండాలని ఆమె సూచించారుఏ. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, టీచింగ్ ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, ఉద్యాన అధికారి బాలాజీకుమార్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎఫ్‌వో ఎవీఎస్ఆర్‌కే అప్పన్న పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వంలో రాజ్యమేలుతున్న అవినీతి

- జగన్ చేసిన అప్పుల వివరాలను చంద్రబాబు బహిర్గతం చేయాలి: మాజీ ఎంపీ చింతా మోహన్



ధర్నాచౌక్, జూలై 19: ఎన్డీయే ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని కాంగ్రెస్ పార్టీ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ పాలిత మహా రాష్ట్రలో ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌లను మంత్రులు రూ.5 కోట్లకు బేరం పెట్టారని ఆయన ఆరోపించారు. ఒక్కో ఐఏఎస్ అధికారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేసి పోస్టింగ్‌లు ఇస్తున్నారని ఆరోపించారు. నరేంద్రమోదీ, బీజేపీ అవినీతికి ఇది నిదర్శనమన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ధరలను స్థిరీకరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆయన విమర్శించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం నుంచి అధికంగా వలసలు పెరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2019లో 2 లక్షల 65 వేల కోట్ల అప్పు ఉండగా జగన్ హయాంలో రూ.14 లక్షల కోట్లకు అప్పులు చేరాయన్నారు. నెలకు రూ.9 వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని చింతా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని లక్షల కోట్లు ఏమయ్యా యని ఆయన ప్రశ్నించారు. జగన్ చేసిన అప్పులపై వివరాలు తెలియ జేయాల్సిన భాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి ఏవిధగా కాపాడుతారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గన్నవరం పంచాయతీలో

అవకతవకలపై విచారణ

గన్నవరం, జూలై 19: గన్నవరం పంచాయతీలో జరిగిన అవకతవకలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విచారణ జరిపారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజేంద్రవరప్రసాద్ విచారణకు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలో జరిగిన రూ.1.58 కోట్ల నిధుల దుర్వినియోగంపై సర్పంచ్, కార్యదర్శి నుంచి కలెక్టర్ వివరణ తీసుకున్నారు. కొన్ని బిల్లులు సక్రమంగా ఉన్నప్పటికీ అప్పటి విచారణ అధికారి పరిగణనలోకి తీసుకోలేదని కలెక్టర్‌కు వారు వివరించారు. విచారణపై పునఃసమీక్షించాలని కోరారు. ఫిర్యాదుదారులైన మాజీ సైనిక ఉద్యోగి ముప్పనేని రవికుమార్, ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు కూడా కలెక్టర్‌ను కలిశారు. దుర్వినియోగానికి గురైన నిధులను వెంటనే రికవరీ చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలని కోరారు. అవినీతికి పాల్పడిన కార్యదర్శి, సర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ శివారులోని చంద్రిక అయోధ్య అపార్టుమెంట్లకు నిబంధనలకు విరుద్ధంగా తాగునీటిని సరఫరా చేయడంపై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీపీవో నాగేశ్వరనాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. డీపీవో కోనాయి చెరువు దగ్గర పైప్‌లైన్లను పరిశీలించారు. సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ దగ్గర బోరును చూసి ఎంపీటీసీ, పలువురు వార్డు సభ్యులను అడిగి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం అపార్టుమెంట్ల వద్దకు వెళ్లి అక్కడ బోర్లను, ఆర్వో వాటర్‌ప్లాంటును పరిశీలించారు. పంచాయతీ తీర్మానం మేరకు ఐదు బోర్లను వేసి మూడు బోర్ల నీటిని పైలెట్ ప్రాజెక్టును నింపాలని రోజుకు మూడు గంటలు మాత్రమే అపార్టుమెంట్లకు నీళ్లు ఇవ్వాలని డీపీవో ఆదేశించారు. డీఎల్పీవో సంపత్‌కుమారి, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌కుమార్, సత్యబాబు, బాపూజీ పాల్గొన్నారు.

అడిగోపుల వెంకటరత్నం మృతికి

ఏపీ రచయితల సంఘం సంతాపం

విజయవాడ కల్చరల్, జూలై 19: ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారుడు అడిగోపుల వెంకటరత్నం మరణానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సంతాపం తెలిపింది. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో తుదిశ్వాస విడిచారు. వృత్తిరీత్యా గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఇంజినీరుగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆయన, తిరుపతిలో స్థిరపడ్డారు. ప్రవృత్తిరీత్యా ఐదు దశాబ్దాలకు పైగా అలనాటి భారతి పత్రిక నుంచి ఈనాటి అనేక పత్రికల్లో వామపక్ష భావజాలంతో కూడిన వందలాది అభ్యుదయ కవితలు రచించారు. 1984లో సూర్యోదయం కవితా సంపుటి మొదలుకొని 2024లో నిలువెత్తు సంతకం వరకు 27 కవితా సంపుటాలు, 1995లో పురోగతి అంచున అనే పేరుతో ఒక కథా సంపుటిని ఆయన వెలువరించారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం, గిడుగు తెలుగుభాషా పురస్కారం వంటి పలు పురస్కారాలు గతంలో అందుకున్నారు. జాతీయ కవి సమ్మేళనాల్లో పాల్గొన్నారు. ఆయన రచించిన పుస్తకాలు కొన్ని విజయవాడలో పలు వేదికపై ఆవిష్కరించబడ్డాయి. తెలుగు సాహిత్యరంగంలో తనదైన సంతకంతో అశేష కృషి చేసి అడిగోపుల లేని లోటు పూడ్చలేనిదని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సి.భవానీదేవి, చలపాక ప్రకాష్‌లు పేర్కొన్నారు.



షార్జా ప్రభుత్వ అధికారులతో సమావేశమైన అసోచామ్ ప్రతినిధులు

విజయవంతంగా ముగిసిన బీ 2 బీ సమావేశాలు

భవానీపురం, జూలై 19: అసోసియేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్), షార్జా ప్రభుత్వం, యూఏఈ సహకారంతో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య మద్దతుతో నగరంలోని నోవాటెల్‌లో ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్న బీ 2బీ సమావేశాలు శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయి. యూఏఈలోని షార్జా ఎయిర్‌పోర్టు ఇంటర్నేషనల్ ఫ్రీ(ఎస్ఏఐఎఫ్) జోన్ అందించే లాభదాయక అవకాశాలను అన్వేషించాలని, 70 కంటే ఎక్కువ కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొనటం ద్వారా సమావేశానికి అద్భుత స్పందన లభించిందని అసోచామ్ ఏపీ, తెలంగాణ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ రవికుమార్‌రెడ్డి కటారు తెలిపారు. భారతీయ వ్యాపారులు నేరుగా అధికారులతో మమేకమవడానికి బీ 2బీ సమావేశాలు ఒక ప్రత్యేక వేదికగా ఉన్నాయని, అంతర్జాతీయ మార్కెట్లకు యూఏఈని ఒక గేట్‌వేగా మార్చడానికి దోహదపడతాయని అన్నారు.

రేపు అండర్-11 బాల, బాలికల చెస్ టోర్నీ

విజయవాడస్పోర్ట్సు, జూలై 19: మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీలో ఈనెల 21న ది విజయవాడ చెస్ సంఘం, గ్లోబల్ చెస్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా అండర్-11 బాల, బాలికల చెస్ పోటీలను వేర్వేరుగా నిర్వహిస్తున్నామని, పాల్గొనే విద్యార్థులు 9849514138, 9246181858 నెంబర్లలో సంప్రదించాలని జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఖాశీం, మందుల రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ జట్ల ఎంపిక

ఎన్టీఆర్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలను పోరంకిలోని ఎస్ఆర్‌కే టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి డి.దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు అర్హతా పత్రాలతో ఆ రోజు రిపోర్టు చేయాలన్నారు.

సీఎం నివాసం వద్ద

పార్కింగ్ ప్రదేశం అభివృద్ధికి టెండర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి రాజధాని ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసం దగ్గర వాహనాల పార్కింగ్ ఏరియా అభివృద్ధి కోసం సీఆర్డీయే రూ.36.54 లక్షల వ్యయంతో టెండర్లు పిలిచింది. ముఖ్యమంత్రి నివాసానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో, పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో పార్కింగ్ ఏరియాను బీటీ లేయర్‌తో అభివృద్ధి చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు.

మర్యాదపూర్వకంగా..

కృష్ణలంక, జూలై 19: రాష్ట్ర పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంను కలెక్టర్ జి.సృజన శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు.



నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ సృజన

సీపీఎస్‌కు జమచేసిన మొత్తంలో

పాక్షిక ఉపసంహరణకు అవకాశం

వన్‌టౌన్, జూలై 19: సీపీఎస్ కోసం జమచేసిన మొత్తంలో పాక్షిక ఉపసంహరణకు మరల అవకాశం వచ్చిందని ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ పఠాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్‌డీఎల్ వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్లలో ఉపసంహరణను పునరుద్ధరించారని వారు తెలిపారు. దరఖాస్తులను సబ్ ట్రెజరీలో ఆమోదించాల్సి ఉంటుందని, ఆమోదం పొందిన ఏడు రోజుల తర్వాత ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో డబ్బు జమవుతుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి తన సర్వీస్ కాలంలో మూడు పర్యాయాలు మాత్రమే ఈ సదుపాయాన్ని వినియోగించుకునే అవకాశముందని, గరిష్టంగా 25 శాతం మాత్రమే ఉపసంహరణకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తంతో పిల్లల వివాహాలు, చదువులు, ఇంటి నిర్మాణం, స్థలం కొనుగోలు వంటివి చేయొచ్చని తెలిపారు. అత్యంత అవసరం ఉంటేనే ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నాట్య పోటీల్లో నీలిమ ప్రతిభ

విజయవాడ కల్చరల్, జూలై 19: దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని పి.నీలిమ(సీఈసీ) కూచిపూడి నాట్య పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంది. హైదరాబాద్‌కు చెందిన భారత్ ఆర్ట్ అకాడమీ పూరి జగన్నాథ్ ఆలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో నీలిమ తన ప్రతిభను చాటింది. తెలంగాణలో స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి టెంపుల్‌లో, ఇస్కాన్ టెంపుల్‌లో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతిని గెలుచుకొంది. నీలిమను సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అక్కినేని పద్మజ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



నీలిమను అభినందిస్తున్న దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అక్కినేని పద్మజ

వైద్య విద్యార్థి నితీష్‌కుమార్‌కు అభినందన

ప్రభుత్వాసుపత్రి, జూలై 19: ఇటీవల కాకినాడలో నిర్వహించిన మోడరన్ పెంటాథ్లాన్ క్రీడల్లో ప్రతిభ చూపిన సిద్ధార్థ మెడికల్ కాలేజీ విద్యార్థి వి.నితీష్ కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్ శుక్రవారం అభినందించారు. బయాథ్లాన్, ట్రయాథ్లాన్ ఈవెంట్లలో వెండి పతకం, రజత పతకం సాధించిన నితీష్‌కుమార్‌కు కళాశాలలో ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఆగస్టులో ఉత్తరాఖండ్‌లో జరగనున్న 13వ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి మోడరన్ పెంటాథ్లాన్ ఈవెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడని తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె.రాము బయాథ్లాన్ ఈవెంట్‌లో మాస్టర్స్ కేటగిరిలో గోల్డ్‌మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్ తెలిపారు.



నితీష్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుధాకర్

పోషణ ట్రాకర్ అప్లికేషన్‌తో

అంగన్వాడీలకు ఉపయోగం

మొగల్రాజపురం, జూలై 19: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన పోషణ ట్రాకర్ అప్లికేషన్ అంగన్వాడీ కార్యకర్తలకు ఎంతగానో ఉపయోగ పడు తుందని మహిళా శిశుసంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాల రాష్ట్ర కో- ఆర్డినేటర్ జె.సునీత తెలపారు. మొగల్రాజపురంలో బాడవపేట నెహ్రూ నగర్ అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. పోషణ ట్రాకర్ అప్లికేషన్ వినియోగించడం ద్వారా లబ్ధిదారుల పోషణ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లల్లో పెరుగుదల క్రమం తప్పకుండా ప్రతి నెల పర్యవేక్షించాలని సునీత సూచించారు. పోషకాహార లోపం ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువు అప్లికేషన్‌లో నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు కాని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ రెహాన, అంగన్వాడీ సూపర్‌వైజర్, కార్య కర్తలు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

బంటుమిల్లి : ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన బంటుమిల్లిలో జరిగింది. బంటుమిల్లిలో వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న గరికిముక్కు సుస్మిత(19)కు రామవరపుమోడి గ్రామానికి చెందిన వల్లభు హనుమంతుతో సంవత్సరం క్రితం ప్రేమలో పడింది. హనుమంతు పెళ్లికి నిరాకరించడంతో ఈనెల 14వ తేదీన ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికు పాల్పడింది. బంధువులు వైద్యం కోసం మచిలీపట్నం తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుస్మిత గురువారం రాత్రి మరణించింది. తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జగన్... దమ్ముంటే నీ చెల్లెళ్లకు న్యాయం చెయ్యి: మంత్రి అనిత


కాలినడకన తిరుమలకు వెళ్తున్న అనిత

తిరుమల(ఆంధ్రజ్యోతి), తిరుపతి, జూలై 19: 'జగన్.. నీకు దమ్ముంటే రాష్ట్ర ప్రజలకు కాదు... నీ చెల్లెళ్లు షర్మిల, సునీతకు న్యాయం చేయగలవా?' అని హోం మంత్రి వంగలపూడి అనిత సవాల్ విసిరారు. హోం మంత్రి కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం నిమిత్తం శుక్రవారం తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'పల్నాడు ఘటన బాధాకరం. దీనికి ప్రభుత్వం చింతిస్తోంది. స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ పాకులాడుతోంది. వారి కుయుక్తులు, ఎత్తుగడలు చెల్లవు' అని అనిత అన్నారు. కాగా, హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి నుంచి కాలినడకను ప్రారంభించిన ఆమె మధ్యాహ్నం కొండపైకి వచ్చారు. హోంమంత్రి శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అమర్నాథ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించే మనసు రాలేదా?: పురందేశ్వరి



అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'అక్కను వేధిస్తోన్న అల్లరి మూకల్ని అడ్డుకొని వారి చేతిలో అగ్నికి ఆహుతైన అమర్నాథ్ గౌడ్ కుటుంబాన్ని సందర్శించేందుకు మనసు రాలేదా? మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలకు గురి చేసినప్పుడు మీరు ఎక్కడున్నారు జగన్‌రెడ్డీ?' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నించారు. శుక్రవారం అన్నమయ్య, సత్యసాయి, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు బీజేపీలో చేరిన సందర్భంగా మాట్లాడుతూ.. 'పల్నాడులో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యపై రాజకీయం చేస్తోన్న వైసీపీ అధ్యక్షుడి డ్రామాను ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్రంలో పరిస్థితులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసిన జగన్‌రెడ్డి ముందుగా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనలో బీసీలు, ఎస్సీలు, మహిళలు... ఎందరో ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం పల్నాడుకు వెళ్లిన జగన్ తాను సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో జరిగిన అరాచకాలను పీఎంకు రాసిన లేఖలో ప్రస్తావించాల్సింది' అని పురందేశ్వరి అన్నారు.

నంద్యాల సలామ్ గుర్తులేరా జగన్‌రెడ్డీ?: దినకర్

వినుకొండ వైసీపీ అధ్యక్షుడి అనుచరులుగా ఉంటూ కక్షలు పెంచుకున్న రషీద్, జిలానీ గొడవల్ని రాజకీయం చేస్తోన్న జగన్‌రెడ్డికి నంద్యాలలో అబ్దుల్ సలామ్ ఎందుకు గుర్తులేరని బీజేపీ నేత లంకా దినకర్ ప్రశ్నించారు. సలామ్ కుటుంబం ఎవరి వేధింపులకు బలైందో.. డాక్టర్ సుధాకర్‌ను ఎవరు పొట్టనబెట్టుకున్నారో.. డ్రైవర్ సుబ్రమణ్యం శవాన్ని పార్శిల్ చేసిన ఎమ్మెల్సీ ఏ పార్టీకి చెందిన వారో.. వీరందరికీ అండగా నిలిచింది ఎవరో ప్రజలకు జగన్‌రెడ్డి వివరిస్తే బాగుంటుంది' అని దినకర్ హితవు పలికారు.

మాజీ సైనికోద్యోగులకు అండగా ఉంటాం: జనార్దన్

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు టీడీపీలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. మాజీ సైనికోద్యోగులకు 2% రిజర్వేషన్‌ను తిరిగి కొనసాగించాలి' అని ఏపీ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ అధ్యక్షతన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఏపీ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి శంకరరావు, జనరల్ సెక్రటరీ రమేశ్ కుమార్ మాట్లాడుతూ... కేంద్రీయ సైనిక్ బోర్డులో ఏపీ నుంచి ఒక్క ప్రతినిధి కూడా లేరని చెప్పారు. దీనిపై టీడీ జనార్దన్ మాట్లాడుతూ, మాజీ సైనికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, న్యాయం చేస్తామని చెప్పారు.

జెన్‌కో అప్పర్ సీలేరు ప్రాజెక్టుకు కేంద్రం ఓకే

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో అప్పర్ సీలేరుపై ఏపీ జెన్‌కో 1,350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించతలపెట్టింది. దానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. గురువారం ఢిల్లీలో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 11మంది సభ్యులతో కూడిన బోర్డు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమయింది. జెన్కో ప్రతిపాదిత ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదని ఈసీ అభిప్రాయపడిందని జెన్కో ఎండీ కేవీ చక్రధర్‌బాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన తొమ్మిది జనరేటర్లను పెట్టాలని జెన్కో నిర్ణయించింది. ఇది పూర్తయితే రాష్ట్రం విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోగలుగుతుంది. స్వల్ప వ్యవధి కింద బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోలు భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. దేశ వ్యాప్తంగా 2030 నాటికి 500 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఉందని చక్రధర్ బాబు వివరించారు.

నాన్ జుడీషియల్ స్టాంపు పేపర్‌నే కొనసాగించండి

- ఏపీ స్టాంప్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరి నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్లనే కొనసాగించాలని ఏపీ స్టాంప్ వెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణయ్య కోరారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

జడ్జి రామకృష్ణ పిటిషన్‌పై ఉత్తర్వులిస్తాం: హైకోర్టు

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ జడ్జి రామకృష్ణ 2021లో వేసిన ప్రైవేటు ఫిర్యాదులో ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించి సర్టిఫైడ్ కాపీలను పిటిషనర్‌కు అందజేయడంలో జాప్యం, తదితర అంశాలపై తాము నివేదిక తెప్పించుకొంటామని హైకోర్టు పేర్కొంది. ఈ విషయంలో పారిపాలనాపరంగా తగిన ఉత్తర్వులు ఇస్తామంది. ప్రిసైడింగ్ అధికారి నివేదికపై స్పందన తెలపాలని పిటిషనర్‌ను ఆదేశించింది.ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ జడ్జి ఎస్.రామకృష్ణ 2021లో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు రాగా న్యాయవాది కుంచెం మహేశ్వరరావు, పిటిషనర్ తరపున న్యాయవాది బి.బాలయ్య వాదనలు వినిపించారు.

వైసీపీ వాళ్లు నరుక్కొంటే మాపై నిందలా: గొట్టిపాటి

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సొంత బాబాయి వివేకానంద రెడ్డిని చంపించి దానిని టీడీపీపై నెట్టిన ఘనుడు జగన్ అని, అలాంటి వ్యక్తి ఎవరి మీద అయినా నెపం నెట్టగలడని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వ్యాఖ్యానించారు. 'వినుకొండలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల మధ్య చాలాకాలంగా వ్యక్తిగత గొడవలున్నాయి. గతంలో కూడా వారి మధ్య పరస్పర దాడులు జరిగాయి. అవే వ్యక్తిగత కక్షలతో అందులో ఒక వ్యక్తి మరో వ్యక్తిని చంపాడు. దానిని ప్రభుత్వానికి ఆపాదించడం జగన్ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో వందల మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల వారు హత్యలకు గురయ్యారు. ఏనాడైనా జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి కాలు బయట పెట్టి ఎవరి కుటుంబాన్ని అయినా పరామర్శించాడా?' అని నిలదీశారు.

దోచుకున్న సొమ్ము ప్రజలకు పంచాలి

- పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పాలి: బుద్దా

విజయవాడ (వన్ టౌన్), జూలై 19: మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ విథున్‌రెడ్డి దోచుకున్న డబ్బును ప్రజలకు పంచి క్షమాపణలు చెప్పాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పుంగనూరులో తండ్రీ, కుమారులపై ప్రజలే దాడి చేశారు. గనులశాఖ మంత్రిగా పెద్దిరెడ్డి న్యాయబద్ధంగా వ్యాపారాలు చేసే వారిని బెదిరించి వారి వ్యాపారాలను లాక్కున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబుపై పుంగనూరులో పెద్దిరెడ్డి రాళ్ల దాడి చేయించాడు. ఆ దాడిని చంద్రబాబు ధైర్యంగా ఎదుర్కొన్నారు. పెద్దిరెడ్డి బాధితులకు న్యాయం చేసి వారి ఆస్తులను వారికి అప్పగిస్తాం. లోకేశ్ రెడ్‌బుక్ జోలికి వెళ్లడం లేదు. కేవలం సంక్షేమ పాలన చేస్తున్నారు. జగన్ పులితోలు కప్పుకొన్న పిల్లి' అని వెంకన్న అన్నారు.

ఒలింపిక్స్ కోసం వేలు తీసేశాడు!

- ఆస్ట్రేలియా హాకీ ఆటగాడు మాథ్యూ డాసన్ కఠిన నిర్ణయం




సిడ్నీ, జూలై 19: ఏదైనా పెద్ద టోర్నీకి ముందు గాయాలైతే క్రీడాకారులు కోలుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. అప్పటికీ వీలు కాకుంటే.. అత్యంత ఆవేదనతో టోర్నీకి దూరమవుతారు. ఆస్ట్రేలియా పురుషుల హాకీ జట్టు సభ్యుడు మాథ్యూ డాసన్ (30) మాత్రం కఠిన నిర్ణయం తీసుకున్నాడు. మైదానంలో డిఫెండర్‌గా పోరాట పటిమ చూపే అతడు.. బయట కూడా పరిస్థితులతో పోరాడేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవల డాసన్ కుడిచేతి ఉంగరపు వేలికి పెద్ద గాయమైంది. శస్త్రచికిత్స చేయించుకున్నా.. కోలుకునేందుకు సమయం పట్టనుంది. కానీ, ఈ నెల 26 నుంచి ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. డాసన్ పాల్గొనే అవకాశం కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ఏకంగా వేలి పైభాగాన్ని తొలగించుకున్నాడు. ఇప్పుడీ అంశం చర్చనీయాంశం అవుతోంది. ఆటపైన, దేశంపైన అతడికి ఉన్న ప్రేమను అందరూ ప్రశంసిస్తున్నారు. మరోవైపు టోక్యోలో జరిగిన గత ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచిన ఆస్ట్రేలియా జట్టులోనూ డాసన్ సభ్యుడు. వేలిని తొలగించే విషయం తొలుత భార్యకు చెప్పానని, కఠిన నిర్ణయం వద్దని ఆమె వారించినా.. తాను ముందుకుసాగినట్లు డాసన్ వివరించాడు. ప్రస్తుతం అతడు జట్టుతో కలిసి ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడు. కాగా, ఆరేళ్ల కిందటి హాకీ స్టిక్ తగిలి డాసన్ కంటికి చూపు పోయేంతటి గాయమైంది. అప్పుడు కూడా స్థైర్యం కోల్పోకుండా పట్టుదలతో నిలిచాడు. కోలుకుని మైదానంలో అడుగుపెట్టాడు.

సచివాలయాల ప్రక్షాళన తప్పనిసరి



- 37శాతం గ్రామ సచివాలయాల్లో 5శాతం లోపు సేవలు
- సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ సంస్థ అధ్యయనం
- నివేదికను తొక్కిపెట్టిన సచివాలయ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థలో లోపాలు, దాని బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ (సీపీఆర్) సంస్థ జగన్ హయాంలోనే అధ్యయనం చేసింది. ఈ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. అయితే ఈ సంస్థ ఇచ్చిన నివేదిక అప్పటి ప్రభుత్వ పెద్దల మనోభావాలకు వ్యతిరేకంగా ఉందనే ఉద్దేశంతో దాన్ని బహిర్గతం చేయడానికి గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ అధికారులు సాహసించలేదు. సచివాలయ వ్యవస్థ ఎందుకు?, దానిలో ఎలాంటి మార్పులు చేపట్టాలి?, ఉన్న వ్యవస్థను ఎలా మలచుకుంటే ప్రజలకు విస్తృతంగా ఉపయోగపడుతుందన్న అంశాలపై ప్రస్తుతం చర్చ సాగుతున్న నేపథ్యంలో సీపీఆర్ అధ్యయనం అంశం తెరపైకి వచ్చింది.

సంస్థాగత పాత్ర

గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థకు సంబంధించి నాలుగు అంశాల ఆధారంగా సీపీఆర్ అధ్యయనం చేసింది. సంస్థాగత పాత్ర, సంస్థ నిర్మాణం, మానవ వనరులు, కార్యకలాపాలపై అధ్యయనం చేసి ప్రక్షాళన కోసం పలు సూచనలు చేసింది. సచివాలయాలు స్థానిక సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు సూచించడం లేదని, స్థానిక సామాజిక ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించి నిర్వహించడం లేదని నివేదికలో పేర్కొన్నారు. వ్యక్తిగత పథకాల ప్రయోజనాలపైనే సచివాలయాలు ఎక్కువగా దృష్టి సారించాలి. సామాజిక మౌలిక వసతులతో పాటు ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి. తాగునీరు, విద్యుత్ విషయంలో భాగస్వామ్యం కావాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు ఇప్పటికే ఆయా శాఖాపరమైన వ్యవస్థలున్నందున వాటిలో జోక్యం చేసుకోవడంలో అర్థం లేదు.

సమస్యల పరిష్కారం ఇలా...

స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగు ప్రణాళికలు రూపొందించి అమలు చేసే విధంగా గ్రామ, వార్డ్ సచివాలయాలను విస్తృతపరచాలని నివేదికలో సూచించారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను మండల కార్యాలయం స్థాయిలో ఆయా ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా పరిష్కరించాలి.

సంస్థాగత నిర్మాణం

రాష్ట్రంలో పలు గ్రామ, వార్డ్ సచివాలయాలపై పని భారం వేర్వేరుగా ఉంది. 37శాతం గ్రామ సచివాలయాలు, 39.3 శాతం వార్డ్ సచివాలయాలు 2022 నవంబరు- 2023 మే నెలల మధ్యకాలంలో నెలకు కేవలం 5శాతం లోపు సేవలు మాత్రమే అందించాయి. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా గ్రామ సచివాలయాలు ఉన్నా వీటి మధ్య సంబంధాలు అస్పష్టంగా ఉన్నాయి. గ్రామ, వార్డ్ సచివాలయాలు సామాజిక లక్ష్యాలను సాధించే శాఖలుగా కాకుండా పలు శాఖలకు ఔట్‌పోస్టులుగా మారాయి.

పంచాయతీల నియంత్రణ సరికాదు

గ్రామ, వార్డ్ సచివాలయాలకు సంబంధించిన కొన్ని సేవలను ఇతర సచివాలయాలతో అనుసంధానమై అందించాలి. గిరిజన ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాల్లో సామాజిక చైతన్యం, అవగాహన కల్పించేందుకు అదనపు సిబ్బందిని నియమించుకోవాలి. వార్డ్ సచివాలయాల్లో ఒక కార్యదర్శికి ఒకేషనల్ కౌన్సెలింగ్, శిక్షణలో తర్ఫీదు ఇవ్వాలి. గ్రామ పంచాయతీలకు సచివాలయాలపై పూర్తి నియంత్రణ సరికాదు. సామాజిక సంస్థలు, స్వయం సహాయక బృందాలతో కలిసి గ్రామ, వార్డ్ సచివాలయాలు కచ్చితంగా పనిచేయాలి.

మానవ వనరులు... పనిభారం

గ్రామ సచివాలయాల్లో జీవనోపాధి అంశాలు, వ్యవసాయం, పశుసంవర్థకం తదితర విభాగాలకు ప్రత్యేకంగా మానవ వనరులున్నాయి. కానీ వార్డ్ సచివాలయాల్లో లేవు. ఎనర్జీ కార్యదర్శులు మాత్రం రెండుచోట్లా ఉన్నారు. ఏఎన్ఎం, రెవెన్యూ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు గతంలోనూ ఉన్నారు. సచివాలయాల ఏర్పాటుతో వారి సంఖ్య పెరిగింది. సచివాలయ కార్యదర్శులు మంచి విద్యార్హతలు కలిగి ఉన్నారు. వారికి నిరంతర సాంకేతిక శిక్షణ అవసరం. అయితే శిక్షణ ఇచ్చే సంస్థలు రాష్ట్రంలో లేవు.

సెమీ అర్బన్‌లో సిబ్బందిని పెంచాలి

వార్డ్ సచివాలయాల్లో పనిచేసే రెవెన్యూ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్, శానిటేషన్ కార్యదర్శులను తగ్గించాలి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో సిబ్బందిని పెంచుకోవాలి. సచివాలయ కార్యదర్శులకు ఎన్జీఓల సహకారంతో శిక్షణ అందించాలి. పని లేని గ్రామ, వార్డ్ సచివాలయాల్లో వలంటీర్లను తగ్గించాలి.

పని విభజనకు మార్గదర్శకాలు

గ్రామ, వార్డ్ సచివాలయాల పర్యవేక్షణ, నిర్వహణ జిల్లా, మండల కార్యాలయాలకు మారింది. అటెండెన్స్, లాగిన్, రిపోర్టులు, డేటా తదితరాల భారం తగ్గించాలి. సిబ్బందికి కార్యాలయాల్లో పనిచేసేందుకు ప్రాధాన్యత క్రమం ఇచ్చి, పనివిభజనకు స్పష్టమైన మార్గదర్శకాలివ్వాలి. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆయా శాఖల మధ్య సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలి. మండల కార్యాలయాల్లో సిబ్బందిని పెంచాలి. కార్యదర్శులు కచ్చితంగా శిక్షణ పొందాలి.

ఏయూలో ఇనుప కంచె తొలగింపు

- గత వీసీ హయాంలో పరిపాలనా భవనం ఎదుట ఏర్పాటు
- బాధ్యతలు స్వీకరించిన మర్నాడే తొలగించిన ఇన్‌చార్జి వీసీ
- జీతాలు, పెన్షన్ల చెల్లింపు ఫైలుపై శశిభూషణరావు సంతకం


ఏయూ పరిపాలనా భవనం వద్ద ఇనుప బ్యారియర్లు తొలగించిన దృశ్యం

విశాఖపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ఇనుప బారియర్స్‌ను అధికారులు శుక్రవారం తొలగించారు. పీవీజీడీ ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో ఈ భవనానికి ఎదురుగా రెండంచెల్లో ఇనుప కంచెను ఏర్పాటు చేయించారు. దీనిపై అప్పట్లో విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు వచ్చినా ఏమాత్రం పట్టించుకోలేదు. గతంలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా పరిపాలనా కార్యాలయానికి వెళ్లి వీసీనో, రిజిస్ట్రార్‌నో కలసి చెప్పుకునేవారు. ఈ ఇనుప కంచెలు ఏర్పాటు చేసిన తరువాత విద్యార్థులు ఆ కార్యాలయానికి పూర్తిగా దూరమైపోయారు. అయితే, తాజాగా ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.శశిభూషణరావు వీటిపై దృష్టి సారించారు. గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం ఉదయమే వాటిని తొలగించే పని ప్రారంభించారు. ఆయనే దగ్గరుండి ఇనుప బారియర్స్, గేట్లు తొలగింపజేశారు. దీనిపై అధ్యాపకులు, విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. విద్యార్థులు, అధ్యాపకులు, ఇతరులు ఎవరైనా స్వేచ్ఛగా వర్సిటీలోకి, పరిపాలనా భవనంలోకి రావాలన్న ఉద్దేశంతోనే ఇనుప గేట్లను తొలగించినట్టు శశిభూషణరావు తెలిపారు. అలాగే వీసీ చాంబర్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను ఆయనే స్వయంగా ఏర్పాటు చేయించారు. కాగా, ఏయూ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు జూన్ నెలకు సంబంధించిన వేతనాలు, పెన్షన్లు ఇప్పటివరకూ అందలేదు. వీసీగా బాధ్యతలు తీసుకున్న శశిభూషణరావు వాటి కోసం వర్సిటీ బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేసే ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో శుక్రవారం సుమారు 6వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు జమయ్యాయి.

మార్పు ప్రారంభమైంది: మంత్రి లోకేశ్

ఏయూలో గతంలో ఏర్పాటుచేసిన ఇనుప బారికేడ్లను తొలగించడంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పరిపాలనా భవనంలోకి విద్యార్థులు రాకుండా గత వీసీ ఏర్పాటుచేసిన ఇనుప అడ్డంకులను బద్దలు కొట్టినందుకు వీసీ ప్రొఫెసర్ శశిభూషణ్‌ను 'ఎక్స్' వేదికగా అభినందించారు. బారికేడ్లు, దిగ్బంధాల రోజులు పోయాయని, మార్పు ప్రారంభమైందంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు.

హేమచంద్రారెడ్డి అక్రమాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: ఐసా

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యమండలి మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డిపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఐసా(ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్) డిమాండ్ చేసింది. మండలి ఛైర్మన్‌గా హేమచంద్రారెడ్డి ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించింది. విద్యను వ్యాపారంగా మార్చి స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ బీసీ కళాశాలలను మనుగడకు ముప్పు తెచ్చారని ఆరోపించింది. ఐసా జాతీయ కమిటీ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు వేమన, నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలకు లాభంచేకూర్చేందుకు వాటినుంచి ముడుపులు తీసుకుని ఉన్నత విద్య రంగాన్ని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ సర్కార్ హయాంలో ఎయిడెడ్ కళాశాలలను రద్దు చేసిన సందర్భంలో ఆయా కళాశాలల సిబ్బందిని ఇతర చోట్ల పోస్టింగ్ ఇచ్చే సమయంలో కోట్లాది రూపాయలను వసూలు చేశారని ఆరోపించారు. హేమచంద్రారెడ్డి అక్రమాలపై కేంద్రానికి, యూజీసీ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిటింగ్ జడ్జి విచారణ కోసం దశలవారీగా ఉద్యమాలు చేయనున్నట్లు వేమన, నాగరాజు తెలిపారు.

హేమచంద్రారెడ్డి నియామకంపై విచారణ

- జేఎన్‌టీయూహెచ్‌కు ఉన్నత విద్యాశాఖ లేఖ

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి తాజా మాజీ ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ప్రొఫెసర్‌గా నియామకం కావడంపై విచారణ ప్రారంభమైంది. ప్రొఫెసర్‌గా జేఎన్‌టీయూ-హైదరాబాద్‌లో ఆయన నియామకం చట్ట ప్రకారం జరగలేదని కొచ్చి జాతీయ లా యూనివర్సిటీ మాజీ డీన్ ఎం.రఘునాథన్ ఏపీ గవర్నర్, ఉన్నత విద్యాశాఖలకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన నియామకానికి సంబంధించి రికార్డులు సమర్పించాలని ఉన్నత విద్యాశాఖ జేఎన్‌టీయూ హైదరాబాద్ వీసీకి లేఖ రాసింది. నియామకంతో పాటు తర్వాత పదోన్నతుల వివరాలు కూడా ఇవ్వాలని కోరింది. కాగా ప్రస్తుతం ఆయన జేఎన్‌టీయూ అనంతపురంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు.

'పేస్'తో గుంతల రోడ్డుకు మోక్షం

- రహదారుల మరమ్మతులకు బీబీఎంపీ ప్రయోగం

బెంగళూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం అంటే అందరికీ గుర్తొచ్చేది ట్రాఫిక్ సమస్య. అంతకంటే వర్షాకాలం వచ్చిందంటే గుంతలతో సతమతం కావాల్సిందే. దేశంలో ఎక్కడా లేనివిధంగా గుంతలతో గండమంటూ స్థానికులు చిత్రవిచిత్రమైన కళాఖండాలు రూపొందించేవారు. నగరంలో ఏడాదికి 30-40 వేలకు పైగా గుంతలు ఏర్పడతాయి. బెంగళూరులో సమస్య ఏదైనా సోషల్ మీడియా వేదికగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుంది. ఐటీబీటీ, ఎంఎన్‌సీ కంపెనీల ఉద్యోగులు లక్షలాదిమంది నగరంలో ఉండటమే దీనికి కారణం. ఇకపై బెంగళూరులో గుంతల రోడ్డుకు మోక్షం కలిగించేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె సరికొత్త యాప్‌ను సిద్ధం చేస్తోంది. పాట్‌హోల్ అసిస్టెన్స్ సిటిజన్ ఎంగేజ్‌మెంట్(పేస్) యాప్‌ను రూపొందించింది. నెల రోజులుగా నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రధాన రోడ్లపైన గుంతలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ రద్దీకారణంగా గంటల వ్యవధిలోనే ఈ గుంతలు చిన్నపాటి చెరువుల్లా మారిపోతుంటాయి. ఇటువంటి గుంతలు లక్షలాది మంది ద్విచక్ర వాహనదారులకు నిత్యం సవాలుగా మారుతున్నాయి. బెంగళూరు సమస్యలపై నగరాభివృద్ధి శాఖ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఆ సమయంలో 'పేస్' ప్రస్తావన వచ్చింది. ప్రస్తుతానికి యాప్ సిద్ధంచేశారు. త్వరలోనే అందుబాటులోకి రానుంది. నగర పరిధిలో ఎక్కడైనా గుంతలు పడితే.. వాటి ఫొటోలు, వివరాలు పేస్ యాప్‌లో పోస్ట్ చేయవచ్చు. ఆ సమాచారం బీబీఎంపీ ప్రాంతీయ ఇంజనీర్‌కు చేరుతుంది. దానిని ప్రాంతాల వారిగా కాంట్రాక్టర్‌కు పంపుతారు. గుంతలు పూడ్చి ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పని పూర్తయినట్లు ఫిర్యాదు చేసిన వ్యక్తికి మెసేజ్ పంపుతారు. గడువులోగా పనిపూర్తి కాకపోతే సమస్య ఉన్నతాధికారుల దృష్టికి వెళుతుంది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్లపై వారు చర్యలు తీసుకుంటారు. కాంట్రాక్టర్లు మాన్యువల్‌గా కాకుండా యాప్‌లోనే బిల్లులు సమర్పించే వెసులుబాటు కల్పించారు. దీంతో చెల్లింపులు కూడా త్వరితగతిన పూర్తవుతాయి. బెంగళూరులో ప్రతి పనికీ యాప్ వాడకం సాధారణమైపోయింది. 2017 నుంచి బీబీఎంపీ పరిధిలో 'ఫిక్స్ మై స్ట్రీట్' యాప్ అందుబాటులో ఉంది. తద్వారా రోడ్లపై గుంతలు, చెత్త నిర్వహణ, వీధి దీపాలు ఇతరత్రా సమస్యలు పోస్ట్ చేసే వీలుండేది. గుంతల సమస్యల కోసమే పేస్ యాప్‌ను తీసుకొస్తున్నారు.


మెదడుపై పడే ప్రభావాన్ని వివరిస్తున్న వైద్యులు

టూత్‌పేస్ట్‌తోనూ ప్రమాదమే..!

- మూర్ఛలు, తలనొప్పి, ఆందోళనకు ఇదే కారణం
- పెయిన్ బామ్‌లతోనూ అనారోగ్య సమస్యలు
- ఏపీ 'న్యూరో సైంటిస్ట్స్' వైద్య సదస్సులో వెల్లడి

గుంటూరు (మెడికల్), జూలై 19: మద్యపానం, ధూమపానం, గుట్కా, ఖైనీ, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ.. మనం ప్రతిరోజూ ఉదయం పళ్లు తోమడానికి ఉపయోగించే సాధారణ టూత్ పేస్టులూ, తలనొప్పికి, ఒళ్లు నొప్పులకు వాడే పెయిన్‌బామ్‌లు సైతం మనిషి ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయని తెలుసా? అంటే.. అవును ఇది నిజమేనని ఆంధ్రప్రదేశ్ న్యూరోసైంటిస్ట్స్ (న్యూరాలజిస్టులు/న్యూరో సర్జన్లు) అసోసియేషన్ వెల్లడించింది. ఏళ్ల తరబడి టూత్‌పేస్టులు వాడటం వల్ల అందులో ఉండే మూలకాలు మూర్ఛలు, మైగ్రేన్, తల తిరుగుడు, ఆందోళన, భయం వంటి పలు రుగ్మతలకు కారణమవుతున్నట్టు హెచ్చరించింది. కర్పూరం, సోపు, యూకలిప్టస్ ఆయిల్, ఆయుర్వేద, హెర్బల్, ఇతర పేర్లతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న టూత్‌పేస్టులు సమస్యలు సృష్టిస్తున్నట్లు తెలిపింది. టూత్‌పేస్టులతో పాటు ఘాటైన వాసన గల పెయిన్‌బామ్‌లు, పెయిన్ కిల్లర్ మాత్రలు కూడా ఈ తరహా అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణంగా మారుతున్నాయని సదస్సులో ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎన్ఎస్ఏ) ఆధ్వర్యంలో సంఘం 31వ వార్షిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 600 మంది న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు హాజరయ్యారు.

తలనొప్పికి ఇదే ప్రధాన కారణం

తొలి రోజు జరిగిన సైంటిఫిక్ సెషన్‌లో బెంగళూరులోని సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీకి చెందిన న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ థామస్ మ్యాథ్యూ మాట్లాడుతూ.. తమ న్యూరాలజీ ఓపీకి వచ్చే తలనొప్పి రోగుల్లో 84 శాతం మందికి టూత్‌పేస్ట్‌ల వాడకమే ప్రధాన కారణమని తెలిపారు. వీరికి సాధారణ చికిత్సలు అందిస్తూనే టూత్‌పేస్ట్ వాడకాన్ని నిలిపివేశామని, రెండు వారాల తర్వాత 99 శాతం మందిలో తలనొప్పి మాయమైందని తెలిపారు. టూత్‌పేస్ట్‌లో ఉండే ఘాటైన వాసన గల మూలకాలు రోగుల్లో పలు రకాల రుగ్మతలను కల్పించే ట్రిగ్గరింగ్ ఫ్యాక్టర్‌గా పనిచేస్తున్నట్టు తాము గుర్తించామని డాక్టర్ థామస్ మ్యాథ్యూ తెలిపారు. ఆయా మూలకాల ప్రభావం నేరుగా మెదడుపై పడుతుందని, దీని వల్ల తరచూ తలనొప్పి, మూర్ఛలు, ఆందోళన, ఇతర మానసిక వ్యాధులకు దారి తీస్తున్నట్లు చెప్పారు. దీనిపై తాము సమగ్ర అధ్యయనం చేస్తున్నామని, త్వరలో వివరాలు ప్రకటిస్తామని తెలిపారు. సదస్సులో పలువురు వైద్యనిపుణులు వివిధ అంశాలపై ప్రసంగించారు.


టీడీపీ నేత వర్ల రామ్యను కలిసి వినతిపత్రం అందజేస్తున్న పోలీసు అధికారుల సంఘం నేతలు

ఏదేదో మాట్లాడేశాం.. క్షమించండి!

- పోలీస్ అధికారుల సంఘం నేతలు.. టీడీపీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- వర్ల రామయ్యను కలసి క్షమాపణలు

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పెద్దల ప్రోత్సాహంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలపై విరుచుకుపడి తొడలు కొట్టి మీసం తిప్పిన పోలీస్ అధికారుల సంఘం నేతలకు తత్త్వం బోధపడింది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. సంఘం అధ్యక్షుడు జముకుల శ్రీనివాసరావు, ఇతర నేతలు కొద్ది రోజులుగా టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. శుక్రవారం నేరుగా ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. మీడియా ప్రతినిధులు వచ్చేవరకూ వేచి చూసి, టీవీ కెమెరాల ఎదుట వర్ల రామయ్య చేతులు పట్టుకొని తమను క్షమించాలని శ్రీనివాసరావు వేడుకొన్నారు. గతంలో జరిగిన విషయాలను వదిలివేయాలని, అప్పట్లో వైసీపీ నేతల ప్రభావంతో ఏదేదో మాట్లాడామని వివరణ ఇచ్చారు. వర్ల రామయ్య కూడా వారిని మందలించారు. అనంతరం జముకుల మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'మా పోలీస్ వ్యవస్థను ఎవరైనా ఏదైనా అంటే మేం ప్రతిస్పందిస్తాం. మాది కడపలో రాజంపేట ప్రాంతం. అక్కడి మేనరిజం ప్రకారం తొడగొట్టి మీసం తిప్పాం. అంతే తప్ప వేరే ఉద్దేశం లేదు. డీజీపీని, పోలీస్ అధికారులను విమర్శిస్తే సంఘం నేతలుగా మాట్లాడాల్సి వచ్చింది. వ్యక్తిగతంగా మాకు ఎవరితోనూ ఏ విభేదాలు లేవు' అని ఆయన అన్నారు. పదవి నుంచి దిగిపోయిన తర్వాత పోలీస్ శాఖ వైఫల్యంపై జగన్ చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని ముక్తసరిగా చెప్పారు.

బైజూస్ ట్యాబ్‌లతో చెడు మార్గం

- పంపిణీ ఆపేయాలని ఆప్టా విజ్ఞప్తి

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బైజూస్ ట్యాబ్‌ల వల్ల విద్యార్థులకు మేలు జరగకపోగా చెడు మార్గం పట్టే పరిస్థితి కనిపిస్తోందని ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం ఆందోళన వ్యక్తంచేసింది. విద్యార్థుల్లో చాలా మంది ఇతరత్రా కార్యకలాపాలకు వాటిని వినియోగిస్తున్నారని తెలిపింది. కొత్త ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు రాత్రి వేళ్లలో ఎక్కువగా ట్యాబ్‌తో గడపటం వల్ల వారి మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని తల్లిదండ్రులే టీచర్లకు ఫిర్యాదులు చేస్తున్నారని వివరించారు. అవసరమైతే దీనిపై ఒక సర్వే నిర్వహించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

పారిశ్రామిక ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించాలి: ఏపీ చాంబర్స్

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడేలా ఉత్తరాంధ్రకు బల్క్‌డ్రగ్ పార్క్, కోస్తాంధ్రకు మెడ్‌టెక్ జోన్, ప్రకాశం జిల్లాకు మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ పార్క్‌లను మంజూరు చేయాలని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) శుక్రవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలదొక్కుకుని అభివృద్ధి సాధించేందుకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను పెంచాలని, రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు ప్రోత్సాహకాలు అందించాలని కోరింది. ఏపీ పునర్విభజన చట్టంలో హామీ ఇచ్చిన ప్రాజెక్టులన్నీ వేగంగా పూర్తి చేయాలని కోరింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 20 జూలై 2024

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో
ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషనన్లు వర్తిస్తాయి. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: బయోఇన్ఫర్మాటిక్స్ 17, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 18, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 18, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 18, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ 15, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- అభ్యర్థులు తమవెంట తీసుకురావాల్సిన పత్రాలు: పదోతరగతి, ఇంటర్, బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/తత్సమాన కోర్సు సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; గేట్ వ్యాలిడ్ స్కోర్ కార్డ్; కులం, వైకల్యం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు
- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in



ఆంధ్ర యూనివర్సిటీలో
బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లికింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్: ఇందులో అయిదు సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; బీఎస్‌లో కంప్యూటర్ సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఎంఎస్‌లో కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకటి ఎంచుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఇందులో అయిదు సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; బీఎస్, ఎంఎస్‌లలో కంప్యూటర్ సైన్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్: ఇందులో పది సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్; బీఎస్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్; ఎంఎస్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్-సెన్సార్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్‌ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్‌ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు ఫీజు:** రూ.2,200(ఎక్స్‌ఎల్ఆర్ఐ అందిస్తున్న పీజీడీఎంలో చేరాలంటే అదనంగా రూ.200 చెల్లించాలి)
- **ఎక్స్‌ఎల్ఆర్ఐ ప్రోగ్రామ్‌లు:** బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్, ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్, ఎక్స్‌ఎల్ఆర్ఐ-ఆర్‌బీఎస్ డబుల్ మాస్టర్స్ ప్రోగ్రామ్, ఇన్నోవేషన్-ఆంత్రప్రెన్యూర్‌షిప్-వెంచర్ క్రియేషన్ ప్రోగ్రామ్
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 20 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్‌ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **టెస్ట్ ప్రాథమిక కీ విడుదల:** 2025 జనవరి 10
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో
డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్, అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in



జాబ్ కార్నర్

నిమ్‌హాన్స్‌లో ఖాళీలు

ఖాళీలు 78

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)... ఖాళీగా ఉన్న గ్రూపు ఎ, బి, సి పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు

1. హిందీ ఆఫీసర్(అసిస్టెంట్ డైరెక్టర్): **1 పోస్టు**
2. లెక్చరర్(నర్సింగ్): **1 పోస్టు**
3. ఫిజిసిస్ట్ ఫర్ సైక్లోట్రోన్: 1 పోస్టు
4. సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్(న్యూరోమస్కులార్): **1పోస్టు**
5. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్: **5 పోస్టులు**
6. సైంటిస్ట్-సి(ఆయుర్వేద): **1 పోస్టు**
7. సైంటిస్ట్ - సి(కాగ్నెటివ్ సైన్స్): **1 పోస్టు**
8. సైంటిస్ట్-సి(న్యూరోఫిలాసఫీ): **1 పోస్టు**
9. సైంటిస్ట్-(యోగిక్ సైన్స్): **1 పోస్టు**

గ్రూప్-బి పోస్టు

10. అకౌంటెంట్: **11 పోస్టులు**
11. కంప్యూటర్ ప్రోగ్రామర్: **2 పోస్టులు**
12. ఈఈజీ టెక్నీషియన్: **2 పోస్టులు**
13. జూనియర్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్: **3 పోస్టులు**
14. మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్ట్: **18 పోస్టులు**
15. న్యూరో అనస్థీషియా టెక్నాలజిస్ట్: **4 పోస్టులు**
16. అక్యుపేషనల్ థెరపిస్ట్: **1 పోస్టు**
17. ఫిజియోథెరపిస్ట్: **2 పోస్టులు**
18. రీసెర్చ్ అసిస్టెంట్: **1 పోస్టు**
19. రేడియోలాజికల్ టెక్నాలజిస్ట్: **8 పోస్టులు**
20. సీనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
21. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
22. సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్: **2 పోస్టులు**
23. అసిస్టెంట్ డైటీషియన్: **2 పోస్టులు**

గ్రూప్-సి పోస్టులు

24. అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్: **2 పోస్టులు**
25. మెడికల్ రికార్డ్స్ టెక్నీషియన్: **2 పోస్టులు**
26. మార్చురి అసిస్టెంట్: **1 పోస్టు**
27. ఫార్మసిస్ట్: **1 పోస్టు**
28. యోగా థెరపిస్ట్: **1 పోస్టు**

విభాగాలు: సైకాలజీ, యోగా సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, న్యూరో సైకాలజీ, అనస్తీషియా, ఫిజియోథెరపీ, రేడియోగ్రఫీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో నర్సింగ్, డిగ్రీ, ఎంబీబీఎస్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 27 ఏళ్ల నుంచి 40 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఎ పోస్టులకు రూ.2360, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.1180; గ్రూప్-బి పోస్టులకు రూ.1180, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.885; గ్రూప్-సి పోస్టులకు రూ.885; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.590.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, నిమ్‌హాన్స్, పీబీ నెంబర్.2900, హోసూరు రోడ్, బెంగళూరు చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17

వెబ్‌సైట్: https://nimhans.ac.in/



ఎన్‌పీసీఎల్‌లో ఉద్యోగాలు

ఖాళీలు 74

బులంద్‌షహర్(ఉత్తరప్రదేశ్) జిల్లాలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)కు చెందిన నరోరా అటామిక్ పవర్ స్టేషన్...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. నర్స్-ఎ: **1 పోస్టు**
2. కేటగిరీ-1 స్టయిపెండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్/సైన్స్ గ్రాడ్యుయేట్లు: **12 పోస్టులు**
3. కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ/టెక్నీషియన్: **60 పోస్టులు**
4. ఎక్స్‌రే టెక్నీషియన్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో డిప్లొమా(నర్సింగ్), బీఎస్సీ(కెమిస్ట్రీ/మేథ్స్/స్టాటిస్టిక్స్), డిగ్రీ, బీఈ/బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: నర్స్-ఎ పోస్టుకు 30 ఏళ్లు, కేటగిరీ-1 స్టయిపెండరీ ట్రెయినీ, ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టులకు 25 ఏళ్లు, కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ పోస్టుకు 24 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు నర్స్-ఎ పోస్టుకు రూ.67,350; కేటగిరీ-1 స్టయిపెండరీ ట్రెయినీ పోస్టుకు రూ.53,100; కేటగిరీ-2 స్టయిపెండరీ పోస్టుకు రూ.32,550; ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టుకు రూ.38,250.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, ఫిజికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5

వెబ్‌సైట్: www.npcil.nic.in/

ఇఫ్‌కోలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్, ప్రధాన కార్యాలయం..కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ సివిల్.

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ఓబీసీ అభ్యర్థులు కనీసం 60 శాతం ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 55 శాతం చాలు.


గరిష్ఠ వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు రూ.35,000

ఎంపిక విధానం: ప్రిలిమినరీ కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఫైనల్ ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

వెబ్‌సైట్: www.iffco.in/




లిటిల్స్

పులిగోరు

కృష్ణాపురంలో ఉండే కేశవానంద అనే స్వామీజీ వద్దకు రమణ అనే యువకుడు వచ్చి స్వామీ నాకు కోపం చాలా ఎక్కువగా వస్తూంది. దాని వల్ల అందరితో గొడవలు పడుతున్నాను .ఎవరిని చూసినా చిరాకుగా ఉంటుంది నాకు ఏదైనా ఉపాయం చెప్పండి అని అడిగాడు. దానికి ఆ స్వామీజీ నాయనా నీ కోపం చిరాకు తగ్గాలి అంటే నువ్వు అసలైన పులి గోరు మెడలో వేసుకోవాలి. పక్కనున్న అడవిలో ఒక పులి ఉంది దాని వద్దకు వెళ్లి నా పేరు చెప్పు నీకు గోరు ఇచ్చి పంపుతుంది. అన్నాడు అని రమణ అడవికి వెళ్లి ఒక బక్కచిక్కిన ముసలి పులిని కలిసి, కేశవ్ ఆనంద స్వామి పేరు చెప్పి తనకు గోరు కావాలని అడిగాడు. దానికి ఆ



పులి, నాకు ముసలితనం వచ్చి, చూపు సరిగా ఆనడంలేదు. నువ్వు నాకు రోజూ ఆహారం తెచ్చిస్తే నీకు గోరు ఇస్తానుఅన్నది దానికి సరేనన్న రమణ ప్రతిరోజూ మాంసం, చేపలు తీసుకెళ్లి పులికి ఇచ్చేవాడు. కొన్ని రోజుల తర్వాత ఆ పులి ఇక నేడో రేపో నేను చనిపోతాను. నేను చనిపోగానే నా గోళ్లు నువ్వు తీసుకెళ్లవచ్చు అని అదేరోజున ఆ పులి చనిపోయింది. పులి చనిపోవడం చూసి, చాలా బాధ పడిన రమణ సామీజీ వద్దకు వచ్చి, దుఃఖ పడ్డాడు అది చూసన సామీజీ ఇపుడు చనిపోయిన పులి మీద ఎంత జాలి, ప్రేమ చూపిస్తున్నావో, అదే ప్రేమ నీతోటి మనుషుల మీద కూడా చూపించు. నీ కోపం, చిరాకు ఇట్టే తగ్గుతాయి అని చెప్పాడు. ఆ రోజునుండి రమణ చుట్టూ ఉన్న అందరిలో మంచిని చూడసాగాడు.



6 తేడాలు గుర్తించండి?

దారి కనుక్కోండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 363

					3			
		8					7	6
	7			2		5	9	
	3	1	2		8			
6			1		7			5
			6		9	1	3	
	4	2		6			1	
9	8					2		
			4					

సుడోకు - 362 సమాధానం

2	3	1	4
4	1	3	2
3	4	2	1
1	2	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.